


# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





ఫస్టియర్ ఇంటర్‌కు పరీక్షలుండవు..

10



# షో అదిరింది!

ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటనలో భాగంగా నిర్వహించిన రోడ్ షో సూపర్ సక్సెస్ అయ్యింది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒకే వాహనంపై సిరిపురం కూడలి నుంచి బహిరంగ సభా వేదికైన ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం వరకు రోడ్ షో నిర్వహించారు. రోడ్ షోలో అడుగడుగునా పూలు చల్లుతూ ప్రజలు ఘనస్వాగతం పలికారు. మోదీ, చంద్రబాబు, పవన్ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. రోడ్ షో అనంతరం ఏయూ ఇంజినీరింగ్ గ్రౌండ్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగసభకు హాజరైన మోదీకి రాష్ట్ర ప్రజల తరపున అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ స్వాగతం పలికారు. వేదికపై ప్రధాని మోదీని సీఎం చంద్రబాబు సత్కరించి.. శేషశయనుడి విగ్రహం, అరకు కాఫీ కిట్‌ను బహూకరించారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఎంపీలు భరత్, పురందేశ్వరి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు సభకు హాజరయ్యారు.

త్రిమూర్తులపై పూల వాన



7



2

## మీ లక్ష్యం వెనుక నేనుంటా..!

- ఏపీకి ప్రధాని నరేంద్ర మోదీ భరోసా
- అన్ని రంగాల్లో రాష్ట్రానికి మద్దతు
- రాష్ట్ర వికాసానికి ఈ ప్రాజెక్టులే ఊతం
- ప్రధాని మోదీ పర్యటన సూపర్ సక్సెస్
- పూలవాన మధ్య భారీగా సాగిన రోడ్ షో



3

## గ్లోబల్ లీడర్ మన మోదీ..

- అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన
- ఇవీ నరేంద్ర మోదీ నినాదాలు..
- రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే సుదినమిది..
- రూ.2,08,548 కోట్ల పనులకు శ్రీకారం
- విశాఖ సభలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన



4

## విధ్వంసం నుంచి వికాసానికి..

- విధ్వంసం నుంచి వికాసానికి..
- ప్రజా నమ్మకాన్ని నిలుపుకున్నాం
- చీకటినుంచి వెలుగులకు వచ్చాం
- ప్రధాని మోదీయే శ్రీరామ రక్ష
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం



5

## ఏపీకి.. మోదీయే ఆక్సిజన్..

- ఏపీ చరిత్రలో ఇదొక సువర్ణాధ్యాయం
- వికసిత భారత్ స్ఫూర్తితో ముందుకి...
- శక్తివంతమైన భారత్.. మోదీకే సాధ్యం
- పీఎం అంటే.. పీపుల్స్ మ్యాన్
- రాష్ట్ర విద్య, ఐటీ మంత్రి లోకేష్ ప్రశంస



8

## నేడు తిరుపతికి బాబు

## తిరుపతిలో తొక్కిసలాట

# ఆరుగురు దుర్మరణం

- తిరుపతిలో తొక్కిసలాట
- ఆరుగురు భక్తులు దుర్మరణం
- మృతుల్లో ఐదుగురు మహిళలే
- సమాచారంతో హతాశులైన సీఎం
- భక్తుల మరణంపట్ల తీవ్ర దిగ్భ్రాంతి
- పెరుగుతున్న మరణాలపై ఆందోళన
- క్షతగాత్రులకు రుయా, స్విమ్స్‌లో చికిత్స
- మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక ఆదేశాలు
- ఏర్పాట్ల వైఫల్యంపై భక్తుల ఆగ్రహం
- దుర్ఘటనపై అనుమానాల నీలినీడలు
- కుట్రకోణం ఉండి ఉండొచ్చన్న భక్తులు

ప్రధాని మోదీ, లోకేష్, పవన్ తీవ్ర దిగ్భ్రాంతి

8

# మీ లక్ష్యం వెనుక నేనుంటా

- ఏపీకి ప్రధాని నరేంద్ర మోదీ భరోసా
- అన్ని రంగాల్లో రాష్ట్రానికి మద్దతు
- రాష్ట్ర వికాసానికి ఈ ప్రాజెక్టులే ఊతం
- ప్రధాని మోదీ పర్యటన సూపర్ సక్సెస్
- పూలవాన మధ్య భారీగా సాగిన రోడ్ షో



విశాఖపట్నం (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టుకున్న లక్ష్యాలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. ఏపీలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆశయాల సాధనకు మద్దతుగా నిలుస్తామని మోదీ హామీ ఇచ్చారు. "ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు. మీ ఆశీర్వాదంతో 60 ఏళ్ల తర్వాత తొలిసారి మేం మూడోసారి అధికారంలోకి వచ్చాం. రాష్ట్రానికి అన్ని రంగాల్లో మద్దతుగా నిలుస్తున్నాం. 2047నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రాష్ట్రంతో భుజం భుజం కలిపి నడుస్తాం. ఇవాళ తలపెట్టిన ప్రాజెక్టులు రాష్ట్ర వికాసానికి తోడ్పడతాయి. ఐటీ, టెక్నాలజీకి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కేంద్రం కానుంది. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు చేరుస్తాయి. 2030లోగా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి మా లక్ష్యం. దేశంలో 2 గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు వస్తుంటే.. దానిలో ఒకటి విశాఖకు కేటాయించాం. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తుంది" అని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు.

"నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కుకు శంకుస్థాపన చేశాం. కేవలం 3 రాష్ట్రాల్లోనే ఇలాంటి పార్కులు వస్తున్నాయి. చెన్నై- బెంగళూరు పారిశ్రామిక కారిడార్లో క్రిస్ సిటీ భాగం అవుతుంది. ఇప్పటికే శ్రీసిటీ ద్వారా ఏపీలో తయారీరంగం ఊపందుకుంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు పునాదిరాయి వేశాం. రాష్ట్ర అభివృద్ధిలో రైల్వే జోన్ కీలకం కానుంది. రైల్వే జోన్ ద్వారా రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుంది. రైల్వే జోన్‌వల్ల వ్యవసాయ, పర్యాటకరంగాలు ఊపందుకుంటాయి.. రాష్ట్రంలో ఇప్పటికే 7 వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. అమృత్ భారత్ కింద ఏపీలోని 70కి పైగా రైల్వేస్టేషన్లు ఆధునికీకరణ చేపట్టాం" అని ప్రధాని వివరించారు. బహిరంగ సభకు ముందు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన కల్యాణ్‌తో కలిసి ప్రధాని మోదీ నిర్వహించిన రోడ్ షో అట్టహాసంగా సాగింది. రోడ్లపై బారులు తీరిన ప్రజలు ముగ్గురిపై పూలవాన కురిపిస్తుంటే.. ప్రజలకు అభివాదం చేస్తూ మోదీ ముందుకు కదిలారు. అనంతరం భారీఎత్తున బహిరంగ సభ సాగింది. సభలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనిత, టీజీ భరత్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు కార్యక్రమంలో పాల్గొన్నారు.







## మోదీకి ఘన స్వాగతం

విశాఖపట్నం (చైతన్య రథం): ప్రధాని నరేంద్ర మోదీకి విశాఖలో ఘన స్వాగతం లభించింది. విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్న ప్రధానికి సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. విశాఖలో రూ.2 లక్షల కోట్లకుపైగా విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారు. రైల్వే జోన్, పారిశ్రామిక హబ్, గ్రీన్ హైడ్రోజన్ హబ్, బల్క్ డ్రగ్ పార్క్‌కు వర్చ్యువల్‌గా శంకుస్థాపన చేశారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కలిసి నిర్వహించిన భారీ రోడ్ షో న భూతో న భవిష్యతి అన్నట్టు సాగింది.




## రోడ్ షో సూపర్ సక్సెస్

విశాఖపట్నం (చైతన్య రథం): ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటనలో భాగంగా నిర్వహించిన రోడ్ షో సూపర్ సక్సెస్ అయ్యింది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒకే వాహనంపై సిరిపురం కూడలి నుంచి బహిరంగ సభా వేదికైన ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం వరకు రోడ్ షో నిర్వహించారు. రోడ్ షోలో అడుగడుగునా పూలు చల్లుతూ ప్రజలు ఘనస్వాగతం పలికారు. మోదీ, చంద్రబాబు, పవన్ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. రోడ్ షో అనంతరం ఏయూ ఇంజినీరింగ్ గ్రౌండ్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగసభకు హాజరైన మోదీకి రాష్ట్ర ప్రజల తరపున అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ స్వాగతం పలికారు. వేదికపై ప్రధాని మోదీని సీఎం చంద్రబాబు సత్కరించి.. శేషశయనుడి విగ్రహం, అరకు కాఫీ కిట్‌ను బహూకరించారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఎంపీలు భరత్, పురందేశ్వరి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు సభకు హాజరయ్యారు.



# గ్లోబల్ లీడర్.. మోదీ

- అభివృద్ధి, సంక్షేమం, సంస్కరణలు, సుపరిపాలన
- ఇవీ భారత ప్రధాని నరేంద్ర మోదీ నినాదాలు..
- రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే సుదినమిది..
- ఏకకాలంలో రూ.2,08,548 కోట్ల పనులకు శ్రీకారం
- ఇంతటి శుభదినం నా జీవితంలో ప్రథమం..
- నదుల అనుసంధానానికి కేంద్రం సాయం చేయాలి
- ఎన్డీయే కాంబినేషన్ భవిష్యత్తులోనూ కొనసాగుతుంది
- విశాఖ సభలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
- ప్రధాని మోదీతో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం



అనకాపల్లి (చైతన్య రథం): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రపంచం మెచ్చిన నాయకుడని, మోదీ దేశానికే కాకుండా ప్రపంచంలో ఎక్కడికెళ్లినా గ్లోబల్ లీడర్‌గా ఉంటారని సీఎం చంద్రబాబు అన్నారు. భవిష్యత్తులో ప్రధాని మోదీ స్ఫూర్తితో ముందుకెళ్తామని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో రూ.2,08,548 కోట్ల విలువైన పనులకు ప్రధాని మోదీతో కలిసి శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఏయూ ఇంజనీరింగ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు తరలివచ్చిన జనసందోహాన్ని ఉద్దేశించి సీఎం చంద్రబాబు ప్రసంగించారు.

## ఇటువంటి శుభదినం నా జీవితంలో చూడలేదు

'సభకు తరలొచ్చిన ప్రజానీకాన్ని చూస్తుంటే ఎక్కడ లేని ఆనందం కలుగుతోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రోడ్ షో అదిరింది. ప్రజల్లో విశ్వాసం, నమ్మకమున్న నాయకుడు ప్రధాని మోదీ. రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే రోజు ఇది. ప్రధాని మోదీ చేతుల మీదుగా రాష్ట్రంలో రూ.2,08,548 కోట్ల విలువైన పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకున్నాం. ఇటువంటి శుభదినం నా జీవితంలో మొదటిసారి. పూడిమడక వద్ద ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్‌లో రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతోంది. విశాఖవాసుల చిరకాల కాంక్ష అయిన రైల్వేజోన్‌కు కూడా శంకుస్థాపన చేశాం. రైల్వే జోన్‌కు భూమి కేటాయించాలని కేంద్రం అడిగినా గత ప్రభుత్వం ఇవ్వలేదు. అధికారంలోకి రాగానే 52 ఎకరాల భూమి ఇచ్చాం. నేడు ప్రధాని ఆశీస్సులతో జోన్ పనులు ప్రారంభమయ్యాయి. నక్కపల్లిలో రూ.1877 కోట్లు పెట్టుబడులతో బల్క్ డ్రగ్ పార్క్, రూ.4,593 కోట్లతో 10 ప్రాజెక్టులకు సంబంధించి రోడ్ల నిర్మాణం, విస్తరణ పనులు, రూ.2,139 కోట్లతో కృష్ణపట్నం పారిశ్రామిక పార్క్, రూ.6,028 కోట్లతో 6 రైల్వే ప్రాజెక్టులు, రూ.3,044 కోట్లతో 234.28 కి.మీ రోడ్లు, రూ.5,718 కోట్లతో 323 కి.మీ మూడు రైల్వే లైన్ పనులకు శంకుస్థాన చేసుకున్నాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

## భవిష్యత్తులోనూ ఈ కాంబినేషన్..

'మన ప్రభుత్వం వచ్చి ఏడునెలలే అయింది. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక ఏపీకి మోదీ మొదటిసారి వచ్చి రూ.2,08,548 కోట్ల పనులకు శంకుస్థాన, ప్రారంభోత్సవాలు చేయడంపై ధన్యవాదాలు తెలుపుతున్నా. అనునిత్యం అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి ప్రజలకు ప్రధాని మోదీ దగ్గరయ్యారు. మోదీపై అభిమానం ఉత్తరాదికి పరిమితం అంటున్నారు. కానీ మోదీ.. దేశం, ప్రపంచం మెచ్చే నాయకుడు. మొన్నటి ఎన్నికల్లో నరేంద్రమోదీ, నా మిత్రుడు పవన్ కళ్యాణ్, నేను కలిసి పోటీ చేశాం. రాష్ట్ర చరిత్రలో లేని విజయాన్ని ప్రజలు మాకు ఇచ్చారు. 93 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్లు వేసి 164 అసెంబ్లీ సీట్లు, 21 ఎంపీ స్థానాల్లో విజయం కట్టబెట్టారు. భవిష్యత్తులోనూ ఏపీలో ఇదే కాంబినేషన్ కొనసాగుతుంది. ప్రధానిగా మోదీ ఉంటారు. హర్యానా, మహారాష్ట్రలో మోదీ నాయకత్వంలో ఎన్డీయే ఘన విజయం సాధించిందంటే అదీ మోదీ చరిష్మా. రాసిపెట్టుకోండి ఢిల్లీలో గెలిచేది కూడా ఎన్డీయేనే. దానికి కారణం దేశం కోసం మోదీ పని చేసిన విధానం' అని మోదీపై సీఎం చంద్రబాబు ప్రశంసలు కురిపించారు.

## మోదీ నినాదం సంక్షేమం, అభివృద్ధి

'మోదీజీ... ప్రజల కోసం నిత్యం పోరాడే మీకు ప్రజలంతా అండగా ఉన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలు, సుపరిపాలన అనే నినాదాలతో దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. పీఎం కిసాన్ నిధి కింద ఏడాదికి రైతులకు రూ.6 వేలు ఇస్తున్నారు. కరోనా సమయం నుంచి ఉచిత రేషన్ ఇస్తున్నారు. మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా, గతిశక్తి, భారత మాలవంటి ఉద్యమ కార్యక్రమాలతో దేశాన్ని ముందుకు తీసుకెళు తున్నారు. ఇళ్లులేని పేదలకు ఇళ్లు కట్టిస్తున్నారు. జనవరి 1న జరిగిన కేబినెట్ మీటింగ్‌లో 4 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరేలా పీఎం పసల్ బీమాను పెంచారు. రూ.3,850 కోట్లతో ఎరువుల సబ్సిడీ కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. పేదల కోసం పీఎం సూర్యఘర్, కుసుమ్‌వంటి పథకాలను తీసుకొచ్చారు. 7నెలల్లోనే ఇవన్నీ చేయగలిగారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ నినాదాలతో మోదీ ముందుకెళ్తున్నారు. 2014 నాటికి ఆర్థిక వ్యవస్థలో 11వ స్థానంలో ఉన్న భారత్‌ను 5 స్థానానికి తీసుకొచ్చారు. 2029 నాటికి 3వ స్థానానికి, 2047నాటికి ప్రపంచంలో దేశం రెండు లేదా మొదటి స్థానంలో ఉంటుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఇది మరెవరికీ సాధ్యం కాదు... ఒక్క మోదీకే సాధ్యం' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో ఊపందుకున్న పెట్టుబడులు

'విభజన సమయంలో ఏపీకి న్యాయం చేయాలని కోరారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక ఏపీ జీవనాడి అయిన పోలవరం పనులు ఆగకుండా జరగడం కోసం 7 ముంపు మండలాలను ఏపీలో విలీనం చేస్తూ నాడు తొలి కేబినెట్ సమావేశంలోనే ఆమోదించారు. విభజన హామీల్లో భాగంగా ఐఐటీ, ఐఐఎం, నిట్, ఎయిమ్స్, ట్రైబల్ యూనివర్సిటీ, సెంట్రల్ వర్సిటీ వంటి దాదాపు 12 సంస్థలను రాష్ట్రానికి కేటాయించారు. మళ్లీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్రం ఆక్సిజన్ ఇచ్చింది. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వంలో పెంచిన పింఛన్లు, అన్న క్యాంటీన్లు, దీపం కింద ఆడబిడ్డలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. త్వరలోనే మెగా డీఎస్సీ నిర్వహిస్తాం. ఎన్నికల ముందు చెప్పిన విధంగా సూపర్-6 హామీలను అమలు చేసే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటుంది. కష్టాలు, సమస్యలు ఉన్నాయి అధిగమిస్తాం. ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని అందిస్తూ రాష్ట్రాన్ని సుపరిపాలనలో ముందుకు తీసుకెళ్తాం. రాష్ట్రంలో పెట్టుడులు ఊపందుకున్నాయి. రాష్ట్ర బ్రాండ్‌ను పెంచుకుంటున్నాం. దేశానికి ముంబై ఏవిధంగా ఆర్థిక రాజధానిగా ఉందో, మన రాష్ట్రానికి విశాఖపట్నం కూడా ఆర్థిక రాజధాని. ఐటీ, ఫార్మా, పర్యాటక రంగాలు విశాఖలో పురోగతిలో ఉన్నాయి. ప్రధాని మోదీ అరకు కాఫీని ప్రమోట్ చేయడంతో ప్రపంచం మొత్తం మోస్ట్ బ్రాండ్‌గా తయారైంది' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## మోదీజీ... మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకుంటాం

'మోదీజీ... మీరు అభివృద్ధికి అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. మేము మిమ్మల్ని ఎప్పుడూ స్ఫూర్తిగా తీసుకుంటాం. అమరావతి రాజధానికి మీరే శంకుస్థాపన చేశారు. మీ ఆశీస్సులతోనే రాజధానిని పూర్తి చేసుకుంటాం. దాన్ని మీరే ప్రారంభిస్తారు. మీరు ఒకసారి అమరావతి రావాలని కోరుతున్నాం. నదుల అనుసంధానికి కూడా మీరు ప్రాధాన్యమిస్తారు. పోలవరం ప్రాజెక్టును మీ నాయకత్వంలో పూర్తి చేస్తాం. మీ ఆశీస్సులతో నదుల అనుసంధానం ప్రారంభిస్తున్నాం. మీ ఆశీస్సులతోనే పూర్తి చేస్తాం. బీపీసీఎల్ ప్రాజెక్టు అత్యంత వెనకబడిన ప్రాంతమైన రామాయపట్నం వచ్చింది. రాష్ట్ర ప్రజల మీకు ధన్యవాదాలు చెబుతున్నారు. గూగుల్ కూడా ఏఐలో పెట్టుబడులు పెట్టేందుకు విశాఖపట్నం వస్తోంది. గూగుల్ ప్రతినిధులు నాతో సమావేశమైనప్పుడు భవిష్యత్తులో పన్నులు పెంచే అవకాశం ఉందా? అని ప్రస్తావించారు. ఇటీవల ప్రధానితో సమావేశమైనప్పుడు ఈ అంశం ప్రస్తావించాను. ప్రభుత్వం తెచ్చిన పాలసీల్లో మార్పులు ఉండవు.. మీరు ధైర్యంగా ముందుకెళ్లండని చెప్పారు. దీనికంటే విశాఖ ప్రజలకు ఏంకావాలి? మోదీజీ... మీ బడి, నా బడి ఒకటే. రేపు చేయాల్సిన పని, నిన్ననే చేసి ఉంటే బాగుండేదని ఆలోచించే ప్రధాని ఉండటం మన రాష్ట్ర ప్రజల అదృష్టం. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి ఎన్డీయే విధానం. కొప్పర్తి, ఓర్వకల్లుకు ఇండస్ట్రియల్‌పార్కులు వచ్చాయి. ఎన్నికల ముందు చెప్పిన విధంగానే యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తాం. వికసిత్ భారత్ నరేంద్ర మోదీ కల. స్వర్ణాంధ్రప్రదేశ్ మన కల. ప్రధాని దేశాన్ని ప్రపంచంలో నిలబెడితే... 2047 నాటికి ఏపీ దేశంలో అగ్రస్థానంలో ఉండాలి. 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాయి. మళ్లీ ఇప్పుడు సరైన సమయంలో మోదీ దేశానికి ప్రధాని అయ్యారు' అని సీఎం చంద్రబాబు ఆనందం వ్యక్తం చేశారు.

## ఇక విజయాలు తప్ప అపజయాలు ఉండవు

'మంచి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు నిరంతరం కొనసాగించాలి. మధ్యలో వచ్చే విధ్వంస పాలకులతో లక్ష్యాన్ని చేరుకోలేం. నిరంతర పాలన ఇస్తే ఏవిధంగా అభివృద్ధి జరుగుతుందో చేసి నిరూపించిన వ్యక్తి మోదీ. ఎన్డీయే బలంగా ఉంటే దేశం బలంగా ఉంటుంది. ఇక్కడ కూటమి ధృడంగా ఉంటే ఏపీ బలంగా ఉంటుంది. డబుల్ ఇంజన్ సర్కార్... డబుల్ డిజిట్ గ్రోత్. రెండు ప్రభుత్వాలు ఒక్కటిగా ఉంటే రెండంకెల వృద్ధి సాధ్యమై పేదరికం పోతుంది. కూటమి తరపున హామీ ఇస్తున్నా... పేదరికం లేని, ఆర్థిక అసమానతలు లేని సమాజ నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తాం. ఇది మొదటి అడుగు... ఇక జయాలే తప్ప అపజయం ఉండదు.' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.










# విధ్వంసం నుంచి వికాసానికి..

- ఎన్డీయేపై ప్రజా నమ్మకాన్ని నిలుపుకున్నాం
- చీకటినుంచి వెలుగులకు అడుగులేస్తున్నాం
- ప్రధాని మోదీ సారథ్యమే శ్రీరామ రక్ష
- రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోంది..
- అందుకు నిదర్శనమే రూ.2 లక్షలకోట్ల అభివృద్ధి
- ఏడున్నర లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- భారత్‌ను ముందుకు నడిపిస్తున్న మోదీకి ప్రణామం
- విశాఖపట్నం సభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్





విశాఖపట్నం (చైతన్య రథం): 'అభివృద్ధికి ఆస్కారమేలేని ఆంధ్రప్రదేశ్ నుంచి.. అభివృద్ధి పుష్కలమైన ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి ఎన్డీయే ప్రభుత్వం కష్టపడి పని చేస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గత ఐదేళ్ల చీకటి రోజులు, అరాచక పాలననుంచి మళ్లీ వెలుగు రేఖలు పూయించడానికి అడుగులు వేస్తున్నామని, అందులో భాగమే రాష్ట్రానికి ఒకేసారి రూ.2.08 లక్షల కోట్ల పెట్టుబడులు, సుమారు ఏడున్నర లక్షల మందికి ఉపాధి కల్పించే మార్గాలను ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో తీసుకువచ్చామన్నారు. అభివృద్ధి నిరంతర యజ్ఞంగా కొనసాగాలని, ఎన్డీఏ కూటమిపై ప్రజలంతా ఉంచిన నమ్మకాన్ని నిలుపుకొంటూ మరింత అండగా నిలుస్తామని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత ఐదేళ్ల అరాచక, అభివృద్ధిరహిత పాలన నుంచి ఆంధ్రప్రదేశ్ మళ్లీ కొత్తగా తన ప్రయాణాన్ని అభివృద్ధి పథంలో మొదలుపెట్టబోతుందన్నారు. బుధవారం విశాఖపట్నం వేదికగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాష్ట్రవ్యాప్తంగా రూ.2.08 లక్షల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పూర్తైన పలు జాతీయ రహదారులు, ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఏయూ ఇంజినీరింగ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. "సదుద్దేశం.. సదాశయం లేకుండా ఒకరు కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నడిచినా అది నిరర్థక నడకగా చరిత్రలో మిగిలిపోతుంది. ఒక సదాశయం.. సత్సంకల్పంతో ఇంకొకకరు కన్యాకుమారి నుంచి కాశ్మీరు వరకు ప్రజలతో మమేకమై వారందర్నీ ఏకతాటిపై నడిపిస్తే అది ఆత్మ నిర్భర్ భారత్ అవుతుంది. అదే కన్యాకుమారి నుంచి కాశ్మీరు వరకు ప్రజలకు వారి పరిసరాల శుభ్రత, బాధ్యత తెలియజేస్తే అది స్వచ్ఛభారత్ అవుతుంది. అదే కన్యాకుమారి నుంచి కాశ్మీరు వరకు ప్రజల గుండెల్లో దేశభక్తి, ధైర్యసాహసాలు నింపితే అది పటిష్టమైన, బలిష్టమైన భారత్ అవుతుంది. అది ఒక రోజున అఖండ భారత్‌గా వర్ధిల్లుతుంది. ఒక బలమైన భారత్ కోసం, ధృఢమైన దేశం కోసం, జగత్ అంతా వసుదైక కుటుంబం అనే భావన కోసం నాలుగున్నర దశాబ్దాలుగా పరితపిస్తూ, పరిశ్రమిస్తూ.. ఆ క్రమంలో ఎదురైన ప్రతి పరాజయాన్ని, ప్రతి అవమానాన్ని నవ్వుతూ స్వీకరిస్తూ.. వాటినే విజయానికి ఇంధనంగా వాడుకుంటూ.. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ.. భారత దేశాన్ని ప్రపంచంలోనే మూడవ బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేలా నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి నా తరఫున, ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున నమస్కారాలు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా తెలుగు ప్రజలను అభివృద్ధిపథంలో నడిపిస్తున్న దార్శనికులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి నమస్కారాలు. ఎన్డీఏ కూటమికి ఓటు వేసి 164 అసెంబ్లీ స్థానాలు, 21 పార్లమెంటు స్థానాలు కట్టబెట్టిన ప్రజలందరికీ పేరుపేరునా హృదయపూర్వక నమస్కారాలు' అన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్డీఏ ప్రభుత్వాన్ని నమ్మారు. నిలబడ్డారు. అలా నిలబడినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో ఈరోజున ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరుగుతున్నాయి. దక్షిణ కోస్తా రైల్వే జోన్, కృష్ణపట్నం ఇండస్ట్రియల్ పార్క్, గ్రీన్ హైడ్రోజన్ హబ్, అనకాపల్లి బల్క్ డ్రగ్ పార్క్, ఆరు కొత్త రైల్వే ప్రాజెక్టులు మొత్తం కలిపి రాష్ట్రానికి రూ.2.08 లక్షల కోట్ల పెట్టుబడులు, ఏడున్నర లక్షలమందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## అభివృద్ధిలో సమాన వాటా మోదీ సంకల్పం

అవినీతిలో కూరుకుపోయి ఉపాధి అవకాశాలు, ఉద్యోగ అవకాశాలు లేక రాష్ట్రం విలవిల్లాడుతున్న సమయంలో ప్రజలు కూటమికి అండగా నిలబడ్డారు. అందుకే ఈ రోజున రూ.రెండు లక్షల కోట్ల పైచిలుకు పెట్టుబడులతో ఏడున్నర లక్షలమందికి ఉపాధి అవకాశాలు లభించాయి. ఇవికాకుండా కొత్త హైవేల నిర్మాణం, విస్తరణ, రాజధాని అమరావతికి పెట్టుబడులు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్రానికి ఇచ్చారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ 24 గంటలు తాగునీరు ఇవ్వాలన్న తపన గౌరవ ప్రధానిది. ప్రజలు మా మీద పెట్టిన భరోసా.. నమ్మకం.. ప్రధాన మంత్రిపై చూపిన నమ్మకం నేడు రూ.రెండు లక్షల కోట్ల పైచిలుకు పెట్టుబడులుగా ఇక్కడికి వచ్చాయి. 70 ఏళ్ల పాలనలో మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు. ఆ గ్రామాలకు ప్రధాన మంత్రి సడక్ యోజన పథకం కింద రోడ్లు వేయగలుగుతున్నామంటే దానికి ప్రధాని ముందుండి వెన్నుతట్టి నిధులు సమకూరుస్తుండడమే కారణం. భారతదేశంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి ఆయన ఆశయం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరాంధ్ర, రాయలసీమ, కోస్తాంధ్ర ఏప్రాంతం అభివృద్ధిలో వెనుకబడకూడదు. అభివృద్ధిలో అందరికీ సమాన వాటా ఉండాలన్న ఆయన సంకల్పమే ఈ పెట్టుబడులు. వారి సంకల్పానికి, సహకారానికి ఆయన మార్గదర్శకత్వానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు అన్నారు.

## రాష్ట్రాభివృద్ధికి రేయింబవళ్లు కష్టపడతాం

ఆంధ్ర అభివృద్ధికి అస్కారమే లేదనే పరిస్థితి నుంచి అభివృద్ధి అంటే ఆంధ్రప్రదేశ్ అని చెప్పుకొనేలా చంద్రబాబునాయుడు నాయకత్వంలో, ప్రధాని నిర్దేశకత్వంలో ముందుకు వెళ్తున్నామని పవన్ కల్యాణ్ అన్నారు. వారి సూచనలు, సలహాలతో రాష్ట్రాభివృద్ధికి రేయింబవళ్లు కష్టపడతామని చెప్పారు. దేశ ప్రగతిలో భాగస్వాములై ప్రధానికి అండగా ఉంటామన్నారు. అయితే, ప్రజలంతా ఇదే సహకారం ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పవన్ కల్యాణ్ అన్నారు. దేశాన్ని మరింత ప్రగతిపథంలో నడిపించేలా నరేంద్ర మోదీకి దీర్ఘాయుష్షు, ఆరోగ్యం ఇవ్వాలని లక్ష్మీ నరసింహస్వామిని కోరుకుంటున్నాను అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు.

- ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చరిత్రలో ఇదొక సువర్ణాధ్యాయం
- వికసిత భారత్ స్ఫూర్తితో ముందుకెళ్తున్నాం..
- శక్తివంతమైన భారత్ నిర్మాణంలో భాగస్వాములవుతాం
- మోడీ పీపుల్స్ మ్యాన్... పేదవాడి కళ్లలో వెలుగుకు రూపం
- విశాఖపట్నం సభలో రాష్ట్ర విద్య, ఐటీ మంత్రి లోకేష్

# ఏపీకి.. మోదీ ఆక్సిజన్!



విశాఖపట్నం (చైతన్య రథం): గత ప్రభుత్వ అసమర్థతతో వెంటిలేటర్‌పైకి వెళ్లిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ఆక్సిజన్ అందిస్తున్నారని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ అన్నారు. విశాఖపట్నం ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్ వేదికనుంచి రూ.2లక్షల కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని మోడీ వర్చువల్‌గా శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రతి నెలా రూ.4 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో ఏపీ ప్రభుత్వం నడుస్తోంది. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆక్సిజన్ అందిస్తున్నారు. అమరావతికి రూ.15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ.12157 కోట్ల కేంద్రంనుంచి సాయం అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతనే భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు వేగవంతమయ్యాయి. ఎన్ని ఇబ్బందులున్నా ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారు. వెయ్యి రూపాయల పెన్షన్ పెంచడానికి 5 ఏళ్లు తీసుకున్న గత ప్రభుత్వాన్ని చూసాం. కానీ చంద్రబాబు ఒకే ఒక్క సంతకంతో వెయ్యి రూపాయలమేర పెన్షన్ పెంచారు. మూసేసిన అన్న క్యాంటీన్లు తెరిచాం, దీపం పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారు, త్వరలోనే మెగా డీఎస్సీ, త్వరలోనే జాబ్ క్యాలెండర్ ఇవ్వబోతున్నారు. దటీజ్ సీబీఎన్. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చరిత్రలో ఈరోజు సువర్ణాధ్యాయం' అని లోకేష్ వ్యాఖ్యానించారు.

## వికసిత్ భారత్ స్ఫూర్తితోనే స్వర్ణాంధ్ర 2047

బ్యూటీఫుల్ సిటీ ఆఫ్ డెస్టినీ విశాఖపట్నం తరపున ప్రధాని నరేంద్రమోదీకి స్వాగతం. ప్రతి భారతీయుడి గుండెల్లో చోటు సంపాదించిన మోదీవైపు ప్రపంచమంతా చూస్తోంది. నరేంద్రమోడీ పీఎం అనే పదానికి అర్థాన్ని మార్చేశారు. పీఎం అంటే ప్రైమ్ మినిస్టర్, కాని నరేంద్ర మోదీ పీపుల్స్ మ్యాన్. నరేంద్ర మోదీజీ విజన్ గ్లోబల్. అయినా అతని హృదయం మాత్రం పేద ప్రజలతోనే ఉంటుంది. నమో అంటే పేదవాడి నమ్మకం, పేదవాడి భరోసా, దేశానికి ధైర్యం. పేదల చిరునవ్వు, మహిళల ఆత్మగౌరవం, యువత భవిత, అన్నదాత కళ్ళలో ఆనందానికి ప్రతిరూపం మోదీజీ. వికసిత్ భారత్ -2047 విజన్ డాక్యుమెంట్ రిలీజ్ చేసి 2047కి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తయారు చెయ్యాలనే లక్ష్యంతో మోదీజీ పనిచేస్తున్నారు. 2014నాటికి ప్రపంచంలో 11వ స్థానంలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థ నేడు 5వ స్థానానికి వచ్చింది. వికసిత్ భారత్ -2047 లక్ష్యంతో టాప్ 1 లేదా 2 ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని మార్చేందుకు మోదీ కృషి చేస్తున్నారు. నరేంద్ర మోదీ వికసిత్ భారత్ స్ఫూర్తితో మన సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర -2047 విజన్ డాక్యుమెంట్ రిలీజ్ చేసారు. దిమాక్ ఉన్నవాడు దునియా మొత్తం చూస్తాడు. చంద్రబాబు విజన్ -2020 అంటే ఎంతోమంది నవ్వారు, వెటకారంగా మాట్లాడారు. కానీ ఇప్పుడు హైదరాబాద్ వెళ్లి చూస్తే ఆయన విజన్ 2020లో చెప్పిన ప్రతి మాట నిజమైంది. వ్యవసాయం, విద్య, వైద్యం, పరిశ్రమలు, రెన్యువబుల్ ఎనర్జీ, పోర్ట్స్, ఎయిర్పోర్ట్స్, స్పోర్ట్స్ ఇలా అన్ని రంగాల్లో నిర్ణీత లక్ష్యాలతో ముందుకు వెళ్లడమే స్వర్ణాంధ్ర -2047 ముఖ్యోద్దేశం' అని లోకేష్ అన్నారు.

## స్థిరమైన ప్రభుత్వాలు కొనసాగితేనే అభివృద్ధి

'ఈరోజు చరిత్రలో నిలిచిపోతుంది. రాష్ట్ర దశ దిశ మార్చే ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరిక విశాఖ రైల్వే జోన్. గత ప్రభుత్వం కనీసం భూమి కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖ రైల్వే జోన్ ట్రాక్ ఎక్కింది. నేడు మోదీజీ దానికి శంకుస్థాపన చేశారు. రూ.1.85 లక్షల కోట్లతో పూడిమడకలో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్, రూ.1877 కోట్లతో నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్. రూ.10,500 కోట్లతో కృష్ణపట్నంలో పరిశ్రమల ఏర్పాటు, రూ.8016 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు... ఇంకా అనేక కార్యక్రమాలకు మోదీజీ శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రజల తరపున నరేంద్ర మోదీజీ, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. స్థిరమైన ప్రభుత్వ కొనసాగింపు అభివృద్ధికి చాలా ముఖ్యం. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని అయ్యారు. మూడోసారి దేశంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడింది. అందుకే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా ఆలోచించాలి.

2014 -19 వరకూ ఎన్డీయే ప్రభుత్వంలో రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందిందో మీకు తెలుసు. తరువాత 2019-24 నడుమ జరిగిన విధ్వంసం కళ్లారా చూశారు. అదే ఎన్‌డిఎ ప్రభుత్వం కొనసాగించి ఉంటే రాష్ట్రం ఈ పరిస్థితుల్లో ఉండేది కాదు. ఆంధ్రప్రదేశ్‌పై మోడీజీ చూపుతున్న ప్రేమ, అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు. ఆంధ్రప్రదేశ్‌లోని డబుల్ ఇంజన్ సర్కారు వేగవంతమైన ఆర్థికాభివృద్ధి సాధిస్తూ, శక్తివంతమైన భారతదేశ నిర్మాణంలో భాగస్వామ్యం వహించబోతోంది. ఆంధ్రప్రదేశ్‌కు మీరు పెద్దన్నలా సహకారం అందించండి. వికసిత్ భారత్ -2047 లక్ష్యాల సాధనలో మేం భాగస్వాములం అవుతాం. రాష్ట్రాలు బలోపేతమైతేనే జాతి బలంగా తయారవుతుందని నేను నమ్ముతాను. ప్రస్తుతం భారత్‌లో నార్త్, సౌత్, ఈస్ట్, వెస్ట్ ఎక్కడ చూసినా "నమో" మేనియా మార్మోగుతోంది' అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.






# లోకేష్‌మీద మోదీ అనురక్తి..!

## ప్రధాని సభలో ఆసక్తికర సంఘటన

విశాఖపట్నం (చైతన్య రథం): యువనేత, ఐటీ మంత్రి నారా లోకేష్‌పై సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీ 'కంప్లయింట్' చేయడంతో.. గ్రీన్‌రూంలో కొన్ని క్షణాలపాటు ఉద్విఘ్న వాతావరణం చోటు చేసుకుంది. పైగా లోకేష్ తండ్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితోనే.. 'లోకేష్‌మీద కంప్లయింట్ మీకు కూడా తెలుసు కదా!' అని నరేంద్రమోదీ గంభీరంగా పలకడంతో.. మోదీకి ఆహ్వానం పలికేందుకు అక్కడికి వచ్చిన మంత్రులు ఏం జరుగుతుందో అర్థంగాక కొన్ని క్షణాలపాటు స్థాణువులా ఉండిపోయారు. ఏం జరిగిందంటే - వేదికపైకి వెళ్లేముందు గ్రీన్ రూంలో ప్రధానిని ఆహ్వానించడానికి మంత్రులు సిద్ధంగా ఉన్నారు. గంభీర వదనంతో అక్కడికి చేరుకున్న ప్రధానికి ఒక్కొక్కరూ గౌరవంగా నమస్కరిస్తూ ఆహ్వానం పలికారు. మంత్రులను వరుసగా పలకరిస్తూ వచ్చిన ప్రధాని ఐటీ మంత్రి నారా లోకేష్ వద్ద ఆగారు. ప్రధానికి లోకేష్ నమస్కరిస్తున్న సమయం లోనే 'నీ మీద ఒక కంప్లయింట్ ఉంది లోకేష్' అన్నారు నరేంద్ర మోదీ. ఆ వెంటనే.. 'ఆ కంప్లయింట్ ఏంటో మీకు తెలుసు కదా' అని పక్కనే ఉన్న చంద్రబాబు వైపు చూసి నవ్వారు. సీఎం చంద్రబాబు సైతం ఏం సమాధానం ఇవ్వ కండా -చిర్నవ్వుతో లోకేష్‌ను చూశారు. అర్థంగాని సంభాషణల మధ్య ఏంజరుగుతుందో అంతుచిక్కక మిగిలిన మంత్రులు సైలెంట్‌గా ఉండిపోయారు. ఆహ్లాదం నుంచి గంభీరంగా మారిన వాతావరణాన్ని ప్రధాని మోదీయే చల్లబరుస్తూ.. 'ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలైంది. ఢిల్లీ వచ్చి నన్ను ఎందుకు కలవలేదు' అని చిర్నవ్వుతో లోకేష్‌ను ప్రశ్నించడంతో వాతావరణం ఒక్కసారిగా హృద్యంగా మారింది. క్షణాల్లో తేరుకున్న లోకేష్ ప్రధాని మోదీకి సమాధానం చెప్తుండగానే.. లోకేష్ భుజం తడుతూ.. 'ఫ్యామిలీతో వచ్చి ఒకసారి నన్ను కలువు' అంటూ ఆప్యాయంగా ఆహ్వానించారు. అటు ప్రధాని నరేంద్ర మోదీ సింప్లిసిటీ.. ఇటు లోకేష్‌మీద కురిపించిన అనురక్తి.. వెరసి అందరి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. 'త్వరలోనే వచ్చి కలుస్తా సార్' అంటూ ప్రధానికి లోకేష్ వినమ్రంగా సమాధానమివ్వడంతో.. కొన్ని క్షణాలపాటు లోకేష్‌తో సంభాషించి ప్రధాని మోదీ ముందుకు కదిలారు. అటు లోకేష్, ఇటు చంద్రబాబు మోముమీద చిన్నగా చిర్నవ్వు కదలాడింది.



# సాంకేతిక సంరంభం!

- గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ పవర్ హౌస్‌గా ఏపీ..
- చంద్రబాబు నేతృత్వంలో విజన్ -2047 సాకారం
- పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు
- ఏపీ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్‌లో మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటన



విశాఖపట్నం (చైతన్య రథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నేతృత్వంలో 2047 విజన్ సాకారమవుతుందని, గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ పవర్ హౌస్‌గా ఏపీ మారుతుందని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ అన్నారు. ఏపీ డీటీఐ (డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ), ఎస్టీపీఐ (సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ఆంధ్ర ప్రదేశ్ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్-2025 కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మిట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఏడురంగాల్లో ఐటీ అభివృద్ధి, డీప్ టెక్నాలజీ ప్రాముఖ్యత, స్టార్టప్‌ల వంటి అంశాలపై సదస్సులో చర్చించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మట్లాడుతూ.. ఏపీలో సాంకేతిక అభివృద్ధికి దిశానిర్దేశం చేయనున్న ఈ సమ్మిట్‌లో పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఏపీ.. గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ హబ్‌గా మారుతుందని, ఇన్నోవేషన్, డీప్ టెక్ నైపుణ్యాన్ని పెంపొందించడం ద్వారా ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి సాధ్యపడుతుందన్నారు. 'అభివృద్ధికి ఇన్నోవేషన్ చాలా ముఖ్యం. ఏఐ, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, హెల్త్ టెక్, ఎడ్యుటెక్, ఎనర్జీ స్మార్ట్ సొల్యూషన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టెక్నాలజీ రోబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. సామాజిక సమస్యల పరిష్కారానికి ఐటీ, ఎలక్ట్రానిక్స్, మెడ్ టెక్, స్మార్ట్ టెక్నాలజీస్ కలసికట్టుగా పనిచేయాల్సిన అవసరముంది. ఆరోగ్యరంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఏవిధమైన మార్పులు తీసుకువచ్చిందో మనం చూస్తున్నాం' అని లోకేష్ పేర్కొన్నారు.

## ఏపీని 2 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దుతాం

2047నాటికి ఏపీని 2 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దుతామని లోకేష్ ప్రామిస్ చేశారు. 'విజన్ -2020లో భాగంగా చంద్రబాబునాయుడు ఐటీని అభివృద్ధి చేశారు. ఇప్పుడు విజన్ -2047లో భాగస్వామ్యం కావడం నా అదృష్టం. చంద్రబాబునాయుడి సారథ్యంలో 2047 కలను సాకారం చేస్తాం. ఉద్యోగాలు పొందేందుకు, కల్పించేందుకు ఇన్నోవేషన్‌తో పాటు పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలో సమూల మార్పులు తీసుకువస్తాం. ఉన్నత విద్యను సంస్కరిస్తాం. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఏపీ ప్రస్తుతం 9వ స్థానంలో ఉంది. దీనిని 3వ స్థానానికి తీసుకువస్తాం. ఇందుకు పరిశ్రమ వర్గాలు తమవంతు సహకారం అందించాలి. విశాఖలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం. రాష్ట్ర సాంకేతిక విప్లవంలో ఏపీ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్ తనవంతు పాత్ర పోషించాలి. సంక్షోభాలనే అవకాశాలుగా మలచుకోవాలని మన నాయకుడు చెప్పారు' అని లోకేష్ అన్నారు.

## అభివృద్ధిని వికేంద్రీకరిస్తాం

'ఏపీ అభివృద్ధికి ప్రధాని ఎంతో సహకరిస్తున్నారు. నేడు 2 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తాం. రాయలసీమలోని అనంతపూర్‌కు కియా పరిశ్రమ రావడం ద్వారా తలసరి ఆదాయంలో 3వ స్థానంలో ఉండి గోదావరి జిల్లాలతో పోటీ పడుతోంది. కర్నూలును రెన్యువబుల్ ఎనర్జీ హబ్ గా రూపొందిస్తాం. చిత్తూరు, కడపను ఎలక్ట్రా నిక్స్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా మారుస్తాం. గోదావరి జిల్లాలను ఆక్వా హబ్‌గా మారుస్తాం. ఉత్తరాంధ్రకు త్వరలోనే ప్రపంచంలోనే అతిపెద్ద కెమికల్ పార్క్ రాబోతోంది. విశాఖకు డేటా సెంటర్ తీసుకువస్తాం. త్వరలోనే టీసీఎస్ రాబోతోంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను నెలకొల్పుతాం. పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా సహకారం అందిస్తాం' అని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.

విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ మాట్లాడుతూ..'ఏపీలో ఆర్థికపరిస్థితి అంతంత మాత్రం గానే ఉంది. సంక్షోభాలనే అవకాశాలుగా మల్చుకుందాం. ఈఐదేళ్లు చాలా కీలకం. నూతన ఆవిష్కరణలకు సిద్ధంగా ఉన్నాం. విశాఖను ఐటీ హబ్‌గా మార్చేందుకు అవసరమైన ఎకో సిస్టమ్‌ను అభివృద్ధిచేస్తాం. పరిశోధన రంగాన్నీ మెరుగు పర్చాల్సిన అవసరం ఉంది' అన్నారు. కార్యక్ర మంలో డీటీఎన్ఎఫ్ ఛైర్మన్ శ్రీధర్ కొసరాజుతో పాటు కేడీఈఎమ్ ఛైర్మన్ బీవీ నాయుడు,అలోన్ ఓఎస్ కో-ఫౌండర్ సీపీ గుర్నాని, ఎస్టీపీఐ డైరెక్టర్ సి.కవిత, ఐటీఏపీ ప్రెసిడెంట్ లక్ష్మీ ముక్కవిల్లి తదితరులు పాల్గొన్నారు.








చైతన్యరథం

# అభివృద్ధి ప్రదాతలకు జన నీరాజనం

- విశాఖలో మోదీ రోడ్ షో విజయవంతం
- సీఎం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ వెంట రాగా..
- అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన నగర ప్రజలు
- దారిపొడవునా పూలవర్షంతో ముంచెత్తిన మహిళలు
- ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగిన నేతలు
- జయహొ మోదీ.. జయహొ సీబీఎన్ నినాదాలు





విశాఖపట్నం(చైతన్యరథం): ప్రధాని మోదీ పర్యటనతో విశాఖ ఉప్పొంగింది. అడుగ డుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.2.08 లక్షల కోట్ల పైచిలుకు పెట్టుబడులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు విశాఖ వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి విశాఖ నగర వాసులతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన ప్రజలు అద్భుత స్వాగతం పలికారు. తొలుత బుధవారం సాయంత్రం 4.45 నిమిషాలకు ఐఎన్ఎస్ డేగా నుంచి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌తో కలిసి వచ్చిన మోదీ విశాఖ సిరిపురం జంక్షన్‌కు చేరుకున్నారు. ముగ్గురూ రోడ్ షో కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంపైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. రోడ్ షో మొదలవగానే ఒక్కసారిగా నినాదాలతో విశాఖ దద్దరిల్లింది. పూల వర్షం మధ్య ప్రజ లకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పురవీధుల్లో నిర్వహించిన రోడ్ షో ఆద్యం తం నభూతో నభవిష్యత్ అన్న చందంగా సాగింది. సిరిపురం జంక్షన్ నుంచి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానం వరకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా తరలి వచ్చిన ప్రజలు రోడ్డుకు ఇరువైపులా నిలబడి కూటమి నాయక త్రయానికి పూల వర్షంతో బ్రహ్మరథం పట్టారు. రోడ్ షో ఆద్యంతం జయహొ మోదీజీ.. జయహొ చంద్రబాబు నినాదాలతో మార్మోగింది.

రహదారి పొడుగునా ఉత్తరాంధ్ర సంప్రదాయ నృత్యాలు, తప్పెటగుళ్ల కళాకారులు వాద్యాలతో స్వాగతం పలికారు.

జనసంద్రమైన విశాఖ పుర వీధుల్లో సుమారు కిలోమీటరు మేర 45 నిమిషాల పాటు ఈ రోడ్ షో సాగింది. రోడ్ షో సాగిన ప్రాంతంతో పాటు విశాఖ నగరం మొత్తం కూటమి పక్షాలైన జనసేన, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీల జెండాలు, భారీ స్వాగత హోర్డింగులతో నిండి పోయింది. తమ ఆకాంక్షలు నెరవేర్చేందుకు, తమ బిడ్డలకు భవిష్యత్తు ప్రసాదించేందుకు వచ్చిన ప్రధానమంత్రి మోదీకి ధన్యవాదాలు తెలిపేందుకు లక్షలాదిగా ప్రజలు తరలివచ్చి ప్లకార్డులతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. వారి హర్షధ్వానాల మధ్య మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

## ప్రధానికి ముఖ్యమంత్రి, గవర్నర్ స్వాగతం

అంతకుముందు రాష్ట్రవ్యాప్తంగా రూ.2.08 లక్షల కోట్ల అభివృద్ధి పనులు ప్రారం భించేందుకు విశాఖకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఘనస్వాగతం పలికారు.













చైతన్యరథం

# తిరుపతిలో తొక్కిసలాట

- ఆరుగురు భక్తులు దుర్మరణం
- మృతుల్లో ఐదుగురు మహిళలే
- సమాచారంతో హతాశులైన సీఎం
- భక్తుల మరణంపట్ల తీవ్ర దిగ్భ్రాంతి
- పెరుగుతున్న మరణాలపై ఆందోళన
- క్షతగాత్రులకు రుయా, స్విమ్స్‌లో చికిత్స
- మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక ఆదేశాలు
- ఏర్పాట్ల వైఫల్యంపై భక్తుల ఆగ్రహం
- దుర్ఘటనపై అనుమానాల నీలినీడలు
- కుట్రకోణం ఉండి ఉండొచ్చన్న భక్తులు
- ఆ కోణంలోనే మొదలైన పోలీస్ దర్యాప్తు



తిరుపతి (చైతన్య రథం): వైకుంఠ ద్వార సర్వదర్శనం టోకెన్ల జారీ నేపథ్యంలో తిరుపతిలో అపశ్రుతి చోటు చేసుకుంది. టోకెన్ల కోసం ఊహించని రీతిలో భక్తులు రావడంతో తీవ్ర తోపు లాట జరిగింది. ఈఘటనలో ఆరుగురు భక్తులు మృతి చెందారు. మృతుల్లో ఐదుగురు మహిళలు ఉన్నట్టు గుర్తించారు. అస్వస్థతకు గురైన వారిని అంబులెన్స్‌లో తిరుపతిలోని ఆసుపత్రులకు తరలించారు. రుయా ఆసుపత్రిలో 20మంది, స్విమ్స్‌లో 9మంది చికిత్స పొందుతున్నారు. రుయా ఆస్పత్రికి కలెక్టర్ వెంకటేశ్వర్, తితిదే ఈవో శ్యామలరావు చేరుకొని వైద్య సేవలను పర్యవేక్షిస్తున్నారు. తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయారని, సుమారు 40మందికి పైగా గాయాల య్యాయని, ఆస్పత్రుల్లో క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నట్టు టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. అకస్మాత్తుగా తలెత్తిన తొక్కిసలాట ఘటనలో గాయాలపాలైన 28మందిని రుయా ఆస్పత్రికి, మరో 12మందిని స్విమ్స్‌కు తరలించినట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. రుయాలో చికిత్స పొందుతున్న 28 మందిలో నలుగురు, స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న 12 మందిలో ఇద్దరు మృతి చెందారన్నారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారని, ఇప్పటివరకు ఇద్దరిని గుర్తించామన్నారు. మరో నలుగురి చిరునామా తెలియాల్సి ఉంది కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రకటించారు. ప్రమాద సంఘటన వివరాలు తెలుసుకున్న సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టోకెన్ల కోసం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చిన సందర్భంలో చోటుచేసుకున్న ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. గాయాలైన వారికి అందుతున్న చికిత్సపై అధికారులతో సీఎం ఫోన్లో మాట్లాడారు. టీటీడీ అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిని తెలుసుకుంటున్నారు. ఉన్నతాధికారులు ఘటనా స్థలానికివెళ్లి సహాయ చర్యలు చేపట్టాలని.... క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సీఎం ఆదేశించారు.

తిరుపతిలోని శ్రీనివాసం, సత్యనారాయణపురం బైరాగిపట్టెడ రామానాయుడు స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాల్లో భక్తుల మధ్య తోపులాట జరిగింది. గురువారం ఉదయం 5 గంటల నుంచి తిరుపతిలోని తొమ్మిది కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 94 కౌంటర్ల ద్వారా వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లు జారీ చేయాలని తితిదే నిర్ణయించింది. అయితే, టోకెన్ల కోసం ఇవాళ సాయంత్రమే భక్తులు భారీగా తరలివచ్చారు. తొక్కిసలాటలో గాయపడిన బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. తోపులాట జరిగిన ప్రాంతాలకు విజిలెన్స్, అదనపు పోలీసు బలగాలు భారీగా చేరుకున్నాయి. మరోవైపు, ఘటనా స్థలం వద్ద పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు నగర పాలక కమిషనర్ తెలిపారు.

### తొక్కిసలాటకు కారణమిదే..

టోకెన్ల కోసం వచ్చిన భక్తులు రోడ్లపై గుమిగూడకుండా బైరాగిపట్టెడ వద్ద ఉన్న పద్మావతి పార్కులో ఉంచారు. అయితే, టోకెన్ల జారీ కేంద్రంలో సిబ్బంది ఒకరు అస్వస్థతకు గురికావడంతో అతన్ని ఆసుపత్రికి తరలించేందుకు క్యూలైన్ తెరిచారు. టోకెన్ల జారీ చేసేందుకు క్యూలైన్ ఓపెన్ చేశారని భావించిన భక్తులు ఒక్కసారిగా దూసుకొచ్చారు. ఈక్రమంలోనే తొక్కిసలాట జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. క్యూలైన్ల వద్ద సరైన భద్రత ఏర్పాటు చేయలేదని మరి కొందరు ఆరోపిస్తున్నారు. టోకెన్ల కోసం ఎంతమంది భక్తులు వచ్చారు, ప్రత్యామ్నయ ఏర్పాట్లపై స్థానిక సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించలేదని తెలుస్తోంది.

ఈనెల 10, 11, 12 తేదీల్లో వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి మొదటి మూడు రోజులకు 1.20 లక్షల టోకెన్లను గురువారం ఉదయం జారీ చేయాల్సి ఉంది. మిగిలిన రోజులకు సంబంధించి ఆయా తేదీల్లో తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్సులో ఇవ్వనున్నట్టు తితిదే తెలిపింది. అయితే, భక్తుల రద్దీ కారణంగా ఇవాళ రాత్రినుంచే టోకెన్లు జారీ చేస్తున్నట్టు ఈవో శ్యామలరావు తెలిపారు.

### తోపులాట ఘటనపై పలు అనుమానాలు


వైకుంఠ ఏకాదశికి పటిష్టమైన చర్యలు, కట్టుదిట్టమైన ప్రణాళికలతో టీటీడీ భక్తులకు సేవలు అందిస్తుందని ఈరోజు ఉదయం భక్తులనుంచి ప్రశంసలే వచ్చాయి. సాయంత్రానికి ఇలాంటి పరిణామం తలెత్తడంతో దీని వెనుక కుట్రకోణం ఏమైనా ఉందా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.. అనారోగ్యంతో ఆయాసపడుతున్న వృద్ధురాలిని గుర్తించి గుంపునుండి తప్పించి గేటు లోపలికి తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతున్న సమయంలో... వృద్ధురాలి వెనుకున్న భక్తులు సైతం సహకరించినట్టు తెలుస్తోంది. సాఫీగా ఉన్న పరిస్థితికి విఘాతం కలిగిస్తూ.. కొద్ది దూరంలో కేకలు అరుపులతో గుర్తు తెలియని వ్యక్తులు దుమారం లేపి.. ఒక్కసారిగా భక్తులను ముందుకు నెట్టడంతో ప్రమాదం చోటుచేసుకుందన్న వాదన వినిపిస్తోంది. ఒక వ్యక్తి కావాలని చేసిన పనా?? లేదా గుంపు చేసిన పనా? అన్న కుట్రకోణంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఘటనను తీవ్రంగా పరిగణనలోకి తీసుకున్న టీటీడి అధికారులు, అన్ని వైపుల నుండి భక్తులను వాకబు చేస్తూ సిసి ఫుటేజ్‌ల ఆధారంగా కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఘటనలో మొదటి వరుసలోని భక్తుల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కావాలనే వెనుక నుండి తోపులాట చేసి తొక్కిసలాటకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయం చేసేందుకు ప్రయత్నం చేసిన సిబ్బందికి చిక్కులు తేవడమేకాక, ఆర్గురి మృతికి కారణమయ్యారన్న ఆగ్రహం భక్తులనుంచి వ్యక్తమవుతోంది.

### మంత్రుల దిగ్భ్రాంతి

తిరుపతిలో తొక్కిసలాట చోటుచేసుకుని ఆరుగురు భక్తులు మృతిచెందడం పట్ల మంత్రులు అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేష్, రాంప్రసాద్‌రెడ్డి, ఎన్ఎండి ఫరూక్‌లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాజా పరిస్థితిపై కలెక్టర్ వెంకటేశ్వరన్‌తో మాట్లాడిన మంత్రులు, క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు. మరిన్ని బలగాలను మోహరించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు మంత్రి అనగాని నేడు తిరుపతికి వెళ్లనున్నారు.

# నేడు తిరుపతికి చంద్రబాబు

- క్షతగాత్రులను పరామర్శించనున్న సీఎం
- తొక్కిసలాట ఘటనపై అత్యవసర సమీక్ష
- ఏర్పాట్లు, భద్రతా వైఫల్యంపై తీవ్ర ఆగ్రహం
- డెత్ టోల్ పెరుగుతుండటంపై ఆందోళన
- మెరుగైన వైద్య సేవలు అందించాలంటూ ఆదేశాలు



తిరుపతి (చైతన్య రథం): తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల కోసం జరిగిన తొక్కిసలాటపై సీఎం చంద్రబాబు అత్యవసర సమీక్ష నిర్వహించారు. డీజీపీ, టీటీడీ ఈవో, జిల్లా కలెక్టర్, ఎస్పీలతో సమీక్ష నిర్వహించి పరిస్థితిని అంచనా వేశారు. దేవుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర బాధాకరమన్న సీఎం చంద్రబాబు, విశాఖలో మంచి కార్యక్రమం పూర్తి చేసుకున్న సమయంలో తిరుపతిలో ఈ దుర్ఘటన చోటు చేసుకోవడం తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. ముందు జాగ్రత్త చర్యలు విఫలం కావడంపై అధికారులమీద తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, భక్తులు అధికంగా వస్తారని తెలిసినప్పుడు... అందుకు అనుగుణంగా ఎందుకు ఏర్పాట్లు చేయలేక పోయారని సంబంధిత సిబ్బందిని నిలదీశారు. ఇలాంటిచోట్ల విధుల్లో అత్యంత అప్రమత్తంగా, బాధ్యతగా ఉండాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. మృతుల సంఖ్య పెరగడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, ప్రస్తుతం క్షతగాత్రులకు అందుతున్న వైద్యంపై జిల్లా అధికారుల నుంచి వివరాలు తీసుకున్నారు. మృతుల సంఖ్య పెరగకుండా బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. టీటీడీ టోకెన్లు ఇచ్చే కౌంటర్ల నిర్వహణ, భద్రతను పున:సమీక్షించాలన్న సీఎం, నేటి ఉదయం తిరుపతికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించనున్నట్టు చెప్పారు.

గురువారం ఉదయం విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి తిరుపతికి వెళ్తున్న సీఎం చంద్రబాబు.. తొలుత రుయా, స్విమ్స్‌లో చికిత్సపొందుతున్న క్షత గాత్రులను పరామర్శిస్తారు. బాధిత కుటుంబాలను ఓదార్చిన అనంతరం తితిదే కార్యాలయంలో ప్రమాద ఘటనపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం తిరిగి సాయంత్రానికి ఉండవిల్లి చేరుకోనున్నారు.

# ప్రధాని తీవ్ర దిగ్భ్రాంతి

### తీవ్ర విచారం వ్యక్తం చేసిన పవన్, లోకేష్

తిరుపతి (చైతన్య రథం): తిరుపతి తొక్కిసలాటలో భక్తుల మరణంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తిరుపతిలో తొక్కిసలాట జరగడం బాధాకరమని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా సాయం అందిస్తుందని మోదీ ధైర్యం చెప్పారు. తిరుపతిలో తొక్కిసలాట చోటుచేసుకున్న ఘటనలో ఆరుగురు మృతి చెందడంపట్ల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి లోకేష్‌లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భగవంతుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు దుర్మరణం పాలవడం దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తూ.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యారోగ్య శాఖను ఆదేశించారు. ఐటీ మంత్రి లోకేష్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల విడుదల నేపథ్యంలో తిరుపతి లోని విష్ణు నివాసం దగ్గర జరిగిన తొక్కిసలాటలో భక్తులు మృతి చెందడం నన్ను తీవ్ర మనోవేదనకు గురి చేసింది. ఇటువంటి అవాంచనీయ ఘటనలకు



తావీయకుండా టిటిడి మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి. మృతిచెందిన భక్తుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది' అని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ స్పందిస్తూ.. మృతులు, క్షతగాత్రుల్లో ఇతర ప్రాంతాలనుంచి వచ్చినవారు ఉన్నారని, అలాంటి కుటుంబాలకు తగిన సమాచారం ఇవ్వడం, సహాయ సహకారాలు అందించడం కోసం సత్వరమే తగిన ఏర్పాట్లు చేయాలని తితిదేను ఆదేశించారు. అదేవిధంగా మృతుల కుటుంబాల దగ్గరకు వెళ్ళి పరామర్శించి మనో ధైర్యం ఇచ్చే బాధ్యత టీటీడీ పాలక మండలి తీసుకోవాలన్నారు. దుర్ఘటన నేపథ్యంలో తిరుపతి నగరంలోని టికెట్ కౌంటర్ల దగ్గర క్యూ లైన్ల నిర్వహణలో అధికారులకు, పోలీసు సిబ్బందికి జనసేన నాయకులు, జన సైనికులు తోడ్పాటు అందించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు.

## హుటాహుటిన తిరుపతికి
# దేవాదాయ మంత్రి ఆనం

అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి బుధవారం రాత్రి హుటాహుటిని తిరుపతికి బయలుదేరారు. తిరుపతి ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆనం.. స్వయంగా పరిస్థితిని పర్యవేక్షించేందుకు తిరుపతికి బయలుదేరారు. భద్రతా చర్యల్లో విఫలమైన అధికారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్న సీఎం ఆదేశాల మేరకు.. అర్ధరాత్రే తిరుపతిలో మంత్రి ఆనం సమీక్ష నిర్వహించే అవకాశం కనిపిస్తోంది. బాధితులకు సత్వర సహాయక చర్యలు అందించేందుకు మంత్రి ఆనంను సీఎం ఆదేశించారు. తిరుపతికి వెళ్తూనే.. జిల్లా అధికార యంత్రాంగం, టీటీడీ పోలీసు అధికారులతో మంత్రి ఆనం సమీక్ష నిర్వహించారు. అలాగే సీఎం ఆదేశాల మేరకు మంత్రి ఆనం సహా హోంమంత్రి అనిత, రెవిన్యూ మంత్రి సత్యప్రసాద్ తిరుపతికి బయలుదేరారు. నేటినుంచి జరగనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వయంగా మంత్రుల బృందం పరిస్థితిని పర్యవేక్షించనుంది. మరోపక్క రుయా ఆస్పత్రిని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సందర్శించారు. రుయా ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శించి, వారికి అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. బాధితులకు అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇస్తూ.. దుర్గటనకు బాధ్యులైన వారిని గుర్తిస్తున్నామన్నారు. బాధ్యులైన వారిపై వెంటనే చర్యలు తీసుకుంటామని, విఫలమైన అధికారులపై చర్యలు ఉంటాయని నాయుడు వెల్లడించారు.



# కడప - రాయచోటి 4 కి.మీ టన్నెల్‌కు సహకరించాలి

- నాలుగు లైన్ల రహదారి మంజూరుకు చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలి
- రాయచోటిలో రోడ్ల కనెక్టివిటీకి నిధులు మంజూరు చేయాలి
- నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టును ఆమోదించాలి
- కేంద్రమంత్రి గడ్కరీకి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వినతి





న్యూఢిల్లీ(చైతన్యరథం): న్యూఢిల్లీలో రవాణా, యువజన, క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పర్యటనలో భాగంగా కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీని బుధవారం ఆయన నివాసంలో కలిసి సుమారు 45 నిమిషాల పాటు పలు అంశాలపై చర్చించారు. రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణలో భాగంగా కడప - రాయచోటిలో నాలుగు కిలో మీటర్ల టన్నెల్ ఏర్పాటుకు సర్వం సిద్ధం కాగా ఇటీవల సమగ్ర నివేదిక కేంద్ర రవాణా బృందం సిద్ధం చేసింది, నాలుగు లైన్ల టన్నెల్ ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతులు రాగానే పనులు చేపట్టేందుకు కేంద్రం ఆమోదం రూపంలో సహకారం అందించాలని కోరారు. అందులో భాగంగా రాయచోటిలో సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధుల ద్వారా రోడ్ల విస్తరణ గ్రామాలు,మండల కేంద్రాలు, జిల్లా హెడ్ క్వార్టర్స్ మధ్య మెరుగైన కనె క్టివిటీ సులభతరం చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎన్‌హెచ్ నేషన ల్ హైవేస్ లాజిస్టిక్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టును ఆమోదించి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టే విధంగా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కడప నుంచి రాయచోటి వరకు 4 లైన్ల రహదారి మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవా లని కోరారు. రాజంపేట - రాయచోటి - కదిరి రహదారి - రాష్ట్ర రహదారి నుంచి జాతీయ రహదారిగా అభివృద్ధి చేసేందుకు శాఖాపరమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై గడ్కరీ స్పందిస్తూ రాష్ట్ర రవాణా అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖకు సంబంధించిన ఉన్నతా ధికారులు పాల్గొన్నారు.

## భువనేశ్వర్‌లో ప్రవాస భారతీయ దివస్

- నేటి నుంచి రెండురోజుల పాటు సమావేశాలు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా మంత్రి కొండపల్లి

అమరావతి(చైతన్యరథం): ఒరిస్సా రాజధాని భువనేశ్వర్‌లో గురు, శుక్రవారాల్లో జరుగుతున్న 18వ ప్రవాస భారతీయ దివస్ కార్యక్రమల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొననున్నా రు. కేంద్ర విదేశీ వ్యవహారశాఖ మంత్రి ఎస్.జైశంకర్ ముఖ్యమంత్రి చంద్రబాబును రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈసమావేశానికి రావా ల్సిందిగా ఆహ్వానించారు. విదేశీ వ్యవ హారాల మంత్రి ఆహ్వానం మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈసమావేశంలో పాల్గొనవల్సిందిగా ముఖ్యమంత్రి ఆదే శించారు. సమావేశంలో పాల్గొనే నిమిత్తం మంత్రి శ్రీనివాస్ బుధ వారం రాత్రి విజయనగరం నుంచి



బయలుదేరి భువనేశ్వర్ వెళ్లను న్నారు. గురువారం ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమయ్యే "ప్రవాస భారతీయ దివస్" కార్యక్రమం రెండురోజుల పాటు జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశా ల్లో నివసించే భారతీయ మూలాలున్న వారందరినీ ఏకం చేయడం తో పాటు,ఆయా దేశాల్లో భారతీయ సంతతి ప్రజలు ఎదుర్కొంటు న్న సమస్యలపై సమగ్రంగా చర్చించి తగిన పరిష్కారం కనుగొన దం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో ఉన్న ప్రవాస భారతీయ ప్రము ఖులు కూడా హాజరవుతారు. వివిధ దేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రులు ఎదు ర్కొంటున్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, భారతీయ సంతతిలో విదేశాలలో ఎక్కువగా నివసించే ప్రవాసాంధ్రులను ఏకతాటిపై తెచ్చేందుకు ఈ కార్యక్రమం ఎంత గానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇంతటి ప్రాముఖ్యత గల ప్రవాస భారతీయ దివస్ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున తనకు పాల్గొనే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి కొండపల్లి ధన్యవాదాలు తెలిపారు.

# జగన్‌రెడ్డి వల్లే విద్యుత్ ఛార్జీల భారం

- ప్రజాభిప్రాయ సేకరణలో పలువురి ఆందోళన
- ఏపీఈఆర్సీ ఆధ్వర్యంలో రెండోరోజూ సూచనలు
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్న ఛైర్మన్ రామ్‌సింగ్




అమరావతి(చైతన్యరథం): ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరల పై వ్యక్తిగతంగా,వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ రెండో రోజు విజయవాడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో బుధవారం కూడా జరిగింది. విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్, మెంబర్ పి.వెంకట రామరెడ్డి విద్యుత్ టారీఫ్ తదితర అంశాల పై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ప్రత్యక్షంగా 14 మంది, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 25 మంది తమ అభిప్రాయాలను వెల్లడించారు. మొత్తం రెండురోజుల్లో 60 మంది తమ అభ్యంతరాలు, సూచనలు తెలిపారు. ఏపీఈఆర్సీ దృష్టికి తీసుకురాగా ఛైర్మన్ ఠాకూర్ రామ సింగ్ మాట్లాడుతూ వినియోగదారులు, ప్రజా సంఘాలు, రాజ కీయ నాయకులు,పారిశ్రామికవేత్తలు తమ దృష్టికి తీసుకు వచ్చిన ప్రతి అంశాన్ని పరి శీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతా మని తెలిపారు.

### గత ప్రభుత్వం వల్లే విద్యుత్ ఛార్జీల భారం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసి న తప్పులవల్లే నేడు వినియోగదారులు విద్యుత్‌ఛార్జీల భారం మోయాల్సివస్తుందని తెలిపారు. అదనపు ఛార్జీలు కట్టలేని పేద, మధ్యతరగతి వినియోగదారులకు సమయం ఇవ్వకుండా కనెక్షన్ కట్ చేయ వద్దని సూచించారు. విద్యుత్ ప్రమాద బీమాను పెంచాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాల్లో ఇళ్లు దగ్ధం అయిన బాధితు లకు త్వరగా న్యాయం చేయాలని కోరారు. అలాగే ఎప్పుడో బ్రిటీష్ కాలం నాటి కండ క్టర్లను కూడా మార్చాలని సూచించారు. వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకు న్న 20 రోజుల్లోపే కనెక్షన్లు ఇవ్వాలని, సిబ్బంది కొరత సమస్య తీర్చాలని కోరారు.

### విద్యుత్ రంగాన్ని కాపాడుకోవాలి

కాగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామ కృష్ణ మాట్లాడుతూ విద్యుత్ రంగాన్నికాపా డుకోవాల్సిన బాధ్యత ఏపీఈఆర్సీపై ఎంతై నా ఉందన్నారు. ట్రూఅప్ ఛార్జీలపై సమీ క్షించుకోవాలని సూచించారు.అలాగే స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై పబ్లిక్ హియరింగ్ ఏర్పా టుచేయాలని డిమాండ్ చేశారు. సెకీ, అదాని ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసు కోవాలని కోరారు. విద్యుత్ వినియోగదా రుల ఐక్యవేదిక కన్వీనర్ ఎంవీ ఆంజనే యులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పా టతో వినియోగదారులకు లాభం కలుగు తుందని చెబుతున్నారని, ఇది పునరాలో చించుకోవాలని సూచించారు. మన దేశం లోనే బొగ్గు లభిస్తున్నా విదేశీ బొగ్గును ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తుండటంతో వినియోగదారులపై భారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎఫ్‌పీసీఏ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని కోరారు. ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధి పి.కోటిరావు మాట్లాడుతూ గ్రీన్ పవర్‌ను ప్రోత్సహించాలని సూచించారు. విద్యుత్ టారీఫ్‌లు, అదనపు ఛార్జీల భారంపై ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన పారిశ్రామిక వేత్త రాజేష్‌బాబు మాట్లాడుతూ పరిశ్రమలకు విద్యుత్ బిల్లులపై సబ్సిడీ ఇవ్వాలని, అప్పుడే పరిశ్రమల స్థాపన జరుగుతుందని సూచించారు. తమ పరిశ్రమకు మూడేళ్లలో రూ.3.5కోట్లకు పైగా బిల్లులు చెల్లించానని వివరించారు. అలాగే తాతా సుబ్ర మణ్యం, కుమారస్వామి, తాతినేని వెంకటేశ్వరరావు, పి.సాంబశివరావు, జీవా, గణేష్, హనుమయ్య అభిప్రాయాలు తెలిపారు.తిరుపతి నుంచి గురుస్వామి నాయుడు మాట్లాడుతూ కనీసం వంద యూనిట్ల వరకు ఒక స్లాబ్ ఉండేలా మార్పు చేయాలన్నారు. వ్యవసా యానికి నిరంతరాయంగా 9 గంటల విద్యుత్ ను సరఫరా చేయాలని కోరారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి గోపాలకృష్ణ మాట్లాడుతూ చేపల చెరు వుల సాగు నష్టా లను మిగుల్చుతుందని, 5 ఎకరాల లోపు చెరువులు ఉన్న వారికి అమలు చేస్తున్న విద్యుత్ సబ్సిడీని అన్ని చేపల చెరువులకు అమలు చేయాలని సూచించారు. అలాగే సిగ్మా సీఈవో గోపీనాథ్, ఎం.ఎస్.శర్మ, హర్షకుమార్, హిమాన్స్ చావ్లా, డి.వి.లక్ష్మీ నారాయణ, చీకటి శ్రీనివాస్ తదితరులు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో విద్యుత్ నియంత్రణ మండలి అధికారులు, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీ ఎల్, ఏపీఈపీడీసీఎల్ అధికారులు, విని యోగదారులు పాల్గొన్నారు.

# అమ్మ భాషను మరిస్తే.. అమ్మను మరచినట్టే: వెంకయ్య



రాజానగరం (చైతన్య రథం): తెలుగు రాష్ట్రాల్లో పాలన, ఉత్తర్వులు మాతృభాషలోనే ఉండాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ) ప్రాంగణంలో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన మాట్లాడారు. అమ్మ భాషను మరిస్తే అమ్మను మరిచినట్టేనన్నారు. తెలుగులో మాట్లాడని వారు తెలుగు నాయకుడు కాదని, మాతృభాష మాట్లాడని వారికి ఓటు వేయొద్దని పిలుపునిచ్చారు.

"రాష్ట్రం బయటవున్న వారంతా తెలుగు బాగా మాట్లాడుతున్నారు. ఇతర రాష్ట్రాలనుంచి వచ్చిన వాళ్లూ నేర్చుకుంటున్నారు. కానీ.. తెలుగు రాష్ట్రాల్లో కొందరు తెలుగు వారు అమ్మ భాష మాట్లాడటం లేదు. న్యాయస్థానాల్లో మాతృభాష వాడకం పెరగాలి. సినిమాల్లో మాటలు, పాటల్లో తెలుగుదనం ఉండాలి. తెలుగు కోసం పత్రికలు, ప్రసార మాధ్యమాలు కృషి చేస్తున్నాయి. ఎన్టీఆర్, నార్ల వెంకటేశ్వరరావు, రామోజీరావు భాషాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. మన భాషను ఎవరో కాకుండా మనమే కాపాడుకోవాలి. భాషను ప్రేమించు .. ప్రోత్సహించు.. ఇతరులతో పలికించు నినాదంతో ముందుకెళ్లాలి" అని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు.

**ఎల్ కేజీ, యూకేజీ మూసివేయాలి: గరికపాటి**

పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ వ్యవస్థలను మూసివేయాలని ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు తెలుగు మాధ్యమమే ఉండాలని చెప్పారు. డిగ్రీ వరకు ప్రథమ భాషగా తెలుగు ఉండాలన్నారు. రెండు నెలల క్రితం సీఎం చంద్రబాబు ఫోన్ చేసి అధికార భాషా సంఘం అధ్యక్ష పదవి స్వీకరించాలని కోరారని గరికపాటి తెలిపారు. వ్యవస్థలో కొన్ని మార్పులు చేస్తే ఆ పదవిలో ఎవరూ అవసరం లేదని ఆయనకు చెప్పానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఫస్ట్ ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఉండవు: కృతికాశుక్లా



అమరావతి (చైతన్య రథం): ఇంటర్ విద్యలో కీలక సంస్కరణలకు ఏపీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీనికి సంబంధించిన పలు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా వెల్లడించారు. ఈమేరకు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఇంటర్ విద్యలో సంస్కరణలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలనుంచి సలహాలు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. "చాలా ఏళ్లుగా ఇంటర్ విద్యలో సంస్కరణలు జరగలేదు. జాతీయ కరికులం చట్టాన్ని అనుసరించి సంస్కరణలు చేపడుతున్నాం. సైన్స్, ఆర్ట్స్, భాషా సబ్జెక్టుల్లో సంస్కరణలు అమలు చేస్తాం. 2024-25 నుంచి పదో తరగతిలో ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలు ప్రవేశపెట్టారు. 2025-26 ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎన్సీఈఆర్టీ పాఠ్య పుస్తకాలు ప్రవేశపెడతాం. దీంతో నీట్, జేఈఈవంటి జాతీయస్థాయి పోటీ పరీక్షలకు సులభమవుతుంది.

15 రాష్ట్రాల్లో ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలను ఇంటర్లో ప్రవేశపెట్టారు. సిలబస్ సంస్కరణ, నూతన సబ్జెక్ట్ కాంబినేషన్లకు ప్రతిపాదనలు చేస్తున్నాం. పరీక్షల మార్కుల కేటాయింపు విధానంలో సంస్కరణలు తెస్తాం. ఇందులో భాగంగా ఇంటర్ మొదటి సంవత్సర పబ్లిక్ పరీక్షలు తొలగిస్తాం. ఆయా కళాశాలలు అంతర్గతంగా ప్రథమ సంవత్సర పరీక్షలు నిర్వహిస్తాయి. సీబీఎస్ఈ విధానంలో ముందుకెళ్తాం. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలనే బోర్డు నిర్వహిస్తుంది. ఈనెల 26లోగా సంస్కరణలపై సలహాలు, సూచనలు పంపాలి. ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ప్రతిపాదిత సంస్కరణల వివరాలు ఉంచాం" అని కృతికా శుక్లా తెలిపారు.

# మహా కుంభమేళాకు బయలుదేరిన శ్రీవారి కల్యాణ రథం



తిరుమల (చైతన్య రథం): యూపీలోని ప్రయాగలో జరగనున్న మహా కుంభమేళాకు తిరుమలనుంచి శ్రీవారి కల్యాణ రథం బయల్దేరింది. కల్యాణ రథానికి తితిదే చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి పూజలు చేశారు.

జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు కుంభమేళా జరగనుంది. కల్యాణ రథం బయల్దేరిన సందర్భంగా బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడారు. యూపీ ప్రభుత్వం కేటాయించిన 2.5 ఎకరాల స్థలంలో శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటు చేశామన్నారు. 170 మంది సిబ్బందితో ఆ ఆలయంలో తిరుమల తరహాలో అన్ని కైంకర్యాలు నిర్వహిస్తామని చెప్పారు. ఉత్తరాది భక్తులకు స్వామి వారి ఆర్జిత సేవలను తిలకించే భాగ్యం కల్పిస్తామని తెలిపారు. జనవరి 18, 26.. ఫిబ్రవరి 3, 12 తేదీల్లో శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తామని వివరించారు. కుంభమేళాను దిగ్విజయం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు.

**పది రోజులపాటు ప్రత్యేక దర్శనాలు రద్దు**

ప్రపంచవ్యాప్తంగా హిందువులు వైకుంఠ ద్వార దర్శ నంపై మాట్లాడుకుంటున్నారని తితిదే చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాలకు తితిదే అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఈనెల 10న ఉదయం 4.30 గంటలకు ప్రొటోకాల్ దర్శనాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 8 గంటలకు సర్వదర్శనం ప్రారంభమవుతుందని చెప్పారు. టోకెన్లు కలిగిన భక్తు లకే దర్శనాలకు అనుమతి ఉంటుందని చెప్పారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్వర్ణరథం ఊరేగింపు ఉంటుందని తెలిపారు. అన్ని ప్రత్యేక దర్శనాలను ఈ పది రోజులు (జనవరి 10 నుంచి) రద్దు చేసినట్లు వెల్లడించారు. సామాన్య భక్తుల కోసం సిఫార్సు లేఖల దర్శనం రద్దు చేసినట్లు పేర్కొన్నారు. తిరుపతిలోని టోకెన్ల జారీ కేంద్రాలు ఇప్పటికే భక్తులతో కిక్కిరిసిపోయాయని తెలిపారు.

# చరిత్రలో తిరుగులేని నాయకుడిగా లోకేష్

- ప్రజాసమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి హర్షణీయం
- మాజీ మంత్రి కె.ఎస్.జవహర్ ప్రశంసలు



అమరావతి(చైతన్యరథం): యువనేత నారా లోకేష్ తన రాజకీయ ప్రస్థానంలో తిరుగులేని నాయకుడిగా ఎదగడం గర్వంగా ఉందని మాజీ మంత్రి కె.ఎస్. జవహర్ పేర్కొన్నారు. తన నాయకత్వంలో యువత కోసం చేసిన ప్రత్యేక కార్యక్రమాలు, సమాజ శ్రేయస్సు కోసం చేపట్టిన సంస్కరణలతో ప్రజల మన్ననలు పొందుతున్నారని ప్రశంసించారు. పాదయాత్రలో ప్రజల కష్టాల స్వయంగా చూసిన లోకేష్ వాటిని విస్మరించకుండా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారంపై తన చిత్తశుద్ధిని చాటుకుంటున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు తీసుకుంటూ ప్రజల కన్నీళ్లు తుడుస్తున్నారు.. విదేశాల్లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్న తెలుగు వారికి ఆపన్న హస్తం అందించి కాపాడుతున్నారు. పిలిస్తే పలికే ప్రజా నాయకుడిగా లోకేష్ అనతికాలంలోనే పేరు తెచ్చుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. లోకేష్ సారథ్యంలో సభ్యత్వ నమోదులో పార్టీ చరిత్ర తిరగరాసిం ది. ఏ ప్రాంతీయ పార్టీకి లేనంత మంది కార్యకర్తలు టీడీపీకే ఉన్నారంటే అది లోకేష్ కృషి వల్లేనని పేర్కొన్నారు. పార్టీ పట్ల ప్రజలు ఆకర్షితులై సభ్యత్వం తీసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తూ పార్టీ శ్రేణులను కుటుంబసభ్యుల్లా చూసుకుంటూ అండగా ఉంటున్నారు. ఐటీ మంత్రిగా రాష్ట్రానికి రూ.3లక్షల కోట్ల పైనే పెట్టుబడులు సాధించారు. విద్యా వ్యవ స్థలో మార్పులకు శ్రీకారం చుట్టి ప్రక్షాళన చేస్తున్నారని ప్రశంసించారు.

# మరోసారి పోలీస్ కస్టడీకి విజయపాల్



గుంటూరు(చైతన్య రథం): మాజీ ఎంపీ,ప్రస్తుత శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై కస్టోడియల్ టార్చర్ కేసులో నిందితుడు, విశ్రాంత ఏఎస్పీ విజయపాల్‌ను పోలీసులు మరోసారి కస్టడీకి తీసుకున్నారు. విజయపాల్‌ను మరోసారి కస్టడీకి అప్పగిస్తూ గుంటూరు ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జి స్రవంతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆరెస్టయిన విజయపాల్.. ప్రస్తుతం గుంటూరు జిల్లా జైలులో ఉన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు గుంటూరు జీజీహెచ్‌లో వైద్య పరీక్షల అనంతరం విజయపాల్‌ను పోలీసులు ప్రకాశం జిల్లా ఒంగోలుకు తరలిస్తున్నారు. అక్కడ ప్రకాశం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో విచారణ చేయనున్నారు. 24 గంటలపాటు విజయ్‌పాల్‌ను పోలీసులు ప్రశ్నించనున్నారు. గత నెలలో మూడు రోజులపాటు కస్టడీకి తీసుకున్నప్పుడు ఆయన సహకరించలేదని, మరికొందరు సాక్షుల నుంచి కీలక వాంగ్మూలాలు నమోదు చేసిన నేపథ్యంలో విజయపాల్‌ను మరోసారి కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం బుధవారం నుంచి గురువారం ఉదయం 11 గంటల వరకు పోలీస్ కస్టడీకి అనుమతించింది.

చైతన్యరథం

## ఉచిత వైద్యం పేరుతో

# జగన్‌రెడ్డి జిమ్మిక్కులు

- రోగుల ప్రాణాలు తీసి ఆరోగ్యశ్రీని భ్రష్టు పట్టించాడు
- నెట్‌వర్క్ ఆసుపత్రులకు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులు
- సీఎంఆర్‌ఎఫ్ మంజూరు చేయకుండా పేదల ఉసురు తీశాడు
- వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబుపై విషప్రచారం
- రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- పెండింగ్ బిల్లులు, సీఎంఆర్‌ఎఫ్ నిధులు విడుదల చేశారు
- ఏప్రిల్ 1 నుంచి హైబ్రిడ్ విధానంలో వైద్య సేవలకు శ్రీకారం
- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద్ సూర్య


మంగళగిరి(చైతన్యరథం): రూ.25 లక్షల వరకు ఎన్టీఆర్ వైద్యసేవలో భాగంగా ప్రతి కుటుంబానికి చికిత్స అందించే విధానానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేమూరి ఆనంద్ సూర్య తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అద్భుత పాలనను చూసి వైసీపీ ఓర్చుకోలేక రోజూ వైసీపీ నేతలు ఇష్టమొచ్చిన రీతిగా అభూత కల్పనలు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. తన సొంత ఖజా నాను నింపుకోవడానికే జగన్ పాలనంతా సరిపోయిందన్నారు. పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడే సీఎంఆర్‌ఎఫ్‌ను కూడా ఇవ్వకుండా ఆపేసిన నీచుడు జగన్‌రెడ్డి అని మండిపడ్డారు. జగన్ హయాంలో ఆరోగ్యశ్రీలో చేసిన జిమ్మిక్కులు అన్నీ ఇన్నీ కావు. రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం కల్పిస్తానని డబ్బా కొట్టుకుని అమలు చేయలేదని తెలిపారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.2,500 కోట్లు బకాయిలు పెట్టి వెళ్లారు.. కేంద్రం నుంచి ఆయుష్మాన్ భవ పథకం నుంచి రావాల్సిన రూ.1500 కోట్లకు చిల్లులు పెట్టాడు. ఆరోగ్యశ్రీ నిధులు తారుమారు చేసి తన పబ్బం గడుపుకున్నారు. ఏ ముఖం పెట్టుకుని రాష్ట్రంలో తిరగగలడు? అని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ వచ్చాక కూడా జగన్ తన తాబేదారులకు కాంట్రాక్టు బిల్లులు చెల్లించడానికి పడిన తాపత్రయం అంతా ఇంతా కాదు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించుకోవడానికి అనారోగ్యంతో ఉన్న రోగులను బలిపెట్టారు. వారి గురించి పట్టించుకోలేదు. వైసీపీ హయాంలో ఉచిత సేవలన్నారు..అవి ఏమ య్యాయి? అని ప్రశ్నించారు. పేదలు వైద్యం కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితు లొచ్చాయని మండిపడ్డారు. జగనన్న సురక్ష పథకం పేద ప్రజలకు ఏనాడు ఉపయోగపడలేదని తెలిపారు.

### ఏప్రిల్ 1 నుంచి హైబ్రిడ్ విధానంలో వైద్యసేవలు

కూటమి ప్రభుత్వం 7 నెలల్లోనే ఎన్టీఆర్ వైద్య సేవ పథకానికి అత్యంత ప్రాధాన్యత నిచ్చి రూ.1500 కోట్ల బకాయిలు తీర్చిందని తెలిపారు. జగన్ వల్ల ప్రజానీకం చాలా ఇబ్బంది పడ్డారు. ఏప్రిల్ 1 నుంచి హైబ్రిడ్ విధానంలో రూ.25 లక్షలు వరకు వైద్య సేవలను బీమా విధానంలో అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో ఆరోగ్య సురక్ష ప్రజార్భాటానికే తప్ప పనికిరాలేదు. ఫ్యామిలీ డాక్టర్ పథకం పత్తా లేకుండా పోయింది. సీఎంఆర్‌ఎఫ్‌ను అటకెక్కించారు. మెడికల్ సీట్లను అమ్ముకున్నారు. బలహీనవర్గాల విద్యార్థులు డాక్టర్లు కావాలనే వారి కలను తుంగలో తొక్కారు. ప్రజలకు ఉచిత ఆరోగ్య సేవలందకుండా చేశారు. అనేక అరాచకాలు సృష్టించారు. ప్రజలకు నిధులు అందకుండా, ఆరోగ్యం అందకుండా చేశారు. ప్రజల జీవితాలతో నిత్యం ఆటలాడుకున్నారు. ఆనాడు చంద్రబాబు ఆరోగ్యశ్రీని పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన కోటి 20 లక్షల మందికి అందజేశారు.

### ఉత్త మాటలతో పేదల ప్రాణాలు తీసిన జగన్‌రెడ్డి

వైద్యం ఖర్చు రూ.1000 దాటితే ఆరోగ్య శ్రీ వర్తిస్తుందని జగన్‌రెడ్డి గొప్పలు చెప్పారు. కానీ ఆచరణలో మాత్రం ఎక్కడా అమలు కాలేదు. ప్రభు త్వం బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో ఆరోగ్యశ్రీ కార్డు దారులను మెజారిటీ ఆస్పత్రులు దగ్గరకు కూడా



రానివ్వలేదు. కొన్ని ఆస్పత్రులైతే సగం మీరు చెల్లించండి, మిగిలిన సగం ఆరోగ్యశ్రీ కింద వసూలు చేసుకుంటామని నిబంధనలు పెట్టాయి. అందుకు రోగి ఒప్పుకుంటేనే జాయిన్ చేసుకున్నారు. ఈ తలనొప్పులు ఎందుకనుకున్న మరికొన్ని ఆస్పత్రులు అధికార వైసీపీ నేతల సిఫార్సులు ఉన్న వారికే వైద్యసేవలు అందించాయి. కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స, గుండె రక్తనాళాల మార్పిడి వంటి కీలక శస్త్ర చికిత్సలకు పూర్తి డబ్బు కట్టించుకున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఆరోగ్యశ్రీ కింద వైద్యం అందనప్పుడు ఉత్తుత్తి ప్యాకేజీ రూ.25 లక్షలు పెంచితే ఏంటి? కోటికి పెంచితే ఏంటి? అక్కరకు రాని జగన్‌రెడ్డి గొప్పలు పేదల ప్రాణాలు నిలబెట్టలేకపోయాయి. మాటలు మాత్రమే కోటలు దాటించి వైద్యాన్ని గాలికొదిలేసి ఆరోగ్య విప్లవం తెచ్చేశానని తన మందితో పొగడ్తలు కురిపించుకోవటం తప్పించి పేద, సామాన్య ప్రజల ఆరోగ్యం కోసం జగ న్మోహన్‌రెడ్డి చేసిందేమి లేదని ధ్వజమెత్తారు. ఆరోగ్యశ్రీ కింద చేసే చికిత్సలకు కేంద్రం ఆయుష్మాన్ భారత్ కింద నిధులిస్తున్నప్పటికీ పథకాలపై ఎక్కడా కేంద్రం లోగో, ప్రధాని బొమ్మ కూడా వేయకుండా కేవలం జగన్ ఫొటోలు మాత్రమే వేశారు. జగన్ ప్రచార పిచ్చిపై ఆగ్రహించిన కేంద్రం ప్రాయోజిత పథకాల కింద వైద్య ఆరోగ్య శాఖ కు రావాల్సిన రూ.1500 కోట్లు నిలిపేస్తామని హెచ్చరించినా ఏ మాత్రం లెక్క చేయ కపోవటం జగన్‌రెడ్డికే చెల్లిందని మండిపడ్డారు.

### సీఎంఆర్‌ఎఫ్‌లోనూ మెలిక

అన్ని ప్రాజెక్టుల మాదిరిగానే సీఎంఆర్‌ఎఫ్ విషయంలో జగన్మోహన్‌రెడ్డి రివర్స్ పద్ధతిని పాటించారు. దరఖాస్తుల తనిఖీలు పేరుతో కాలయాపన చేయడంతో 30 వేలకు పైగా దరఖాస్తులు, రూ200 కోట్ల వరకూ బిల్లులు పెండింగ్‌లో పడిపోయా యి. సీఎంఆర్‌ఎఫ్‌కు ప్రతిరోజూ 300 నుంచి 400 వరకూ దరఖాస్తులు వచ్చినా సెక్ష న్లో 100 కూడా క్లియర్ చేయకుండా బాధితులను తీవ్ర ఆందోళనకు గురి చేశారు. సీఎంఆర్‌ఎఫ్‌కు ఎవరి సిఫార్సులు లేకుండా అమలు చేస్తామని పాదయాత్ర సమయం లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మాత్రం ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు ఉంటేనే అన్న మెలిక పెట్టి మాట తప్పాడు. ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్స చేయాలంటే ఎల్‌వోసీ తెచ్చుకోవాలని వైద్యులు చెబుతుండగా ఎల్‌వోసీకి అధికారపక్షం ఎమ్మెల్యేనో లేక ఇన్‌చార్జ్ సంతకం అవసరమన్న నిబంధన పెట్టడంతో సాధారణ ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఎల్‌వోసీ కోసం రోగులు వస్తేనే ఇస్తామని సీఎంఆర్‌ఎఫ్ మరో నిబంధన పెట్టడంతో ముఖ్యమంత్రి సహాయ నిధిపై ప్రజలు ఆశలు వదులుకునే పరి స్థితికి తెచ్చారు. ఎలాగోలా నానా తిప్పలు పడి ఎల్‌వోసీలు తెచ్చినా ఒక్క రూపాయి కూడా ఆసుపత్రులకు విడుదల చేయలేదని తెలిపారు.

### పేదల ప్రాణాలు నిలుపుతున్న చంద్రబాబు

ప్రాణాపాయంలో అల్లాడుతున్న పేద రోగుల అవస్థలకు చలించిపోయిన ముఖ్య మంత్రి చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు 7,523 మందికి లబ్ధి కలిగేలా రూ.124 కోట్లు సీఎంఆర్‌ఎఫ్ కింద నిధులు విడుదల చేశా రు. టీడీపీ హయాంలో ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా బీపీఎల్ దిగువన ఉన్న కోటి 20 లక్షల మందికి పథకం వర్తింపజేశాము. ఐదేళ్లలో రూ.5,330 కోట్ల వ్యయంతో 18 లక్షల మంది రోగులకు లబ్ధి చేకూర్చాం. గుండె, ఊపిరితిత్తులు చికిత్స కూడా ఈ పథకంలో చేర్చాము. వినికిడి లోపం ఉన్న చిన్నపిల్లలకు కాక్లియార్‌ఇంప్లాంటేషన్‌కు రూ.6 లక్షలు, మూత్ర పిండ మార్పిడి లాంటి క్లిష్టతరమైన ఆపరేషన్లకు రూ.3.5 లక్ష ల వరకు అందించాం. అలాగే క్లయిమ్ అందగానే 70 శాతం నిధుల విడుదల చేశాం. ఇదీ పేదల వైద్యంపై టీడీపీకి ఉన్న చిత్తశుద్ధి. మరి జగనన్మోహన్ రెడ్డి చేసిం దేంటి? పైకి మాత్రం తన వైఫల్యాలు బయటపడకుండా ఆరోగ్యశ్రీ ప్యాకెజ్ పెంచాం, జగనన్న సురక్ష ఇస్తున్నాం, మెడికల్ కాలేజీలు కడుతున్నామని గడిచిన ఐదేళ్లపాటు కథలు వినిపించాడు. జగన్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కూటమి ప్రభు త్వంపై బురద జల్లడం మానుకోవాలని హితవుపలికారు.

## సీఎం భద్రతా వలయంలో

# కౌంటర్ యాక్షన్ బృందాలు...




అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు భద్రతా వలయంలోకి కొత్తగా కౌంటర్ యాక్షన్ బృందాలు వచ్చి చేరాయి. సీఎంకు మావోయిస్టుల నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఆయన భద్రతను పర్యవేక్షించే స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ (ఎస్‌ఎస్)లో ఇటీవల పలు మార్పులు చేశారు. బ్లాక్ క్యాట్ కమాండోలు, ఎస్‌ఎసీ సిబ్బందికి అదనంగా ఈ కౌంటర్ యాక్షన్ బృందాలూ ఇప్పుడు రక్షణలో ఉంటాయి. భద్రత కారణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, ముఖ్యమంత్రి రక్షణ విషయంలో రాజీపడకుండా కౌంటర్ యాక్షన్ బృందంలోని ఆరుగురు కమాండోలు విధుల్లో ఉంటారు.

### బయటినుంచి జరిగే దాడి ఎదుర్కొనేలా..

చంద్రబాబుకు మూడంచెల భద్రతలో తొలి వలయంలో ఎన్‌ఎస్జీ, రెండో వలయంలో ఎస్‌ఎస్, వివిధచోట్ల పర్యటనలకు వెళ్లినప్పుడు అక్కడి పోలీసు యూనిట్లకు చెందిన సాయుధ బలగాలు మూడో వలయంగా ఉంటాయి. వీరందరితోపాటు సీఎంకు కొద్దిదూరంలో నిత్యం వెన్నంటి ఆరుగురు కౌంటర్ యాక్షన్ కమాండోలు ఉంటారు. ఆపద సమయాల్లో మొదటి, రెండో వలయంలోని సిబ్బంది ముఖ్యమంత్రిని రక్షించి సురక్షిత ప్రాంతానికి తరలిస్తే, కౌంటర్ యాక్షన్ టీమ్.. బయటి నుంచి దాడి చేసే వారిని సమర్థంగా ఎదుర్కోవడంపై దృష్టి సారిస్తుంది. ప్రధాని భద్రతను పర్యవేక్షించే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) శిక్షణలో కౌంటర్ యాక్షన్ కమాండోలు రాటుదేలారు. వీరికి ప్రత్యేక డ్రెస్ కోడ్‌నూ అమలు చేస్తున్నారు. నలుపు రంగు చొక్కా, ముదురు గోధుమ రంగు ప్యాంటును కమాండోలు ధరిస్తారు. వీరి చొక్కాకు ముందు, వెనుక ఎస్‌ఎస్ అనే ఆంగ్ల అక్షరాలు కనిపిస్తాయి.

# సూపర్ స్పెషాలిటీలుగా ఈఎస్ఐ ఆస్పత్రులు



- ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి సుభాష్ ఆదేశం
- నూజివీడు, తణుకు పట్టణాల్లో కొత్తగా ఈఎస్ఐ ఆస్పత్రులు
- కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచన

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రస్తుతమున్న నాలుగు ఈఎస్ఐ ఆసుపత్రుల ను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులుగా అభివృద్ధి చేయడానికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్ కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్లు బీమా వైద్యశాఖల మంత్రి అధికారులకు సూచించారు. ఆంధ్ర ప్రదేశ్ సచివాలయంలో బుధవారం జరిగిన సమీక్షా సమావేశానికి మంత్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఆసుపత్రులు, డిస్పెన్సరీలు డయాగ్నోస్టిక్ సెంటర్లను పూర్తిస్థాయిలో పనిచేయడానికి అవసరమైన చర్యలు తీసుకో వాలన్నారు. ప్రస్తుతం రూ. 14.5 లక్షలు ఉన్న ఇన్ పర్సన్ ఇన్సూరెన్స్ రూ.25 లక్షలకు పెరిగే విధంగా కార్మిక శాఖతో సమన్వయం చేసుకొని ఫలితం సాధించాల న్నారు. విశాఖపట్నం, రాజమండ్రి, విజయ వాడ, తిరుపతి ఈఎస్ఐ హాస్పిటళ్లను సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్ళను అభివృద్ధి చేయడా నికి అవసరమైన సమగ్ర ప్రణాళిక రూపొం దించాలన్నారు. ముఖ్యంగా అవసరమైన సిబ్బందిని, పరికరాలు సమకూర్చటంలో తగు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలన్నారు. ఈఎస్ఐసీ అందించే పనులు పూర్తిస్థాయిలో వినియోగించుకొని ఎక్కువ ప్రయోజనం పొందడానికి అవసరమైన ప్రతి పాదనలు సిద్ధం చయాలని ఆదేశించారు. తనిఖీ అధికారులు లేకపోవడం వల్ల ఫ్యాక్టరీలు, షాపుల్లో పనిచేసే కార్మికులకు ఈఎస్ఐ రికార్డుల్లో నమోదు చేయలేకపోతు న్నారన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైతే స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల తణుకు ఎమ్మెల్యే తణుకులో, మంత్రి కొలుసు పార్థసా రథి నూజివీడులో హాస్పిటళ్లు ఏర్పాటు చేయమని కోరారన్నారు. దానికి అవసరమైన ప్రతిపాదనలు పరిశీలించి తనకు అందజేయాలని ఆదేశించారు. స్పెషల్ గ్రేడ్ సివిల్ సర్జన్ నుండి క్రింది స్థాయి డాక్టర్ల వరకు, ఇతర ఉద్యోగులకు ప్రమోషన్లు త్వరగా ఇచ్చేందుకు ప్రతిపాదనలు రెడీ చేయాలన్నారు. కార్మిక శాఖ విషయానికి వస్తే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో కార్మిక శాఖ పాత్ర చాలా ముఖ్యమైనదన్నారు. ఇందులో అధికారులు చేపట్టిన కార్యక్రమాలు, వాటి ఫలితాలు, ఫలితాలు, మొత్తం ప్రయోజనాలను ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్తున్నారని అధికారులను ప్రశ్నించారు. ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డ్‌లో అమలులో ఉన్న పథకాలు, గత ప్రభుత్వం నిలుపుదల చేసిన పథకాల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవచ్చనే దానికి సంబంధించి ప్రతిపాదన కూడా సిద్ధం చేయాలన్నారు. చంద్రన్న బీమా విధి విధానాలు త్వరితగతిన ఖరారు చేయాలన్నారు. వచ్చే మార్చి నెల నుండి పెండింగ్ క్లెయివమ్‌లను త్వరగా పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎల్ఓ, ఏసీఎల్, డీసీఎల్, ఇతర ఉద్యోగుల ప్రమోషన్లలో డీపీసీలు త్వరగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్, అడిషనల్ సెక్రటరీ గంధం చంద్రుడు, ఐఎంఎస్ డైరెక్టర్ ఐఆర్‌టీఎస్ ఆంజనేయులు, లేబర్ జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

# వచ్చే సీజన్‌కు హంద్రీనీవా పనులు పూర్తి

- గాలేరు నగరి-హంద్రీనీవా లింక్ పనులపై ఆరా
- హంద్రీనీవా పనులపై మంత్రి నిమ్మల వీడియో కాన్ఫరెన్స్



అమరావతి (చైతన్యరథం): గత ఐదేళ్లూ హంద్రీ నీవా ప్రాజెక్టు పనులను గాలికొదిలేసి.. మాజీ సీఎం జగన్మోహనరెడ్డి రాయలసీమ రైతాంగానికి తీవ్ర అన్యాయం చేశారని నీటి పారుదల మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. బుధవారం విజయవాడ ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో హంద్రీ నీవా, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి హంద్రీ నీవాకు కలిపే లింక్ ఛానెల్ పనులపై ఇరిగేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.2,629 కోట్ల రూపాయలతో రాయలసీమ వరప్రదాయని హంద్రీ నీవా పనులు పునఃప్రారంభించారని తెలిపారు. వచ్చే సీజన్ నాటికి హంద్రీనీవా ప్రధాన కాల్వ పనులు పూర్తి చేసి రాయలసీమ ప్రాంతంలోని చివరి ఎకరం వరకు సాగు నీరందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా గాలేరు నగరి సుజల స్రవంతి పథకం నుండి హంద్రీ నీవాలను కలిపే లింక్ ప్రాజెక్టు పనుల గురించి, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి హంద్రీనీవాలను కలిపే లింక్ పనులపైనా ప్రత్యేకంగా చర్చించారు. హంద్రీనీవా ప్రధాన కాలువ చివర వరకు నీటిని తరలించేందుకు ఉన్న అడ్డంకులను వెంటనే పరిష్కరించేందుకు ఎటువంటి పనులు జరుగుతున్నాయి, వాటి పనితీరు ఏవిధంగా ఉందనే వివరాలతో సమగ్ర నివేదిక తయారు చేసి త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలసి అందజేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా తదుపరి పనులు వేగవంతం చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సమావేశంలో ఇరిగేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్, ఈఎన్సీ ఎం వెంకటేశ్వరరావుతో పాటు ఆయా ప్రాజెక్టుల సీఈలు, ఎస్ఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దిగజారుడు రాజకీయాల దిగ్గజానివి!

- జగన్‌రెడ్డి విమర్శలపట్ల మంత్రి సత్యకుమార్ ఘాటైన కౌంటర్
- వైద్యరంగం పట్ల ద్వంద ప్రమాణాలు ఎత్తిచూపిన మంత్రి
- ప్రజారోగ్యానికి సంబంధించి పది అంశాలపై నిలదీత
- అసత్య ప్రచారంతో రాజకీయ సౌధం నిర్మించలేవంటూ ఆగ్రహం
- ఓటమి నుంచి సరైన పాఠాలు నేర్చుకోలేదంటూ ఎద్దేవా
- మాజీ సీఎంకు మంత్రి సత్యకుమార్ నాలుగు పేజీల లేఖ



అమరావతి (చైతన్యరథం): దిగజారుడు రాజకీయాల్లో మాజీ సీఎం జగన్‌రెడ్డి ఆరితేరిపోయారని వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ విరుచుకుపడ్డారు. ఆరోగ్య రంగానికి సంబంధించి జగన్ ప్రభుత్వంలో పది వైఫల్యాల్ని సత్యకుమార్ యాదవ్ అంకెలతో సహా ఎత్తిచూపి, జగన్‌రెడ్డి ద్వంద్వ ప్రమాణాలను ఎండగట్టారు. జగన్ హయాంలో రూ.12,163.64 కోట్ల మేరకు ఆరోగ్యశ్రీ చెల్లింపులకు ఆమోదం తెలిపి.. కేవలం రూ.9,942.04 కోట్లు మాత్రమే వాస్తవంలో చెల్లించారు. జగన్ చెప్పుకుంటు న్నట్లు రూ.13,421 కోట్లు చెల్లిస్తే, రూ.3,500 కోట్ల అదనపు చెల్లింపులు ఏమయ్యాయని ప్రశ్నించారు. జగన్ హయాంలో సగటున ఏడాదికి రూ.1,807.64 కోట్ల మేరకు మాత్రమే ఆరోగ్యశ్రీ చెల్లింపులు జరిగితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఆరు నెలల్లోనే డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలకు రూ.1,850 కోట్లు చెల్లిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వైద్యరంగానికి కూటమి ప్రభుత్వం రూ.4,000 కోట్లు కేటాయించిన వాస్తవాన్ని విస్మరించి నగదురహిత సేవల్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని జగన్‌రెడ్డి అసత్య ప్రచారానికి దిగజారారని మండిపడ్డారు. అధికారంలో నుంచి దిగిపోయే నాటికి జగన్ ప్రభుత్వం రూ.2,221.60 కోట్ల బకాయిలు పెడితే, కూటమి ప్రభుత్వం రూ.3,000 కోట్ల బకాయిలు పెట్టిందని ఆయన చేసిన ఆరోపణలో వాస్తవం లేదన్నారు. నగదు రహిత వైద్య సేవల్ని కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తోందంటూ జగన్ చేసిన ఆరోపణల్ని మంత్రి బలంగా తిప్పికొట్టారు. ఎన్నికల హామీ మేరకు ప్రతి కుటుంబానికీ హైబ్రిడ్ విధానంలో ఏడాదికి రూ.25 లక్షల మేరకు ఆరోగ్య భద్రత కల్పించడానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్ని వివరించారు. ప్రభుత్వ పర్యవేక్షణలోనే స్పష్టమైన నియమ నిబంధనల ప్రకారం రూ.2.50 లక్షల మేరకు ఆరోగ్య బీమా కల్పిస్తున్నామన్నారు. ఆ మేరకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి అదనపు మొత్తాన్ని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా చెల్లించడం ఈ సేవల్ని ప్రైవేటుపరం చేయడం ఎలా అవుతుందని జగన్‌రెడ్డిని సత్యకుమార్ యాదవ్ నిలదీశారు.

ఎన్నికల హామీ మేరకు ప్రతి కుటుంబానికీ రూ.25 లక్షల మేరకు ఆరోగ్య సేవల గ్యారంటీ కల్పిస్తుంటే కోటి కుటుంబాలకు ఆరోగ్య భద్రతను కూటమి ప్రభుత్వం తీసేస్తోందని జగన్ ఆరోపించడాన్ని మంత్రి ఆక్షేపించారు. గతంలో ఆరోగ్యశ్రీ వైద్య ఖర్చుల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల మేరకు పెంచిందని చెప్పుకుంటున్న జగన్ రెడ్డి తన హయాంలో ఒక్క కుటుంబానికి కూడా పెంచిన మేరకు సహాయం అందించలేదని మంత్రి వెల్లడించారు. జగన్ వైఖరికి భిన్నంగా నెట్వర్క్ ఆసుపత్రుల సంఘం, ఆశా ప్రతినిధులు బకాయిల పట్ల తమ ఆందోళనను వెలిబుచ్చిన వెంటనే ప్రభుత్వం స్పందించిందన్నారు. వారిని చర్చలకు పిలిచి అతి త్వరలో రూ.500 కోట్లు విడుదల హామీ ఇవ్వడంతో పాటు నగదు రహిత సేవల అమలుకు సంబంధించి పలు అంశాల్ని విస్తృతంగా చర్చించిందని మంత్రి వివరించారు. దీనికి భిన్నంగా జగన్ హయాంలో 13 సార్లు సేవల్ని ఆపేస్తామని ఆశా నోటీసులిచ్చినా ఒక్కసారైనా ఆ ప్రభుత్వం వారి సమస్యల్ని చర్చించలేదని మంత్రి ఎత్తిచూపారు. నగదు రహిత సేవల్ని కొనసాగించాలన్న జగన్ డిమాండ్ పట్ల స్పందిస్తూ ఆయన హయాంలో కంటే మరింత పటిష్టంగా, మరింత విస్తృతంగా ప్రజలకు ప్రయోజనం కలిగేలా ఆ సేవల్ని కూటమి ప్రభుత్వం కొనసాగి స్తుందని సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

జగన్ హయాంలో 108, 104 సేవల నిర్వహణలో లోపాలు, అక్రమాల్ని మంత్రి ఎత్తిచూపుతూ జగన్ రెడ్డి సంప్రదాయానికి విరుద్ధంగా తన అస్మదీయులకు ఏడేళ్ల కాంట్రాక్టును అప్పగించి దోపిడీకి దారితీశారని మంత్రి ఆరోపించారు. ఈ వాహనాలు మరమ్మతులకు నోచుకోక, సమయానికి రాక, నిర్దిష్ట సమయంలో వాహనాల్ని తిప్పకపోవడంతో ప్రజలు పడ్డ ఇక్కట్లను జగన్ రెడ్డికి గుర్తు చేశారు. జగన్ హయాంలో ఈ సేవలకు సంబంధించి జరిగిన అక్రమాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం అరబిందో కంపెనీపై ఐదేళ్ల కాలంలో కేవలం రూ.16 కోట్ల మేరకే పెనాల్టీలు విధిస్తే. కూటమి ప్రభుత్వం మొదటి ఆరు నెలల్లోనే రూ.23 కోట్ల మేర పెనాల్టీలు విధించి, ఈ సేవల సక్రమ నిర్వహణ పట్ల తమ చిత్తశుద్ధిని వెల్లడించుకుందని సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజారోగ్యం కోసం ఎంతో చేశామని చెప్పుకునే జగన్ అధికారం నుండి వైదొలిగే నాటికి డ్రగ్స్, శస్త్ర పరికరాల సరఫరాకు సంబంధించి రూ.700 కోట్ల మేరకు బకాయిలు పెట్టి పోయారన్నారు.

ఆసుపత్రుల రూపురేఖల్ని మార్చుడానికంటూ రూ.16,861 కోట్లతో ఆయన చేపట్టిన నాడు-నేడు కార్యక్రమం అంతంత మాత్రమేనన్నారు. కేవలం రూ.3,646 కోట్లు(21.62 శాతం మాత్రమే) ఖర్చు పెట్టి జగన్ రెడ్డి ప్రజల ఆరోగ్యం పట్ల తమకు చిత్తశు ద్ధి లేదని ఆయనే వెల్లడించుకున్నారని మంత్రి ఎదద్దేవా చేశారు. రూ.18,700 కోట్లతో 17 నూతన ప్రభుత్వ కళాశాలలను నిర్మిస్తామని నానా హంగామా చేసిన జగన్ రెడ్డి తమ హయాంలో కేవలం అంచానాల్లో 16 శాతం మాత్రమే ఖర్చుపెట్టి దానినొక ప్రహసనంగా మార్చారన్నారు. జగన్ మాటలు, చేతల మధ్య ఉన్న భారీ తేడాను ప్రజలు గమనించడం వల్లే గత ఎన్నికల్లో జగన్ రెడ్డికి ఝలక్ ఇచ్చారన్నారు. చారిత్రాత్మకమైన ఆ ప్రజాతీర్పులో సందేశాన్ని ఇప్పటికైనా గ్రహించాలని సత్యకుమార్ హితవు పలికారు. అసత్యపు ప్రచార పునాదుల మీద తన రాజకీయ సౌధాన్ని పునర్నిర్మించుకోవాలన్న దురాలోచన వీడాలన్నారు. ప్రజలు మెచ్చేలా విలువలతో కూడిన రాజకీయ బాటలో నడవాలని మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు సత్యకుమార్ యాదవ్ సూచించారు.

# సమస్యలు సత్వరం పరిష్కరిస్తాం

## - బాధితులకు ప్రజాప్రతినిధుల హామీ

- అర్జీలు స్వీకరించిన పీతల సూజాత, ఎమ్మెల్యే వసంత, నూకసాని
- వైసీపీ నేతల నుండి ప్రాణహాని ఉందంటూ బాధితుల ఆవేదన
- భూములను కబ్జాకోరుల నుండి కాపాడాలంటూ అర్జీలు



అమరావతి (చైతన్యరథం): తమ గ్రామ పరిధిలో ఉన్న పోడు భూములను తరతరాలు తాము సాగు చేసుకుంటున్నామని వాటికి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం మాధవరం గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు వేడుకున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం బాధితులు అర్జీలతో బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చారు. ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి పీతల సూజాత, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ బాధితుల నుండి అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. తన భర్త కొనుగోలు చేసి అగ్రిమెంట్ చేసుకున్న స్థలాన్ని ఆవుల చెన్నయ్య అనే వ్యక్తి కబ్జా చేసి తన భార్య బిడ్డల మీద అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని దీనిపై విచారించి తనకు న్యాయం చేయాలని పల్నాడు జిల్లా దుర్గి మండలానికి చెందిన జక్క శ్రీదేవి తాను ఇచ్చిన అర్జీలో కోరారు. పేదలు ఒక్క నెల కరెంట్ బిల్లు కట్టకుంటే ఫీజులు పీక్కు వెళ్లే అధికారులు గుంటూరు జిల్లా మంగళగిరి మండలం చినకాకానిలో ఉన్న టెక్స్‌టైల్ కంపెనీ విద్యుత్ శాఖకు కోట్ల రూపాయాలు బకాయిలు పెట్టినా పట్టించుకోలేదని కె వెంకటేశ్వర రావు నేతలకిచ్చిన అర్జీలో ఫిర్యాదు చేశాడు. బకాయిల వసూళ్లలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నాడు. బిల్లులు చెల్లించకుండా కంపెనీ మూత పడిందన్నారు. దీంతో డిస్కంకు భారీ నష్టం జరిగిందని వివరించాడు. దీనికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరాడు. తన భర్త బాబూరావు వీఆర్‌ఏగా సర్వీసులో ఉండి మరణించాడని, కారుణ్య నాయామకం క్రింద తన కుమార్తెకు ఏదైనా ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం లింగమగుంట గ్రామానికి చెందిన మెడ బలిమి మీనా నేతలను వేడుకున్నారు. తమ చేత వరి కోత మిషన్‌తో వరికోయించుకొని డబ్బులు ఇవ్వమంటే బండారు తిరుమలరావు ఇబ్బంది పెడుతున్నాడని కృష్ణా జిల్లా బాపులపాడు మండలం బండారుగూడెం గ్రామానికి చెందిన తురక సుధాబాబు వాపోయాడు. డబ్బులు ఇచ్చేది లేదని ఇష్టం వచ్చింది చేసుకోమని బరితెగించి మాట్లాడుతున్నాడని ఫిర్యాదు చేశాడు. అతనిపై చర్యలు తీసుకొని తమకు రావాల్సిన డబ్బులు ఇచ్చేలా చూడాలని వేడుకున్నాడు. గుంటూరు జిల్లా తెనాలి మండలం నందివెలుగు గ్రామంలో గతంలో తమకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని వైసీపీ నేతలు దౌర్జన్యంగా కబ్జా చేసి తమపై దాడులు చేస్తున్నారని వారి నుండి తనకు ప్రాణ హాని ఉందని తనకు గన్ లైసెన్స్ ఇప్పించి సాయం చేయాలని తోటకూర కోటేశ్వరరావు అనే వ్యక్తి ఇచ్చి వేడుకున్నాడు.







# రావినూతలలో అట్టహాసంగా క్రికెట్ పోటీలు

## - ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఏపీ టూరిజం అభివృద్ధి సంస్థ చైర్మన్ డా. నూకసాని బాలాజీ





బాపట్ల, చైతన్యరథం: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం రావినూతలలో క్రీడా, సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 34వ అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలను ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "గ్రామీణ ప్రాంతాల్లో పట్టణాలకు దీటుగా స్టేడియం నిర్మించిన రావినూతల క్రీడా సంఘం అధ్యక్షులు కారసాల నాగేశ్వరరావు (బాబు) కృషి అభినందనీయం" అని కొనియాడారు.

ప్రేక్షకుల కోసం గ్యాలరీలలో అత్యాధునిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలని నూకసాని బాలాజీ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని సింగరకొండ, సంతనూతలపాడు ప్రాంతాలతో పాటు మల్లవరం డ్యామ్‌ను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, దీనికి స్థానిక శాసనసభ్యులు, మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో తగిన నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ సినీనటుడు ఎర్ర రఘుబాబు మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి అంతర్జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించడం ఎంతో గర్వకారణం. ఇటువంటి ఉన్నత సాంప్రదాయం కలిగిన గ్రామంలో జన్మించడం మా అదృష్టం" అని అన్నారు. ఈ కార్యక్రమములో భ్రమరా వెంచర్స్ అధినేత గళ్ళ రామచంద్ర రావు, ఆంధ్ర బ్యాట్మెంట్ అసోసియే షన్ రాష్ట్ర మాజీ కార్యదర్శి కరణం పున్నయ్య చౌదరి, సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లికార్జునరావు, గ్రామ ప్రజలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవే ధ్యేయం.. రాజకీయాలంటే ఇష్టం!

## - ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి వెల్లడి

- విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 140 మంది దివ్యాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే కాకర్ల
- లబ్ధిదారుల కళ్ళల్లో సంతోషం



(చైతన్యరథం):ప్రజాసేవే ధ్యేయంగా జిల్లాలో ఫౌండేషన్ తరపున అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల్లో దివ్యాంగులు పడుతున్న అవస్థలకు పరిష్కారంగా ట్రై సైకిల్స్ పంపిణీ ప్రారంభించినట్లు వివరించారు. బుధవారం ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరులో విభిన్న ప్రతిభావంతులకు వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ళు పంపిణీ చేసే కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ లతో కలిసి ఆయన పాల్గొన్నారు. పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలతో సంబంధం లేకుండా సేవే పరమార్ధంగా 10 సంవత్సరాల క్రితం వీపీ ఆర్ ఫౌండేషన్‌ను స్థాపించామన్నారు. అప్పటినుండి సమాజంలోని పేద వర్గాలకు వివిధ స్థాయిల్లో విద్య, మంచినీటి వసతి తదితర సేవలందిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 150కి పైగా ఆర్ ఓ ప్లాంట్లను నిర్మించామన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యటించినప్పుడు ఉదయగిరి నియోజకవర్గంలో ఎక్కువ మంది విభిన్న ప్రతిభావంతులను గుర్తించామని, అందుకే మొదటగా ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ పంపిణీ కార్యక్రమంను ఇక్కడి నుంచే ప్రారంభించామన్నారు. మొత్తం 140 మంది లబ్ధిదారులకు ట్రై సైకిళ్లు అందిస్తున్నామన్నారు.





## పాందూరులో పెరిగిపోతున్న అతిసారం



పొందూరు (చైతన్యరథం): పొందూరు కస్పా వీధిలో అతిసారం బాధితులు పెరుగుతున్నారు. మంగళవారం అయిదుగురు వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చేరారు. సామాజిక ఆసుపత్రిలోని రోగులను జిల్లా పంచాయతీ అధికారిణి భారతీసౌజన్య పరామర్శించారు. వీధుల్లో పారిశుద్ధ్యం నిర్వహణ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. నీటి పరీక్షలు చేయాలని ఆదేశించారు. మండల కేంద్రంలో మాంసం, చేపల విక్రయాలు నిషేధించాలని, తీవ్రత తగ్గే వరకు వైద్య శిబిరాలు కొనసాగించాలని సూచించారు. నాలుగు రోజుల పాటు ట్యాంకర్ల ద్వారా తాగునీరందించాలని చెప్పారు. తాడివలస వైద్యాధికారి రమేష్నాయుడు ఆధ్వర్యంలో పీహెచ్సీ సిబ్బంది రోగులకు ఇంటి వద్ద చికిత్స చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారిని ఎంపీడీవో మన్మథరావు, తెదేపా మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, సర్పంచి లక్ష్మి పరామర్శించారు. డీఎల్పీవో ఐ.వి.రమణ, ఈవో మోహన్ బాబు, ఏవో మిత్రా పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే మా ధ్యేయం : గొండు శంకర్



శ్రీకాకుళం (చైతన్యరథం): సమస్యల పరిష్కారమే ధ్యేయమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని విశాఖ-ఏ కాలనీలో గల తన కార్యాలయంలో గ్రీవెన్స్‌కు నిర్వహించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాల్లో కనీస సదుపాయాలకు కూడా ప్రజలు నోచుకోలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం పల్లె పండుగ, గ్రామసభలు నిర్వహించి గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతోందని తెలిపారు. వైసీపీ హయాంలో ఛిన్నాభిన్నమైన వ్యవస్థలను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. రైతులకు ధాన్యం అమ్మిన 24 గంటల్లోగా వారి అకౌంట్లలో నగదును జమ చేస్తున్నామన్నారు.

## విశాఖ - కాకినాడ వరకు ఈత కొట్టిన మహిళ

● 150 కిలోమీటర్ల దూరాన్ని అవలీలగా ఈదేసిన స్విమ్మర్



విశాఖపట్నం (చైతన్యరథం): ఏదైనా సాధించడానికి వయసుతో పనిలేదని నిరూపించింది ఆమె. చెరువులు, నదుల్లో దిగటం మాత్రమే తెలిసిన ఆమె నలభై ఏడేళ్ల వయసులో శ్రీలంక జలసంధిని అవలీలగా ఈదేశారు. ఈ ఏడాది మార్చిలో పాక్‌జలసంధి 30 కి.మీ దూరాన్ని 13 గంటల 43 నిమిషాల్లో ఈదిన తెలంగాణ తొలి మహిళగా ఘనతను సాధించారు. ఆమె ఎవరో కాదు మన తెలుగు తేజం. పేరు గోలి శ్యామల. తాజాగా ఎంతో క్లిష్టమైన కాటలినా ఛానల్‌ను 10 గంటల 4 నిమిషాల 45 సెకన్ల పాటు ఏకబిగిన ఈతకొట్టి మరో రికార్డు ఖాతాలో వేసుకున్నారు. శ్యామల విజయయాత్ర అక్కడితో ఆగకుండా విశాఖ ఆర్కే బీచ్‌లో జరగనున్న స్విమ్మింగ్ కార్యక్రమంలో ఏకంగా 150 కిలోమీటర్ల దూరాన్ని ఈదేందుకు శ్రీకారం చుట్టారు.

**యువతరానికి ఈమె ఆదర్శం :ఎంపీ శ్రీ భరత్**

విశాఖకు చెందిన కోరమాండల్ ఒడిస్సీ ఓషన్ స్విమ్మింగ్ ఆధ్వర్యంలో గోలి శ్యామల విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు ఈత కొట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఈ స్విమ్మింగ్ కార్యక్రమాన్ని ఎంపీ శ్రీభరత్ విశాఖ ఆర్కే బీచ్ లో ప్రారంభించారు. "150 కిలోమీటర్ల దూరాన్ని శ్యామల ఈదుతారు. గతంలో ఈమె కన్యాకుమారి నుంచి శ్రీలంకకు సముద్రంలో ఈదుకుంటూ వెళ్లారు. ఐదు పదుల వయసు పైబడిన శ్యామల మహిళా స్థిరమైన శక్తికి ఒక ఉదాహరణ" అంటూ ఎంపీ శ్రీభరత్ అభివర్ణించారు. ఈ వయసులోనూ ఈత నేర్చుకొని సముద్రాన్ని ఈదడం ఆమె లక్ష్య స్థిరత్వానికి ఉదాహరణగా ఉంటుందని చెప్పారు. యువతరానికి ఈమె ఆదర్శంగా ఉంటారన్నారు. నిత్యం చైతన్యవంతంగా ఉండేందుకు ప్రయత్నిస్తానని గతంలో తనను హేళన చేసిన వారే ఇప్పుడు మెచ్చుకోవడం జరుగుతుందని గోలి శ్యామల అన్నారు.

## పారిశ్రామిక ప్రగతికి కృషి : మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం (చైతన్యరథం): రాష్ట్రంలో పారిశ్రామికంగా ప్రగతి పరుగులు తీసేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బొబ్బిలిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న పుష్పయాగాన్ని సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఏపీఐఐసీ గ్రోత్ సెంటరు రోజురోజుకు నీరసించిపోతోందని, ఇక్కడ అధికారులు, ఉద్యోగులు ఎవరూ పూర్తిస్థాయిలో లేకపోవడంతో అందరికీ అసౌకర్యంగా ఉందని మంత్రి దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించారు. ఏపీఐఐసీని బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ఆ సంస్థ ఎండీని రప్పించి చర్చించామన్నారు. బొబ్బిలి గ్రోత్ సెంటరులో సదుపాయాల కల్పన చాలా అవసరమని గుర్తించామన్నారు. వాటికోసం ప్రత్యేకంగా అంచనాలు తయారు చేయించామన్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం స్థలాలు తీసుకుని ఎటువంటి యూనిట్లను స్థాపించని వారి విషయమై గట్టిగా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. గజపతినగరం నియోజకవర్గ పరిధిలో మరుపల్లిలో కూడా 80 ఎకరాల ఏపీఐఐసీ స్థలం వృథాగా ఉన్నట్లు గుర్తించామన్నారు. మండలానికి ఒకరు, నియోజకవర్గానికి ఒకరు చొప్పున ఐపీఓలను నియమిస్తామన్నారు. పరిశ్రమలను ఏర్పాటు చేయదలుచుకున్న వారికి ప్రభుత్వ పరంగా పూర్తిస్థాయి సమాచారం అందించేందుకు, వారిని ప్రోత్సహించేందుకు ఐపీఓలు సేవలందిస్తారన్నారు. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించి ఇప్పుడేమో కూటమి ప్రభుత్వంపై హేళనగా మాజీ మంత్రి అమర్‌నాథ్ మాట్లాడడం తగదన్నారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రతిపక్షానికి చెందిన వారికి సైతం రాష్ట్ర బాగోగుల పట్ల బాధ్యత ఉండాలన్నారు. అలా కాకుండా వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కేవలం ఆరునెలల పాలనలో రాష్ట్రాన్ని అభ్యుదయం వైపు నడిపించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్ తదితరులు చేస్తున్న కృషిని ప్రజలు బాగా అర్థం చేసుకున్నారన్నారు.



## సీతంపేట మహిళకు గణతంత్ర వేడుకలకు ఆహ్వానం



విశాఖపట్నం (చైతన్యరథం): సీతంపేటలో నివాసం ఉంటున్న నారీ శక్తి అవార్డు గ్రహీత పడాల భూదేవికి భారత గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం వచ్చింది. భూదేవి ఆదివాసీలతో కలిసి మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయడం, గిరిజన ప్రాంతాల్లో పండించే ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించడం... వారికి ఆధునిక వ్యవసాయ పద్ధతులు నేర్పించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనిని గుర్తించి గణతంత్ర వేడుకలలో పాల్గొనేందుకు ఆహ్వానం పంపించారు. ఈ సందర్భంగా భూదేవి మాట్లాడుతూ... ఈ ఆహ్వానాన్ని అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇది అందరి కృషి వల్లనే సాధ్యమైందని చెప్పారు. దీనితో తన బాధ్యత మరింత పెరిగిందని అన్నారు

## ఈనెల 10న అరకులో ఉద్యోగమేళా

అరకులోయ (చైతన్యరథం): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సెడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 10న అరకులోయలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రోహిణి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్‌ఐటీఐలో నిర్వహించే ఈ ఉద్యోగమేళాలో అపోలో ఫార్మసీ, యాక్సిస్ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు హాజరై ఎంపిక కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన 18 నుంచి 30 ఏళ్ల లోపున్న ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువత అర్హులన్నారు. అభ్యర్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు విద్యార్హత ధ్రువపత్రాలు, పాన్, ఆధార్ కార్డుల జిరాక్సుతో ఆర్ ఐటీఐలో హాజరు కావాలన్నారు.




## డోలీ మోతలు లేకుండా చేస్తాం : మంత్రి గుమ్మడి సంధ్యారాణి వెల్లడి

సాలూరు (చైతన్యరథం): రాష్ట్రంలో గల ప్రతి గ్రామంలో రహదారుల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.300 కోట్లు మంజూరు చేశారని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మంచాడవలస గ్రామం లో 274 మీటర్ల సీసీ రోడ్డును రూ.11లక్షలతో నిర్మించిన రోడ్డును ఆమె మంగళవారం ప్రారంభించారు. సాలూరు నియోజకవర్గానికి రూ.80కోట్లు మంజూరయ్యాయన్నారు. పాచిపెంట మండలంలో 27 రహదారులు పూర్తి చేశామని, ఇంకా 20 రహదారులు ఉన్నాయని చెప్పారు. డోలీ మోతలు లేకుండా ప్రతి గిరిజన గ్రామానికి లింకు రోడ్లు నిర్మిస్తామన్నారు. ప్రతి గ్రామానికి సాగునీరు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. అనర్హులకు సంబంధించి రాష్ట్రంలో ఐదు లక్షల పింఛన్లు ఉన్నాయని, వాటిపై పరిశీలన చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు, నాయకులు ముఖి సూర్యనారాయణ, కొరిపల్లి సురేష్, గూడేపు యుగంధర్, చల్లా కనకబాబు, కొత్తల పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు. చెప్పుకోవడానికి, వినడానికి అసహ్యంగా ఉన్న పాచిపెంట గ్రామం పేరును పసిడి పంటగా మారుస్తానని మంత్రి సంధ్యారాణి సభా ముఖంగా తెలిపారు. ఈ మేరకు తీర్మానం చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ఈ నిర్ణయం అందరికీ ఇష్టమేనా అని అడగగా, సభలో ఉన్న వారంతా అంగీకారం తెలుపుతూ కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్‌లు అందజేసిన బడేటి



ఏలూరు (చైతన్యరథం): ఆపద సమయంలో అందించే సాయం అవసరార్థులకు అత్యంత ఉపయుక్తమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. నియోజకవర్గం పరిధిలో ఇప్పటివరకు సుమారు కోటి రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో 9 మందికి 11 లక్షల 74వేల 8వందల రూపాయల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే బడేటి చంటి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోన్న పేదలకు అనారోగ్య పరిస్థితులు మరింత భారం కాకూడదనే ఆలోచనతోనే కూటమి ప్రభుత్వాధినేతలు గతంలో ఎన్నడూలేని విధంగా ఎన్టీఆర్ వైద్యసేవల్ని అందుబాటులోనికి తీసుకువచ్చారన్నారు. అయితే ఆ సేవల పరిధిలోకి రాని వైద్యసేవలను కూడా పేదలకు అందాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు ఏలూరు నియోజకవర్గంలో సుమారు కోటి రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అర్హులకు అందజేసినట్లు ఎమ్మెల్యే చంటి తెలిపారు. ఇందుకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తోన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పైల వెంకట్రావు-25,000, బొమ్మన హేమలత-27,000, కూరేటి కనకదుర్గ-50,999, షేక్ రిజ్వానా-3,08,615, తుపాకుల ప్రసాద్-1,00,000, పాయం లక్ష్మి-4,00,000, బోళ్ల శ్రీనివాస్-1,07,980, ఉప్పుటూరి వెంకట లక్ష్మి అంజనాదేవి-55,206, చెన్నకేశవుల మంగాదేవి-1,00,000 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నగర అధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఒకపక్క అనారోగ్యంతో, ఇంకోపక్క ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోన్న ఎంతోమందికి ముఖ్యమంత్రి సహాయ నిధి సాయం కొండంత ధైర్యాన్నిస్తుందని ఐఎఫ్‌టియూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు. వెంకటేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఇందుకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తోన్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రోడ్ల అభివృద్ధి పనులు నిర్దేశిత సమయంలోగా పూర్తిచేయాలి

**జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షత జరిగిన స్థాయిసంఘ సమావేశంలో ఏలూరు ఎంపి పుట్టా మహేష్ కుమార్**



ఏలూరు (చైతన్యరథం): జిల్లాలో రూ.97 కోట్లతో చేపట్టిన ఆర్అండ్‌బి రహదారులు అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లాప్రజా పరిషత్‌లో చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగిన స్థాయి సంఘ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి పుట్టామహేష్ కుమార్ మాట్లాడుతూ... గుంతలరహిత ఏలూరు జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కోరారు. జిల్లాలో కీలకమైన ఏలూరు, జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారులతోపాటు మరికొన్ని రహదారుల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అన్నారు. జిల్లాలో కైకలూరు, ఉంగుటూరు, పోలవరం, దెందులూరు, చింతలపూడి నియోజకవర్గాల పరిధిలో 13 రహదారుల మరమ్మత్తులు చేపట్టినట్లు చెప్పారు. కొద్దిపాటి వర్షాలకే బురదబారినపడి ప్రయాణికులు గత 5 సంవత్సరాల్లో ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. వాటిని అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం రోడ్ల మరమ్మత్తులకు జిల్లాకు రూ. 97 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టిందన్నారు. ఆపనులు పూర్తి నాణ్యతతో నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. సంక్రాంతి నాటికి గుంతలు రహిత ఏలూరు జిల్లాగా రూపుదిద్దుకోవాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రతిఒక్కరికి అందించే దిశగా అధికారులు కృషిచేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ గోపిమూర్తి, ప్రభుత్వ విప్ తాడేపల్లిగూడెం శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాసరావు, ఏలూరు శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి), ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు, నర్సాపురం శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్, జెడ్పి సిఇఒ కె. సుబ్బారావు, పలువురు జెడ్పిటిసి సభ్యులు పాల్గొన్నారు.

# 10న పిఠాపురంలో ఉపముఖ్యమంత్రి పర్యటన... ఏర్పాట్లు పరిశీలన



పిఠాపురం (చైతన్యరథం): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే పవన్‌కళ్యాణ్ ఈ నెల 10న పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. పిఠాపురం లేదా గొల్లప్రోలులో జరిగే సభలో పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. పిఠాపురం మండలం మల్లాంలోని గోకులం, విరవాడ, చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆవరణలను, పిఠాపురం ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని కలెక్టరు పరిశీలించారు. ప్రారంభోత్సవాల అనంతరం పిఠాపురం ప్రభుత్వాసుపత్రిని సందర్శించే అవకాశం ఉంది. సభ ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై కలెక్టర్ తుది నిర్ణయం తీసుకుంటారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ సూర్యప్రకాశరావు, పిఠాపురం మున్సిపల్ కమిషనరు కనకారావు ఉన్నారు.

డిప్యూటీ సీఎం పవన్ పర్యటనకు ఏర్పాట్లు చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వ హించారు. డిప్యూటీ సీఎం ఈనెల 10న పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తారన్నారు. పిఠాపురం మున్సిపల్ హైస్కూల్‌లో జరిగే సభా కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు : ఎంపీ ఉదయశ్రీనివాస్



కాకినాడ (చైతన్యరథం): రాబోయే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా తీసుకునే ముందస్తు చర్యల గురించి చర్చించేందుకు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పండుగ నేపథ్యంలో శాంతిభద్రతలను పరిరక్షించడంతోపాటు రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. ముఖ్యంగా విస్తరణ పనులు చేపడుతున్న సామర్లకోట కాకినాడ ఏడీబీ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు రాత్రి సమయాల్లో లైటింగ్ లేని ప్రదేశాల్లో తాత్కాలిక ఏర్పాట్లు చేయాల న్నారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా చేయాలని ఎంపీ కోరారు.

# గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ శంకుస్థాపన సభకు పాల్గొన్న సత్యానందరావు

విశాఖపట్నం (చైతన్యరథం): భారత ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ఎలమంచిలి నియోజకవర్గ పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ శంకుస్థాపన సభలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, సుందరపు సతీష్ కుమార్, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, రాష్ట్ర కార్యదర్శులు రాజాన రమేష్ కుమార్, ధూళి రంగనాయకులు, సలాది నాగేశ్వరరావు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని, రాబోయే రోజుల్లో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. వైసీపీ పాలనలో రాష్ట్రం పూర్తిగా సర్వనాశనమైందన్నారు.



# పేదల పాలిట సీఎంఆర్ఎఫ్ ఒకవరం : బొండా ఉమామహేశ్వరరావు



విజయవాడ (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు అత్యవసర సమయాల్లో ఆసరాగా నిలుస్తోందని బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. అనారోగ్య పరిస్థితుల వల్ల ఆర్థికపరమైన కష్టాలు ఎదుర్కొంటున్న వారు వారి సమస్యలు మా దృష్టికి తీసుకుని రాగ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థికంగా వారికీ సహాయం అందిస్తున్నామని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉండి వైద్యం చేయించుకోలేని వారికి చేయూతనిస్తూ వైద్య ఖర్చులు భారమై ఆర్థిక సమస్యలతో సతమతవుతున్న అభాగ్యుల జీవితాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి వెలుగులు నింపుతుందని తెలిపారు. ఈ మేరకు బుధవారం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్‌లు అందజేశారు. అనంతరం బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేద ప్రజలకు మేలు చేసే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, ముఖ్యమంత్రి మన చంద్రన్న అడిగిన వెంటనే అపన్న హస్తం అందేలా చర్యలు తీసుకుంటున్నారని, ఆర్థిక స్తోమత లేని అనేక మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని, లబ్ధిదారులందరూ కూటమి ప్రభుత్వం చేసిన సహాయాన్ని గుర్తించాలని, కష్టాలలో మనకి తోడుగా ఉన్న వారిని మర్చిపోకూడదు అని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎంతోమందికి సహాయం అందుతుందన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని, ముఖ్యమంత్రి సహాయ నిధి అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి, బొండా ఉమాకి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సింగం వెంకన్న, ఘంటా కృష్ణమోహన్, కొమ్మినేని సురేష్, గార్లపాటి విజయ్ కుమార్,మద్దాల సత్య తదితరులు పాల్గొన్నారు.

జోన్ - 3
(మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)
చైతన్యరథం

# అభివృద్ధికి అమడ దూరంగా వైసీపీ ఐదేళ్ల పాలన

- కోట్లాది రూపాయాలతో అభివృద్ధి పనులకు గళ్ళా మాధవి శ్రీకారం



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గంలో నిర్లక్ష్యానికి గురైన డివిజన్లలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభివృద్ధి బాటలు వేస్తున్నారు. అభివృద్ధికి నోచుకోని శివారు ప్రాంతాలపై దృష్టి పెట్టి కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి శ్రీకారం చుట్టారు. బుధవారం 21వ డివిజన్‌లో రూ.1 కోటి 91 లక్షల 40వేల రూపాయల భారీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... గుంటూరు పశ్చిమ నియోజకవర్గములో భారీ నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయటం ఆనందంగా ఉందని, తొలి నుండి అభివృద్ధికి నోచుకోని శివారు ప్రాంతాల పై దృష్టి పెట్టానని, ఇందులో భాగంగానే నిత్యం అభివృద్ధి పనులపై సమీక్షలు చేసి, పనులు ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఎన్నికల ప్రచార సమయంలో తాను ఈ డివిజన్‌లోకి వచ్చినప్పుడు కనీసం సరైన రోడ్లు లేవని, పారిశుధ్యం పడకవేసిందని, దీని వలన తాము తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారని, గెలిచిన అనంతరం క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించానన్నారు. ఈ డివిజన్‌లో మెగా శానిటరీ డ్రైవ్ నిర్వహించానని, నిత్యం డ్రైనేజీ తొలగింపు జరుగుతున్నాయన్నారు. డివిజన్‌లో మంచినీటి సమస్యను కూడా పరిష్కారించామన్నారు. గత సంవత్సరం ఆగస్టు నెలలో కోదండ రామయ్యనగర్ 2,3 లైన్లలో 80 లక్షలతో 600 మీటర్ల సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. 21వ డివిజన్‌ను ఆదర్శవంతమైన డివిజన్ గా తయారు చేస్తానన్న మాటకు కట్టుబడి, మొత్తం 2కోట్ల 71లక్షల 40వేలతో అభివృద్ధి పనులు చేస్తున్నామని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గములో ఎక్కడా కూడా రోడ్ల, డ్రైన్ల సమస్యలు లేకుండా, నియోజకవర్గం మొత్తం అభివృద్ధి చేస్తాం.

# సమస్యలు లేని అంగన్వాడీ సెంటర్లను తీర్చిదిద్దుతాం



జగ్గయ్యపేట (చైతన్యరథం): సమస్యలు లేని అంగన్వాడీ సెంటర్లను తీర్చిదిద్దుతామని టీడీపీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య వెల్లడించారు. బుధవారం మండలం చిల్లకల్లు గ్రామంలో చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీస్ నందు సిడిపిఓ లక్ష్మీ భార్గవి ఆధ్వర్యంలో ప్రాజెక్టు మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు, మరియు అంగన్వాడీ ఆయాలకు సంక్షేమ పథకాలన్నీ వర్తించేటట్లు ప్రభుత్వ దృష్టికి తీసుకునివెళ్తానని చెప్పారు. అలాగే అంగన్వాడీ కేంద్రంలో తాగునీటి వసతి, కాంపౌండ్ వాల్స్ మరియు మౌలిక సౌకర్యాలు అందరికీ వర్తించేటట్లు, స్థలాలు లేని అంగన్వాడీ సెంటర్‌లుగా చూస్తానని హామీ ఇచ్చారు. స్థలాలు లేని అంగన్వాడీ కేంద్రాలకు స్థలాలు ఇప్పించుటకు... కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి కృషి చేస్తానని ఇవన్నీ కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంట్ తరఫున సరఫరా చేసిన ఫస్ట్ ఎయిడ్ కిట్, అలానే పిపి1,పిపి 2 పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించిన పుస్తకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అంగన్వాడీ కార్యకర్తలకు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగునాడు ట్రేడ్ యూనియన్ గౌరవాధ్యక్షురాలు ఆచంట సునీత హాజరై అంగన్వాడీలకు అందవలసిన సంక్షేమ పథకాలు గురించి ఇంకా ఇతర సౌకర్యాలు గురించి 17వ తారీకు జరిగే క్యాబినెట్లో చర్చించి అన్ని ఆమోదం అయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం జగ్గయ్యపేట మండల అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, మరియు నాగమణి, సూపర్వైజర్లు మరియు అంగన్వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

# స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా వడివడిగా రాష్ట్రం

- రెండు లక్షల కోట్లతో ఏపీలో అభివృద్ధి పనులకు ప్రధాని మోడీ శ్రీకారం
- హర్షం వ్యక్తం చేసిన టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామమోహన్



విజయవాడ (చైతన్యరథం): ప్రధాన మంత్రి నరేంద్రమోడి అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.30వేల కోట్లు, విశాఖ పర్యటనలో భాగంగా రూ.2.00 లక్షల కోట్లతో వివిధఅభివృద్ధి పనులు ప్రారంభించడంతో మన రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్ వైపు వడివడిగా అడుగులు వేస్తోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పేర్కొన్నారు. మార్చిలో జరగనున్న బడ్జెట్‌లో మన రాష్ట్రానికి ప్రత్యేకంగా మరిన్ని నిధులు మంజూరు చేస్తారని తెలిపారు. బుధవారం ఉదయం 14వ డివిజన్ ఎన్.ఎస్.ఎం. స్కూల్ పక్కన ఆయిల్‌మిల్లు రోడ్డులో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అక్కడి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వయం ఉపాధి నిమిత్తం రూ.25 వేలు విలువ చేసే బడ్డీ కొట్టును మట్ట వెంకటలక్ష్మికి, రూ.15 వేలు విలువ చేసే తోపుడు బండిని పెద్ది చిన్నమ్మకు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... మన రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్ వైపునకు వడివడిగా అడుగులు వేయడం సంతోషంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హాయంలో మన రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో పూర్తిగా వెనుకబడ్డాయని, వైసీపీ హాయంలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ చీకటిమయంగా మారిందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వికృతంగా ప్రవర్తించిన వైసీపీకి మొన్నటి ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల వ్యవధిలోనే ప్రధానమంత్రి నరేంద్రమోడి రాష్ట్రానికి వచ్చి సుమారు రూ.2 లక్షల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నాడంటే, మిగిలిన నాలుగున్నర సంవత్సరాల్లో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చునని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనించేలా చేస్తూ సంక్షేమాన్ని అందచేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి మన రాష్ట్ర ప్రజలందరూ అండగా ఉండాలని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కోరారు. ఈ కార్యక్రమములో డివిజన్ పార్టీ అధ్యక్షుడు నర్రా కిషోర్, గరికపాటి శ్రీనివాసరావు, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, కర్ణ కోటేశ్వరరావు, రాధా, రూప, ఆర్.యల్లబాబు, జనసేన నాయకులు ఎడ్లపల్లి శివ నాగరాజు, శశి, చిట్టిబొమ్మ గణేష్, మెర్ల గోవర్ధన్‌రెడ్డి, షేక్ ఫాతిమా, షేక్ నాజర్‌వలి, కొండలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీల అమలు దిశగా కూటమి ప్రభుత్వం

- ఆరు నెలల్లోనే అభివృద్ధి వైపు అడుగులు : ఎం.ధారునాయక్



విజయవాడ (చైతన్యరథం): ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని వరుసగా అమలు చేస్తున్న ఎన్డీయే ప్రభుత్వం త్వరలోనే మరో రెండు పథకాల్ని త్వరలోనే అమలు చేయబోతుందని టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షులు ఎం.ధారునాయక్ వ్యాఖ్యానించారు. వచ్చే విద్యా సంవత్సరం మొదలయ్యే (జూన్)లోగా తల్లికి వందనం ఆమలు చేయనుందని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ప్రతి ఇంట్లో పాఠశాలలకు వెళ్లే పిల్లలు ఎంత మంది ఉంటే అందరికీ పథకాన్ని వర్తింపజేయనున్నారు. ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున ఇవ్వడం జరుగుతుందన్నారు. మరోవైపు రైతులకు ఏడాదికి రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందజేసే 'అన్నదాత సుఖీభవ పథకాన్ని... కేంద్ర ప్రభుత్వం పీఎం పిఎం కిసాన్ పథకం విడుదల సమయంలో కూటమి ప్రభుత్వం అమలు చేయనుందన్నారు. పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.6వేలు ఇస్తున్న కేంద్రం ఇకపై రూ.10వేలకు పెంచడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం రూ.10 వేలు కలిపి మొత్తం రూ.20 వేలు రైతులకు అందజేస్తామన్నారు. పీఎం కిసాన్ నిధుల్ని కేంద్ర ప్రభుత్వం మూడు విడతలుగా విడుదల చేస్తుంది. కేంద్రం ఒక్కో విడతలో ఎంత మొత్తం విడుదల చేస్తే రాష్ట్ర ప్రభుత్వం కూడా అంతే మొత్తం ఇవ్వనుందని ధారునాయక్ తెలిపారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో గతంలో ఇస్తున్న రూ.10 వేల సహాయాన్ని రూ.20 వేలకు పెంచుతామన్న హామీని ఏప్రిల్ లో అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సన్నహాలు చేస్తుందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే 199అన్న క్యాంటీన్లను ప్రారంభించడంతో పాటు, దీపం పథకం ద్వారా ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామని, సామాజిక పెన్షన్లు పెంపు రూ.4వేలకు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. దీంతో పాటుగా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించి రాష్ట్రవ్యాప్తంగా గుంతల రోడ్లను తొలగించేందుకు వేల కోట్ల రూపాయాలు ఖర్చు చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వంపై పసలేని ఆరోపణలు చేస్తూ వైసీపీ ప్రజల్లో రోజురోజుకు అభాసుపాలౌతుందని ధారునాయక్ వెల్లడించారు.

# మత్స్యకారుల జీవనోపాధికి ప్రభుత్వం చర్యలు



ఇబ్రహీంపట్నం (చైతన్యరథం): మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి కోసం కృష్ణానదిలో భారీసంఖ్యలో చేప పిల్లల్ని విడుదల చేస్తున్నట్లు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద ఆయన బుధవారం గంగపుత్రులతో కలసి చేపపిల్లలను కృష్ణానదిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ... కృష్ణానదిలో మత్స్యసంపదను పుష్కలంగా పెంపొందించే క్రమంలో ప్రతి ఏడాది మత్స్యశాఖ ద్వారా చేపపిల్లలను విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. మత్స్యకారులు ఆర్థికంగా ముందడుగు వేసేలా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. కృష్ణానది చేపలు అంటే ప్రజలు ఎక్కువ మక్కువ చూపుతారన్నారు. ఈ చేపల ఉత్పత్తి స్థానికంగా చేపల వినియోగాన్ని పెంచుతుందన్నారు. ఎక్కువ పోషక విలువలు కలిగిన చేపలు ఆహారంగా లభిస్తుందన్నారు. తాజాగా 7.5 లక్షల చేపపిల్లలను కృష్ణానదిలో విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. 7.5 లక్షల చేప పిల్లలలో సుమారు 70 శాతం బ్రతుకుతాయని, 70 శాతం బ్రతికితే 5.25 లక్షల చేప పిల్లలు '7' నెలలలో 5.25 లక్షల కేజీలుగా ఎదుగుతాయన్నారు. దీని ద్వారా ఒక కేజీ చేప రూ.100కు అమ్మితే రూ.5.25 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. తద్వారా మత్స్యకార రంగంపై, చేపల వేటపై ఆధారపడిన సుమారు 5 వేల మత్స్యకారులకు జీవనోపాధి లభిస్తుందన్నారు. ఇబ్రహీంపట్నం ఫెర్రి వద్ద ఫిష్ మార్కెట్ నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. పవిత్ర సంగమం పూర్వవైభవానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కొండపల్లి మున్సిపాలిటీకి కూడా త్వరలో పాలకవర్గం ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కొండపల్లి మున్సిపాలిటీలో ఉన్న సమస్యలను కూడా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. వైసీపీకి సభ్యత్వమే లేనప్పుడు ప్రత్యేకంగా రాజీనామాలు సమర్పించాల్సిన అవసరం లేదని మీడియా సోదరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఎన్డీయే కూటమి పాలన నచ్చి వైసీపీకి రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించి, వారంతా టీడీపీలో చేరినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వేతో భూమి రికార్డులు అస్తవ్యస్తం

**◆ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అసహనం**

**◆కాకాణి కాలువ పనుల్లో రూ. 30 కోట్లు కొట్టేశాడు**

పొదలకూరు, (చైతన్యరథం): ఏ ఊరికి వెళ్లినా భూసమస్యలపైనే ఫిర్యాదులు వస్తున్నాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. మాజీమంత్రి కాకాణి హయాంలో ఇరిగేషన్ పనుల పేరుతో ఐదు ప్యాకేజీల్లో రూ.30 కోట్లు స్వాహా చేశారని ఆరోపించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.10.75 కోట్లతో 130కి పైగా పనులు చేయించామన్నారు. ఐదేళ్ల తర్వాత రైతుల భాగస్వామ్యంతో కాలువలు బాగుపడటంతో జీర్ణించుకోలేక కుట్రలు, కుతంత్రాల్లో చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. అన్నదాతలకు మేలు జరిగితే ఓర్వలేకపోతున్న కాకాణిది ఏం రక్తమో అర్థం కావడం లేదన్నారు. బుధవారం పొదలకూరులో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో రీసర్వే



పేరుతో తాతముత్తాల నాటి ప్రజల ఆస్తుల రికార్డులను అస్తవ్యస్తం చేసేశారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని సరిదిద్ది బాధితులకు సాయంచేయడానికి ఎన్ని సదస్సులు పెట్టినా సమస్యలు వస్తూనే ఉన్నాయన్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి కనుసన్నల్లో తహసీల్దార్లుగా స్వాతి, వీరవసంతరావులు అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆ ఇద్దరు అధికారుల అవినీతి, అక్రమాల కారణంగా అనేక మంది రైతులు బలయ్యారన్నారు. సూరాయపాళెంలో 36 ఎకరాల మేత పొరంబోకు భూములను పెద్దరెడ్లకు అప్పగించారన్నారు. మరుపూరులో ఆదాయపు పన్ను చెల్లించే వారి పేర్లతో సైతం ప్రభుత్వ భూముల్లో దొంగ పట్టాలు సృష్టించారన్నారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో పనులు చేయకుండానే బిల్లులు చేసుకుని కాలువను సర్వనాశనం చేశారన్నారు. ఒక్క 2023 డిసెంబరులో కాలువల్లో నిండా నీళ్లు పారుతున్న సమయంలో ప్యాకేజీల పేరుతో రూ.30 కోట్లు భోంచేశారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి పనిని పారదర్శకంగా చేపట్టామన్నారు. రూ.10.75 కోట్లతో 130కి పైగా పనులను రైతుల భాగస్వామ్యంతో చేసి కాలువలకు కొత్త రూపు తెచ్చామన్నారు. అన్నదాతలకు మేలు జరిగితే ఓర్చుకోలేక కుట్రలకు పాల్పడుతున్న పెద్దమనిషిని సర్వేపల్లి నియోజకవర్గంలోనే చూస్తున్నామన్నారు. జాలి, దయ, మానవత్వం లేని కాకాణి గోవర్ధన్ రెడ్డి మనిషో కాదో అర్థం కావడం లేదన్నారు.

# తిరుమల పారిశుద్ధ్యంపై టీటీడీ దృష్టి

**◆డంప్‌యార్డు శుభ్రతకు ప్రత్యేక ఏర్పాట్లు**

**◆చైర్మన్ ఆర్ నాయుడు వెల్లడి**



తిరుమల (చైతన్యరథం): తిరుమలలోని కాకుమానులోని డంప్‌యార్డును బుధవారం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్, భారత ప్రభుత్వ ప్రస్తుత శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జి సతీష్‌రెడ్డితో కలిసి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని, ఇది తిరుమల పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రమాదకరమని వెంటనే వాటిని తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిరోజూ దాదాపు 50, 60 టన్నుల చెత్త ఇక్కడ పోగుపడుతుందన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు సతీష్ రెడ్డిని డంప్ యార్డ్ సందర్శించాలని కోరామన్నారు. ఆయన సూచనలను, సలహాలు తీసుకుని వెంటనే ఇక్కడ నుంచి డంప్ యార్డ్‌ను తొలిస్తామని బీఆర్ నాయుడు వెల్లడించారు. డాక్టస్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ తిరుమలలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన డంప్‌యార్డును క్లియర్ చేయడానికి టీటీడీ ఛైర్మన్ చూపించిన చొరవ అభినందనీయమన్నారు. ఈ వ్యర్థాలను ఎలా వేరు చేయాలి? వాటిని ఏవిధంగా తరలించాలనే విషయంపై త్వరలోనే తమ సాంకేతిక నిపుణుల బృందం అధ్యయనం చేస్తుందన్నారు. పేరుకుపోయిన చెత్తలో కొంత భాగాన్ని కర్మాగారాలకు పంపించాలని, మరొక భాగాన్ని ఎరువుగా ఉపయోగించాలనే నిర్ణయానికి వచ్చామని చెప్పారు. అంతకుముందే శాంపిల్స్‌ను ల్యాబ్ పరీక్షలకు పంపుతామన్నారు. పరీక్ష ఫలితాల తర్వాత తమ శాస్త్రవేత్తలు ఈ సమస్యను అధిగమించడానికి ఒక నిర్దిష్ట పరిష్కారాన్ని అందించనున్నారని సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, సీఈ సత్యనారాయణ, హెల్త్ ఆఫీసర్ మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

**టీటీడీ సభ్యురాలు పనబాక లక్ష్మి ఆకస్మిక తనిఖీలు**

టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి తిరుమలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శ్రీవారి భక్తులకు వసతి గదులు కేటాయించే సీఆర్‌ఓ కార్యాలయాన్ని సందర్శించారు. కౌంటర్ల వద్ద గదుల కేటాయింపు ప్రక్రియను పరిశీలించారు. సెంట్రల్ రిసెప్షన్ కార్యాలయంలో భక్తులకు గదులు కేటాయింపు ప్రక్రియ వద్ద భక్తుల అభిప్రాయాలను సేకరించారు.

ఈ నెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు శ్రీవారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకునే భాగ్యం లక్షలాది మంది భక్తులకు కలుగుతుందని పనబాక లక్ష్మి తెలిపారు. దీని కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లను చేసిందని పనబాక లక్ష్మి తెలిపారు. దర్శనం టోకెన్లు, టికెట్లు కలిగిన భక్తులకు మాత్రమే క్యూ లైన్లలోకి అనుమతి ఉంటుందని, టోకెన్లు, టికెట్లు లేని భక్తులకు క్యూలైన్‌లో ప్రవేశం ఉండదని ఆమె తెలిపారు.

# ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం అవసరం

**◆రైతులకు యూరియా కొరత రాకుండా చూడండి**

**◆విడవలూరు మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

(చైతన్యరథం): పార్టీలు వేరైనా ప్రజలచే ఎన్నికయిన ప్రజా ప్రతినిధులు ప్రజల కోసం పని చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచించారు. విడవలూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కి స్థానిక అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, తెలుగుదేశం నాయకులు ఘన స్వాగతం పలికారు. వ్యవసాయ, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, రెవెన్యూ, హౌసింగ్ తదితర శాఖల అధికారులు మండల పరిధిలో అమలవుతున్న ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి



వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా చేసే యూరియా పంపిణీలో రైతుల పట్ల ఎటువంటి వివక్షచూపవద్దని వ్యవసాయ అధికారులకు సూచించారు. గ్రామాలలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. రోడ్ల పై గుంతలు పూడ్చడంలో జరుగుతున్న జాప్యం పై పంచాయతి రాజ్, ఆర్ అండ్ బి అధికారులను ప్రశ్నించారు. సకాలంలో రోడ్ల ప్యాచ్ వర్కులు పూర్తి చేసి సంక్రాంతి లోపు రోడ్ల పై గుంతలు పూడ్చాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. మండల పరిధిలో రోడ్ల నిర్మాణానికి 24 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపి వున్నామని నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి పని చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గత ఐదేళ్లలో స్తంభించిన గ్రామాభివృద్ధి ఇప్పుడిప్పుడే గాడిన పడుతుందన్నారు. 15 వ ఆర్థిక సంఘ నిధులతో పాటు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో రోడ్లు, డ్రైన్లు లాంటి మౌలిక సదుపాయాలతో గ్రామాలు అభివృద్ధి పనులు జరుతున్నాయన్నారు. రైతులకు అత్యవసరం అయితే విపిఆర్ ఫౌండేషన్ ద్వారా సాగునీటి కాలువలలో పూడిక తీయాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. అనంతరం వివిధ సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ప్రజలకు సకాలంలో సేవలు అందివ్వని అధికారులను తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఆవుల శ్రీనివాసులు, ఎంపిడిఓ నగేష్ కుమారి, తహసీల్దార్ చంద్రశేఖర్ తో పాటు మండల పరిధిలోని ఎంపిపిలు, సర్పంచ్‌లు అధికారులు పాల్గొన్నారు.



# నెలాఖరుకల్లా గుంతల్లేని రోడ్లు

**◆నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**

నెల్లూరు, (చైతన్యరథం):నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 22వ డివిజన్, బి.వి. నగర్ లో 1 కోటి 20 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ సూర్యతేజ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ ఈ నెలాఖరుకల్లా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రధాన రహదారులను గుంతలు లేని రోడ్లుగా ఉంచాలని పనిచేస్తున్నామన్నారు. రూరల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం పూర్తి సహాయసహకారాలు అందిస్తున్న కమీషనర్ సూర్యతేజకు నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజలపక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలు నివసిస్తున్న చోట రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితో కలసి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని మునిసిపల్ కమీషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. పై కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి కంటే సాయి బాబా, స్థానిక కార్పొరేటర్ మూలే విజయ భాస్కర్ రెడ్డి, టీడీపీ నాయకులు యోగానందం, కోటిరెడ్డి, యానాది రెడ్డి, వెంకట రెడ్డి, సుబ్బ రాజు, ప్రభాకర్ రెడ్డి, నరసింహులు, సురేంద్ర, శ్రీనివాసలు రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, రాజేంద్ర, సాంబశివరావు, వెంకటేశ్వర్లు రెడ్డి, మురళి, బాబ్జి, వెంకటేశ్వర్లు, పరంధామయ్య, మునిలక్ష్మి, శ్రీదేవి, కోమల, స్వప్న,బీజేపీ నాయకులు యరబోలు రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఈనెల 15వ తేదీన సాయంత్రం 4 గంటలకు పొదలకూరు రోడ్డు లేక్ వ్యూ కాలనీ వద్ద తెప్పలు పోటీలు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే చెప్పారు. నెల్లూరు జిల్లా ప్రజలంతా కుటుంబ సమేతంగా వచ్చి కార్యక్రమంలో పాలుపంచు కోవాలని పిలుపునిచ్చారు. మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్న మద్దా బర్నా బాస్‌ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు.

# ఏటి పండుగకు భారీ ఏర్పాట్లు

**◆సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ**

సూళ్లూరుపేట, (చైతన్యరథం): నాయుడుపేట పట్టణంలో ఏటి పండుగలో భాగంగా స్వర్ణముఖి నదీ పరివాహక ప్రాంతాన్ని సూళ్లూరుపేట శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏట ఉత్సవాలు నాయుడుపేట పట్టణంలో ఘనంగా నిర్వహిస్తారని చెప్పారు. ఈసారి కూడా అదే విధంగా ఘనంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, ప్రజలు అవసరాల ఏవైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అదేవిధంగా బ్రిడ్జి మీద నూతనంగా లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. స్వర్ణముఖి నది బోర్డును ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ సంవత్సరం ఏటి పండుగ సంబరాల్లో జనవరి 15,16, 17 తేదీల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ, యువ నాయకుడు నెలవల రాజేష్, పసలు గంగా ప్రసాద్, సూళ్లూరుపేట జనసేన ఇన్చార్జ్ ఉయ్యాల ప్రవీణ్, దార్ల రాజేంద్ర, మొండెం బాబు తదితరులు పాల్గొన్నారు.



# వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే సీఎం చంద్రబాబు ఆశయం

◆వ్యవసాయ సబ్సిడీ పరికరాలను రైతులకు పంపిణీ చేయండి

◆ జడ్పీ స్టాండింగ్ కమిటీలో వ్యవసాయంపై సమీక్షా సమావేశంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

7అనంతపురం (చైతన్యరథం): రాష్ట్రంలో వ్యవసాయాన్ని రైతులకు లాభసాటిగా మార్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక విధానాలతో రైతులకు పంట వ్యయాన్ని తగ్గించి అధిక ఆదాయాన్ని పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సింధూర వ్యవసాయ అధికారులకు సూచించారు. జిల్లా పరిషత్‌లో బుధవారం వ్యవసాయం రంగంపై జిల్లా స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే అధికారులకు ,ప్రజా ప్రతినిధులకు పలు సూచనలు సలహాలు చేశారు. సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి నియోజకవర్గంలో వ్యవసాయ అధికారులు ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో అందజేస్తున్న డ్రిప్పు, స్ప్రింకర్లు , పంట విత్తనాలు, ఎరువులు, ఇతర వాటిపై అవగాహన కల్పించడంలో క్షేత్రస్థాయిలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రైతులకు కనీసం డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను




అందించకపోవడంతో చాలామంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు మాసాలలో పుట్టపర్తి నియోజకవర్గంలో సుమారు 3500 మంది రైతులకు డ్రిప్పు , స్ప్రింకర్లు అందించిన విషయాన్ని ఎమ్మెల్యే సింధూర రెడ్డి కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ఖరీఫ్, రబీ సీజన్లో వేరుశనగ విత్తనకాయలతో పాటు కందులు ,పెసలు, ఉలువలు, శెనగలు, వంటి ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులకు అందించామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయాన్ని రైతులకు పండుగ చేయాలనే ఆలోచనతో పంట పెట్టుబడులు తగ్గించేందుకు డ్రోన్‌తో పంటకు మందు పిచికారి చేసే విధానాన్ని అమలులోకి తెచ్చారని తెలిపారు. భవిష్యత్తులో ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అసెంబ్లీలో కూటమి ప్రభుత్వాన్ని తాను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వ్యవసాయ రంగంలో రైతులకు మేలు జరిగే విధంగా అధిక ఆదాయాన్ని అందించే పంటల సాగుపై రైతులు దృష్టిసారించేలా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు క్షేత్రస్థాయిలో తగిన పరిశోధనలు జరపాలని కోరారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ డ్రోన్ హబ్‌గా మారి వ్యవసాయ రంగంలో నూతన విప్లవాత్మక మార్పులకు నాంది పలకనుందని సూచించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్ రంగాలలో అమలు చేస్తున్న పథకాలు, రైతులకు అందజేస్తున్న సబ్సిడీ , వ్యవసాయ పరికరాలు, ఇతర వివరాలను రైతులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేసేలా ఒక యాప్‌ను తయారుచేయాలని ఎమ్మెల్యే సింధూరరెడ్డి అధికార యంత్రంగానికి సూచించారు. రైతులు నష్టపోకుండా వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి పొలంబడి వంటి కార్యక్రమాల్లో రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వ్యవసాయ స్టాండింగ్ కమిటీ సభ్యులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.





## సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి నీళ్లు విడుదల

శ్రీశైలం (చైతన్యరథం): నియోజకవర్గంలోని సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి బుధవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు రెండో దశ పంప్ హౌస్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మోటార్లను ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. అనంతరం గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నెల రోజుల పాటు రెండు పంపుల్లో రోజుకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామన్నారు. రబీలో సాగుచేసిన పంటలకు సాగునీటికి ఇబ్బంది ఉండదనానరు. రైతులు నిర్భయంగా సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఇది రైతు ప్రభుత్వమని అన్నారు. గత ఐదేళ్లలో సిద్ధాపురం ప్రాజెక్టును వైసీపీ పాలకులు నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. రాబోయే రోజుల్లో పిల్లకాలువలు పూర్తి చేసి మరో తూము ద్వారా వెంకటాపురం, కృష్ణాపురం, ఇండిరేశ్వరం గ్రామాల్లోని మరో ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.




## నిరుపేదలకు ఆసరా సీఎం సహాయ నిధి

◆16 మందికి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాలువ

రాయదుర్గం (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిరుపేదలను ప్రభుత్వం ఆదుకుంటోందని రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు తెలిపారు. రోగాలతో సతమతమవుతూ వైద్యం చేయించుకోటానికి ఇబ్బంది పడుతున్న ఎన్నో కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక చేయుతనిస్తోందని తెలిపారు. రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని 16 కుటుంబాలకు తాజాగా ముఖ్యమంత్రి సహాయనిధి నుండి సుమారు రూ.22.75 లక్షలు మంజూరైంది. ఈ మొత్తాన్ని బుధవారం రాయదుర్గంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.

## గౌడ కులస్తుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి

◆ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్పష్టీకరణ

◆ప్రొద్దుటూరు గౌడ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వరద, సంఘం నాయకులు

ప్రొద్దుటూరు (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా గౌడ, ఈడిగ కులస్తుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కూడా గౌడ సామాజిక వర్గం అందరూ ఒకసారి సమావేశం ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం నుండి రావలసిన సంక్షేమం, అభివృద్ధిపై చర్చించి తన దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని వరద హామీ ఇచ్చారు. ది ప్రొద్దుటూరు గౌడ, ఈడిగ సంక్షేమ సంఘం అధ్యక్షులు దొంత రామయ్య గౌడ్ ఆధ్వర్యంలో 2025 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, బిసి టీడీపీ నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ చేతుల మీదుగా బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ది ప్రొద్దుటూరు గౌడ ఈడిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డితో పాటు చల్లా రాజగోపాల్ యాదవ్‌లను ఘనంగా సత్కరించారు. గత సార్వత్రిక ఎన్నికలలో గౌడ ఈడిగ సామాజిక వర్గమంతా తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం శ్రమించిందని చల్ల రాజగోపాల్ యాదవ్ ఎమ్మెల్యే వరదకు గుర్తు చేశారు. అలాగే గౌడ సంఘం పట్టణ అధ్యక్షులు రామయ్య గౌడ్ ఆధ్వర్యంలో గౌడ సామాజిక వర్గాన్ని ఏకం చేసి టిడిపి గెలుపునకు సహకరించారన్నారు. ఏ చిన్న అవకాశమున్నా గౌడ కార్పొరేషన్‌లో రామయ్య గౌడుకు స్థానం కల్పిస్తే బాగుంటుందని చల్లా రాజగోపాల్ యాదవ్ సూచించారు. గౌడ కుల సంఘం అధ్యక్షులు రామయ్య గౌడ్ మాట్లాడుతూ 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి టిడిపి బీసీ నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ చేతుల మీదుగా ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో గౌడ కుల బాంధవుల సంక్షేమ అభివృద్ధికై సంఘం కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా గౌడ కుల సంఘం ఏకతాటిపై రావడానికి కృషిచేసిన నాయకులకు, సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఆర్ గోపాల్ గౌడ్, బి రాజశేఖర్ గౌడ్, సలహాదారులు జి.వెంకటసుబ్బయ్య గౌడ్, జి రామసుబ్బయ్య గౌడ్, కొర్రపాటి భాస్కర్ గౌడ్, గౌడ సంఘం యూత్ అధ్యక్షులు పి.వి.ఆర్ గౌడ్ , గౌడ సంఘం డైరెక్టర్ పి రమణ గౌడ్, గౌడ సంఘం ఉపాధ్యక్షులు సుమంత్ గౌడ్, కార్యదర్శి రామకృష్ణ, సంఘం నాయకులు భాస్కర్ గౌడ్, దొంత వెంకటసుబ్బయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.






## కాలువ పనులకు ఎమ్మెల్యే శ్రావణిశ్రీ భూమి పూజ

శింగనమల (చైతన్యరథం): నియోజకవర్గంలోని యల్లనూరు మండల కేంద్రంలో రూ.16 లక్షల వ్యయంతో చేపట్టే డ్రైనేజి కాలువ పనులకు బుధవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ భూమిపూజ చేశారు. అలాగే 53 లక్షల రూపాయలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. మండల కేంద్రంలో అనేకచోట్ల అధ్వాన్నంగా ఉన్న డ్రైనేజి వ్యవస్థను గమనించారు. వెంటనే డ్రైనేజీలు శుభ్రం చేయించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.



# రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స

◆ కేంద్ర రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: కేంద్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా బుధవారం ఓ కీలక పథకాన్ని ప్రకటించారు. రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు నగదు రహిత చికిత్సను అందించేందుకు ప్రత్యేక పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడితే చికిత్సకు అయ్యే ఖర్చులో గరిష్ఠంగా రూ.1.50 లక్షలు ఈ పథకం ద్వారా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అయితే ఇది మొదటి ఏడు రోజుల చికిత్సకు అయ్యే బిల్లుకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రమాద ఘటన జరిగిన 24 గంటల్లోగా పోలీసులకు సమాచారాన్ని అందిస్తేనే ఈ స్కీం ద్వారా నగదు రహిత చికిత్సను పొందొచ్చని గడ్కరీ స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్నట్లు చెప్పారు. 2025 మార్చి నాటికి దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా హిట్ అండ్ రన్ కేసుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియాను అందిస్తామని గడ్కరీ తెలిపారు.

పలు రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులతో కేంద్ర మంత్రి గడ్కరీ సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ఢిల్లీలోని భారత్ మండపంలో మీడియాతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. 2024లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.8 లక్షల మంది చనిపోయారని.. అందులో 30 వేల మంది హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లే మరణించినట్లు తెలిపారు. మృతుల్లో 66 శాతం మంది 18 నుంచి 34 ఏళ్ల మధ్య వయస్సుగల వారే ఉండటం బాధాకర విషయమన్నారు. ఇక స్కూళ్లు, కాలేజీల్లో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల తప్పుల వల్ల 10 వేల మంది పిల్లలు చనిపోయారని గడ్కరీ వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులు వాహనాలు నడపడం వల్ల మూడు వేల మంది మరణించినట్లు తెలిపారు.





# మహిళల శరీరంపై వ్యాఖ్యలు చేసినా లైంగిక వేధింపే అవుతుంది

◆కేరళ హైకోర్టు స్పష్టీకరణ

కొచ్చి: మహిళల శరీరం ఆకృతిపై ఎటువంటి వ్యాఖ్యలు చేసినా అది లైంగిక వేధింపు అవుతుందని కేరళ హైకోర్టు పేర్కొన్నది. జస్టిస్ ఏ బదరుద్దీన్ ఈ తీర్పునిచ్చారు. కేరళ విద్యుత్తు శాఖకు చెందిన ఓ మహిళా ఉద్యోగినిపై మరో ఉద్యోగి కామెంట్ చేశారు. దీంతో ఆమె లైంగిక వేధింపుల కేసు నమోదు చేసింది. ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆ ఉద్యోగి కోర్టును ఆశ్రయించాడు. 2013 నుంచి ఆ ఉద్యోగి చాలా అసభ్యకరమైన భాషను వాడారని, 2017లో అభ్యంతరకరమైన మెసేజ్‌లు, వాయిస్ కాల్స్ చేసేవాడని ఆమె ఆరోపించింది. విద్యుత్తు శాఖకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు.

అయితే, ఈ కేసు కొట్టివేయాలంటూ సదరు మాజీ ఉద్యోగి కేరళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆమెకు అందమైన శరీరం ఉందన్న ఉద్దేశంలోనే తాను మాట్లాడానని, దీన్ని లైంగిక వేధింపుల నేరంగా చూడొద్దని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. కానీ, అతడి విజ్ఞప్తిని కోర్టును తోసిపుచ్చింది. మహిళల శరీరాకృతిపై కామెంట్లు చేయడం కూడా వేధింపుల కిందకే వస్తుందని పేర్కొంటూ ఆయన పిటిషన్‌ను తిరస్కరించింది.



# పెరుగుతున్న హెచ్ఎంపీవీ కేసులు

◆అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం

◆రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టుల్లో స్క్రీనింగ్

న్యూఢిల్లీ: దేశంలో హెచ్ఎంపీవీ వైరస్ కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు వైరస్ ఏడుగురికి పాజిటివ్‌గా తేలింది. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాల వద్ద పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది. దేశంలో హెచ్ఎంపీవీ ఇన్ఫెక్షన్ పెరుగుదల నేపథ్యంలో సివిల్ సర్జన్లందరికీ ఒక సలహా జారీ చేసినట్లు హర్యానా ఆరోగ్య మంత్రి ఆర్టీ సింగ్‌రావు తెలిపారు. హర్యానాలో ఇప్పటివరకు ఒక్క హెచ్ఎంపీవీ కేసు నమోదవలేదని.. అయితే, ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు.

హెచ్ఎంపీవీ ముప్పు నేపథ్యంలో ప్రభుత్వాలు నిఘాను పెంచాయి. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలతో పాటు రద్దీగా ఉండే ప్రాంతాల్లో స్క్రీనింగ్ చేస్తున్నారు. దగ్గు, జలుబుతో ఆసుపత్రులకు వచ్చే రోగులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వాటిని స్క్రీనింగ్ చేయడంతో పాటు పలు రాష్ట్రాల్లో రోగులను ఉంచేందుకు ఐసోలేషన్ వార్డులను సైతం సిద్ధం చేస్తున్నారు. హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ శ్వాసకోశ వ్యవస్థలో సమస్యలను కలిగిస్తుంది. రోగనిరోధక వ్యవస్థ బలంగా లేని వ్యక్తులకు ప్రమాదకరం. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల్లో ఎక్కువగా వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంది.

# ఆ పేరుకు కళంకం తేవడం ఇష్టం లేదు

◆తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ వివరణ



చెన్నై: అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడి జరిగిన ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం అసెంబ్లీ వేదికగా స్పందించారు. ఈ అంశాన్ని అడ్డం పెట్టుకుని కొందరు సభ్యులు మాటిమాటికి అన్నా యూనివర్సిటీ పేరు ప్రస్తావించడాన్ని ఆయన తప్పుపట్టారు. యూనివర్సిటీలో విద్యార్థినిపై జరిగిన దారుణం ఎవరికీ ఆమోదయోగ్యం కాదని, అది దారుణమని వ్యాఖ్యానించారు.

'సభలో చాలామంది సభ్యులు ఒక యూనివర్సిటీ పేరును ప్రస్తావిస్తూ మాట్లాడుతున్నారు. కానీ నేను ఆ యూనివర్సిటీ పేరును ప్రస్తావించదల్చుకోలేదు. నేను ఆ పేరుకు కళంకం తేవాలనుకోవడం లేదు. ఎందుకంటే ఈ సభలో ఉన్నవారిలో చాలామందిని తయారుచేసింది ఆయనే. ఆ భావోద్వేగంతో నేను ఆ పేరును పక్కన పెడుతున్నా. చెన్నైలో విద్యార్థినిపై జరిగిన ఘటనను ఎవరూ ఆమోదించరు. విద్యార్థినిపై లైంగిక దాడి బాధాకరమైన చర్య' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

'సభలోని సభ్యులంతా లైంగిక దాడి ఘటనపై మాట్లాడారు. ఒక్కరు తప్ప మిగతా అందరూ నిజమైన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని చెడుగా చూపించడమే ఆ ఒక్క సభ్యుడి పని. కానీ నేను ఒక్కటే చెబుతున్నా. మా ప్రభుత్వం బాధితురాలికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటుంది. నేరం జరిగిన తర్వాత నిందితుడిని అరెస్ట్ చేయకపోయినా, అతడిని కాపాడే ప్రయత్నాలు జరిగినా ప్రభుత్వాన్ని నిందించవచ్చు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసినా, వేగంగా విచారణ చేయిస్తున్నా ప్రభుత్వాన్ని నిందించడమనేది రాజకీయ ప్రయోజనాల కోసమే' అని స్టాలిన్ ఆరోపించారు.

అన్నా యూనివర్సిటీలో ఇటీవల 19 ఏళ్ల విద్యార్థినిపై గణశేఖరన్ అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు క్యాంపస్ భవనం వెనకాల తన స్నేహితుడితో మాట్లాడుతుండగా నిందితుడు చూశాడు. ఆమె స్నేహితుడిని బెదిరించి వెళ్లగొట్టి ఆమెపై లైంగిక దాడి చేశాడు. ఘటనపై విద్యార్థిని తన స్నేహితునితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు వచ్చింది. ఈ ఘటన తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది.

# జాతరలో ఏనుగు బీభత్సం: 17 మందికి గాయాలు



తిరువనంతపురం: కేరళ రాష్ట్రంలో నిర్వహించిన ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. ఉత్సవాల కోసం తీసుకొచ్చిన ఏనుగుల్లో ఒకటి జనాలపైకి దూసుకెళ్లి బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో 17 మంది గాయపడ్డారు. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది.

వివరాల్లోకి వెళితే.. మలప్పురంలోని బీపీ అంగడి వద్ద మంగళవారం రాత్రి వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఏనుగులను తీసుకొచ్చారు. ఉత్సవాలు జరుగుతుండగా.. ఉన్నట్టుండి ఓ ఏనుగు బీభత్సం సృష్టించింది. పెద్ద పెద్దగా శబ్దాలు చేస్తూ.. జనాల్లోకి దూసుకెళ్లింది. ఓ వ్యక్తిని తొండంతో ఎత్తి పక్కకు పడేసింది. ఈ ఘటనలో సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది. ప్రస్తుతం అతడికి కొట్టకల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

కాగా, ఏనుగు ఒక్కసారిగా బీభత్సం సృష్టించడంతో జాతరకు వచ్చిన ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఏనుగు దాడి నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీశారు. ఈ క్రమంలో అక్కడ తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో సుమారు 17 మందికిపైగా గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే అక్కడకు చేరుకొని ఏనుగును బంధించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు.

# లొంగిపోయిన మావోయిస్టులకు సన్మానం చేయడమేమిటి..?

◆సీఎం సిద్ధరామయ్యపై బీజేపీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆగ్రహం

బెంగళూరు: లొంగిపోయిన మావోయిస్టులకు సన్మానం చేయడంతోపాటు పునరావాసం ప్యాకేజీ ఇస్తామన్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై బీజేపీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మండిపడ్డారు. వారితో ఆయనకు సంబంధాలున్నాయా? అని ప్రశ్నించారు.



అడవుల్లో ఉండే నక్సల్స్‌ను అర్బన్ నక్సల్స్‌గా మార్చుతున్నారని ఆరోపించారు. మావోయిస్టులు ఆయుధాలు వీడి ప్రజాస్వామ్య స్రవంతిలో చేరాలని సీఎం సిద్ధరామయ్య ఇటీవల విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఆరుగురు మావోయిస్టులు అయిన ముండగారు లత, సుందరి కుత్లూర్, వనజాక్షి బాలెహొలె, మారెప్ప అరోలి (కర్ణాటక), కే వసంత్ (తమిళనాడు), జీషా (కేరళ) బుధవారం సిద్ధరామయ్య ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టులను సత్కరించడంతో పాటు వారికి పునరావాస ప్యాకేజీ అందజేస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

ఇదిలావుండగా కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంపై బీజేపీ ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్ మండిపడ్డారు. ప్రభుత్వ పునరావాస విధానాన్ని ఆయన విమర్శించారు. 'సిద్ధరామయ్య మావోయిస్టులతో సన్నిహితంగా ఉన్నారా? అని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి వామపక్ష తీవ్రవాదంపై పోరాడుతున్న యాంటీ నక్సల్ ఫోర్స్‌ను నిరుత్సాహపరిచేలా ప్రభుత్వ ప్యాకేజీ ఉందని ఆరోపించారు. 'ఇది సరెండర్ ప్యాకేజీ కాదు. అర్బన్ నక్సల్స్ సంఖ్యను పెంచే ప్రమాదకర చర్య' అని మండిపడ్డారు.

# బీజేపీ మీ మిత్రపక్షమా?

◆రాజస్థాన్ మాజీ సీఎం గెహ్లాట్‌పై కేజ్రీవాల్ ఆగ్రహం

న్యూఢిల్లీ: 'ఇండియా' కూటమిలో విబేధాలు తీవ్ర స్థాయికి చేరాయి. మిత్రపక్షంగా ఉంటూ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికి వారే యమునాతీరే అన్నట్టుగా విడివిడిగా పోటీ చేస్తున్న ఆప్, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం తీవ్ర స్థాయికి చేరింది. ఢిల్లీలో 'ఆప్' తమకు విపక్షమని బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ వ్యాఖ్యానించడంపై ఆప్ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చురకలు వేశారు. 'ఆప్'కు వ్యతిరేకంగా భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ కలిసికట్టుగా పనిచేస్తున్నట్టు ప్రజలు అనుకుంటున్నారని అన్నారు.

"గెహ్లాట్ జీ... ఢిల్లీలో కాంగ్రెస్‌కు ప్రత్యర్థి 'ఆప్' అంటూ మీరు చెప్పారు. బీజేపీ ప్రస్తావన లేదు. దీంతో ప్రజలు కూడా కాంగ్రెస్‌కు ఆప్ ప్రత్యర్థి అని, బీజేపీకి భాగస్వామి అని అనుకుంటున్నారు. ఆప్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయని కూడా ప్రజలు నమ్ముతున్నారు. ఇప్పటి వరకూ మీ రెండు పార్టీల మధ్య సహకారం రహస్యంగా ఉంది. ఈరోజు మీరు ఆ విషయాన్ని బహిరంగంగానే చెప్పారు. మీ వివరణకు ఢిల్లీ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను" అని కేజ్రీవాల్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు.

# అమెరికాలో కెనడా విలీనమయ్యే ప్రసక్తే లేదు

◆ట్రంప్ ప్రతిపాదనపై

## ఘాటుగా స్పందించిన ట్రూడో

కెనడాను 51వ రాష్ట్రంగా చేయాలనే డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదనపై జస్టిన్ ట్రూడో తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ట్రంప్ సూచనను ట్రూడో తిరస్కరించారు. యూఎస్‌లో కెనడా విలీనమయ్యే అవకాశమే లేదని స్పష్టం చేశారు. ఇది అసాధ్యమని ఉద్ఘాటించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. 'కెనడా యునైటెడ్ స్టేట్స్‌లో భాగమయ్యే అవకాశమే లేదు. అమెరికా, కెనడా రెండు దేశాల్లోని ప్రజలు, కార్మికులు వాణిజ్యం, సెక్యూరిటీ భాగస్వామ్యం ద్వారా లబ్ధి పొందుతున్నారు' అని ట్రూడో తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఇదిలావుండగా అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన ట్రంప్ తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మొదటిరోజే కెనడా, మెక్సికో, చైనా వస్తువులపై భారీ సుంకాలు విధిస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికాలోకి అక్రమ వలసలు, మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ నివారణకు ఇవి సహాయపడతాయని ఆయన చెప్పారు. మెక్సికో, కెనడాల నుంచి వచ్చే ప్రతి



వస్తువుపై 25 శాతం సుంకం విధించే ఉత్తర్వులపై జనవరి 20న సంతకం చేస్తానని ట్రంప్ చెప్పారు. ఫెంటానిల్ స్మగ్లింగ్‌ను చైనా అరికట్టే వరకు ఆ దేశం నుంచి వచ్చే వస్తువులపై అదనంగా 10 శాతం సుంకం విధించాలనుకుంటున్నట్లు తెలిపారు.

ఈ ప్రకటన తర్వాత ట్రంప్‌తో కెనడా ప్రధాని ట్రూడో భేటీ అయ్యారు. ఈ భేటీ సందర్భంగా ట్రూడోకు ట్రంప్ కీలక హెచ్చరికలు జారీ చేశారు. వలసలు, డ్రగ్స్ అక్రమ రవాణాలను సరిహద్దుల్లోనే కట్టడి చేయాలని, లేదంటే సుంకాలు పెంచుతామని హెచ్చరించారు. ఇందులో విఫలమైతే అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరాలని సూచించారు. ఈ క్రమంలో 'గవర్నర్ ఆఫ్ కెనడా' అంటూ ట్రూడోపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ఇక ఇంతలో కెనడా పదవి ట్రూడో రాజీనామా చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన ప్రకటన తర్వాత ట్రంప్ మరోసారి కెనడాను 51వ రాష్ట్రంగా చేయాలనే ప్రతిపాదనను పునరుద్ఘాటించారు. అమెరికాలో 51వ రాష్ట్రంగా ఉండటం కెనడాలో చాలా మంది ప్రజలకు ఇష్టమేనని వ్యాఖ్యానించారు. కెనడాకు అధికంగా రాయితీలు ఇచ్చి తమ దేశం ఎక్కువ కాలం నష్టపోవాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయం కెనడా ప్రధాని ట్రూడోకు తెలుసు కాబట్టే రాజీనామా చేశారని వ్యాఖ్యానించారు. అమెరికాలో విలీనమైతే దిగుమతి సుంకాలు ఉండవని, పన్నులు తగ్గుతాయన్నారు. అంతేకాకుండా రష్యా, చైనాలకు చెందిన నౌకల నుంచి ఎలాంటి ముప్పు ఉండదని ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు ట్రంప్ ప్రతిపాదనపై ట్రూడో పైవిధంగా స్పందించారు.

# బందీలను విడుదల చేయకపోతే దాడులే

◆హమాస్‌కు ట్రంప్ హెచ్చరిక



ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలోనే హమాస్‌కు అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సీరియస్ హెచ్చరిక చేశారు. తాను అధ్యక్ష బాధ్యతలు చేపట్టకముందే హమాస్ ఉగ్రవాద సంస్థ చెరలో ఉన్న బందీలను విడిచిపెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తాను అధ్యక్ష బాధ్యతలు చేపట్టేసరికి బందీలు తిరిగి రాకపోతే పశ్చిమాసియాలో ఆకస్మిక దాడులు జరుగుతాయని హెచ్చరించారు.

కాగా, హమాస్‌కు ట్రంప్ ఇలా సీరియస్ వార్నింగ్ ఇవ్వడం ఇదేమీ మొదటిసారి కాదు. గతేడాది డిసెంబర్‌లో కూడా తీవ్రంగా హెచ్చరించారు. తాను అధ్యక్ష బాధ్యతలు చేపట్టకముందే హమాస్ ఉగ్రవాద సంస్థ చెరలో ఉన్న బందీలను విడిచిపెట్టాలని అల్టిమేటం జారీ చేశారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తాను అమెరికా అధ్యక్షుడిగా 2025 జనవరి 20న బాధ్యతలు స్వీకరిస్తానని ట్రంప్ స్పష్టం చేశారు. ఈలోపు బందీలను విడుదల చేయాలని తేల్చి చెప్పారు. లేదంటూ నరకం చూస్తారని, గతంలో ఎన్నడూ చూడని పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించారు.

ఇదిలావుండగా గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో వెయ్యి మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. దాడి అనంతరం దాదాపు 200 మందికిపైగా ప్రజలను హమాస్ బంధించి గాజాలోకి తీసుకెళ్లింది. ఆ తర్వాత తాత్కాలికంగా జరిగిన కాల్పుల విరమణ ఒప్పందం సందర్భంగా కొందరిని విడుదల చేసింది. బందీల్లో కొందరు ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం 51 మంది సజీవంగా ఉన్నారు.



# లాస్ ఏంజిల్స్‌లో కార్చిచ్చు

◆దగ్ధమైన ఇళ్లు, కార్లు

◆30 వేల మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు

కాలిఫోర్నియా: అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో సంభవించిన కార్చిచ్చు భీకరంగా మారింది. గంటల వ్యవధిలోనే ఆ మంటలు శరవేగంగా వ్యాపిస్తున్నాయి. వేలాది హెక్టార్లలో అడవులు అంటుకుంటున్నాయి. దీంతో లాస్ ఏంజిల్స్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. కొన్ని గంటల్లోనే 10 ఎకరాల నుంచి మూడు వేల ఎకరాల వరకు మంటలు వ్యాపించినట్లు అధికారులు చెప్పారు. దాదాపు 30 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని ఆదేశించినట్లు అగ్నిమాపక సిబ్బంది చీఫ్ క్రిస్టిన్ క్రౌలే తెలిపారు. సుమారు 13 వేల భవనాలకు ప్రమాదం ఉన్నట్లు కూడా తెలుస్తోంది. హాలీవుడ్ నటులు ఉండే ప్రాంతాన్ని కూడా ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించారు.

మంగళవారం సాయంత్రం లాస్ ఏంజిల్స్‌లో దావానలం మొదలైంది. గాలి తీక్షణంగా వీయడంతో.. అడవి మంటలు వేగంగా వ్యాపించాయి. కాలిఫోర్నియా రాష్ట్రంలోని లక్షలాది మంది వార్నింగ్ జోన్‌లో ఉన్నట్లు తెలిపారు. తీవ్రమైన రీతిలో కార్చిచ్చు ప్రమాదం ఉన్నట్లు హెచ్చరించారు. లాస్ ఏంజిల్స్ కొండల్లో విస్తరిస్తున్న మంటల్ని అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు.

పసిఫిక్ పాలిసేడ్స్ అనే ప్రాంతంలో సుమారు 12 స్వేర్ కిలోమీటర్ల అడవి కాలిపోయింది. శాంటామోనికా, మాలిబు పట్టణాల మధ్య ఈ ప్రాంతం ఉంది. శక్తివంతమైన గాలులు వీయడం వల్ల కూడా కార్చిచ్చు మరింత ప్రమాదకరంగా మారినట్లు అధికారులు చెబుతున్నారు. లాస్ ఏంజిల్స్ కౌంటీలోని 46 వేల ఇళ్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. అల్టడేనా ప్రాంతంలో సుమారు 200 ఎకరాల్లో అడవికి మంటలు అంటుకున్నాయి. హాలీవుడ్ నటులు యూజీన్ లెవి, జేమ్స్ వుడ్స్‌తో పాటు ఇతర సెలబ్రిటీలు ఇళ్లు వదిలి వెళ్లారు.

# హసీనా వీసా గడువును పొడిగించిన భారత్

అనూహ్యంగా పదవి కోల్పోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై స్వదేశంలో ఎన్నో ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఆమెను తమకు అప్పగించాలని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం ఇప్పటికే న్యూఢిల్లీకి సందేశం పంపింది. తాజాగా ఆమె పాస్‌పోర్టును రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరిణామాల వేళ భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆమె వీసా గడువును పొడిగించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి.

హసీనా మరికొంతకాలం భారత్‌లో ఉండేందుకు వీలుగా ఆమె వీసా గడువును కేంద్రం పొడిగించినట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. స్థానిక ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ద్వారా వచ్చిన అభ్యర్థనను కేంద్రం పరిశీలించిన అనంతరం పొడిగింపుపై నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇదే సమయంలో హసీనాకు శరణార్థిగా ఆశ్రయం కల్పించనున్నారంటూ వస్తున్న వార్తలను సదరు వర్గాలు కొట్టిపారేశాయి.

పదహారేళ్లుగా కొనసాగుతున్న షేక్ హసీనా ప్రభుత్వం గతేడాది ఆగస్టులో జరిగిన ఉద్యమం కారణంగా పతనమైంది. దీంతో



పదవీచ్యుతురాలైన ఆమె.. స్వదేశాన్ని వీడి భారత్‌కు వచ్చి ఓ రహస్య ప్రాంతంలో నివసిస్తున్నారు. ఆ తర్వాత స్వదేశంలో ఆమెపై అనేక కేసులు నమోదయ్యాయి. అరెస్టు వారెంట్లు కూడా జారీ అయ్యాయి. ఈక్రమంలోనే హసీనాను తమకు అప్పగించాలంటూ గత డిసెంబరులో బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం భారత ప్రభుత్వానికి ఒక దౌత్య సందేశం పంపింది. అయితే, "ఈ వ్యవహారంపై తాము వ్యాఖ్యానించాల్సిందేమీ లేదు" అని భారత విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అప్పట్లో ప్రకటించారు. ఈ క్రమంలోనే ఆమె పాస్‌పోర్టును బంగ్లా ప్రభుత్వం మంగళవారం రద్దు చేసింది.

## హష్ మనీ కేసు.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన ట్రంప్

వాషింగ్టన్: హష్ మనీ కేసు విషయమై అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనకు శిక్ష విధిస్తానంటూ న్యూయార్క్ న్యాయమూర్తి జారీ చేసిన ఆదేశాలను అడ్డుకోవాలంటూ అభ్యర్థించారు.

శృంగార తార స్టార్మీ డానియల్స్ ట్రంప్ గతంలో ఏకాంతంగా గడిపారనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో దీనిపై ఆమె నోరు విప్పకుండా ఉండేందుకు ట్రంప్ తన న్యాయవాది ద్వారా ఆమెకు 1.30 లక్షల డాలర్ల హష్‌మనీని ఇచ్చారంటూ ఆరోపణలు వచ్చాయి. ప్రచార కార్యక్రమాల కోసం అందిన విరాళాల నుంచి ఆ మొత్తాన్ని ఖర్చు చేశారని ప్రధాన అభియోగం. అందుకోసం రికార్డులన్నింటినీ తారుమారు చేశారని ఆరోపణలు ఉన్నాయి.

ఈ వ్యవహారంపై ఇటీవల న్యూయార్క్ న్యాయస్థానం విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. ట్రంప్‌నకు జనవరి 10న శిక్ష విధిస్తానని న్యాయమూర్తి జస్టిస్ హవాన్ మర్చన్ ఆదేశాలు జారీ చేశారు. అయితే, ఆయన జైలు శిక్ష అనుభవించాల్సిన అవసరం లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. జరిమానా కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా 'అన్‌కండిషనల్ డిశ్చార్జ్'ని అమలు చేస్తామన్నారు. శిక్ష విధించే రోజు ఆయన వ్యక్తిగతంగా లేదా వర్చువల్‌గా కోర్టులో హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తామని అన్నారు.

అయితే ఈనెల 20న ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతో శిక్ష ఖరారై శ్వేతసౌధంలోకి అడుగు పెట్టే తొలి అధ్యక్షుడిగా ట్రంప్ నిలిచే అవకాశం ఉంది. ఈక్రమంలోనే న్యాయమూర్తి ఆదేశాలను అడ్డుకోవాలంటూ తాజాగా ట్రంప్ అమెరికా సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

# ఐరోపా జోలికొస్తే సహించం

◆ట్రంప్‌నకు ఫ్రాన్స్ హెచ్చరిక

ఐరోపా దేశాల సరిహద్దుల సార్వభౌమత్వాన్ని ఎవరు ఉల్లంఘించినా ఊరుకోమని ఫ్రాన్స్ హెచ్చరించింది. తాజాగా గ్రీన్ ల్యాండ్ విలీనంపై ట్రంప్ వ్యాఖ్యానించడం ఐరోపా సమాఖ్యలో కలకలం సృష్టించింది.

"ప్రపంచంలో ఏ దేశమైనా సరే ఐరోపా సమాఖ్య సరిహద్దులపై దాడి చేస్తే.. చూస్తూ ఊరుకొనే ప్రశ్నే లేదు. మాది బలమైన ఖండం. డెన్మార్క్ దాదాపు 600 ఏళ్ల నాటి నుంచి భాగమైన గ్రీన్ ల్యాండ్‌ను అలానే పనామా కాల్వను అమెరికా ఆక్రమించుకొంటుందంటే నేను నమ్మను. పరిస్థితులకు తగ్గట్లు మార్పులు చేసుకొనే వారు మాత్రమే తట్టుకోగలిగే యుగంలో ఉన్నామా అంటే.. అవును అనే చెబుతాను. ఐరోపా సమాఖ్య అతిగా ఆందోళన చెందడం కానీ బెదరడం కానీ చేయకూడదు. మేల్కొని బలోపేతం కావాలి" అని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జియోన్ నోయల్ బారోట్ పేర్కొన్నారు. ఆయన ఫ్రాన్స్ ఇంటర్ రేడియో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గ్రీన్ ల్యాండ్‌పై సైనిక శక్తి వాడను అని ఎలాంటి హామీ ఇవ్వలేనంటూ డొనాల్డ్ ట్రంప్ తాజాగా చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. ఆయన దాదాపు కొన్నేళ్ల నుంచి గ్రీన్ ల్యాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకోవాలని భావిస్తున్నారు. ఆయన తొలి విడత పాలనలో ఈ దిశగా కొంత ప్రయత్నం చేసినా ఫలితం లభించలేదు.

ఛాంపియన్స్ ట్రోఫీ..

# ఆ ముగ్గురు కీలక ప్లేయర్స్ డౌటే!

మరికొన్ని రోజుల్లో ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పటివరకూ జట్లను ప్రకటించనప్పటికీ, టీమ్‌లోకి ఎవరిని తీసుకుంటారు, ఎవరిని పక్కనపెడతారనే విషయాలపై క్రికెట్ అభిమానుల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది. అయితే ఈ ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో కీలక ప్లేయర్స్ ను పక్కన పెట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రచారం సాగుతోంది. ఇంతకీ వారెవరంటే?

**కోహ్లీ, రోహిత్‌కు లాస్ట్ ఛాన్స్**

ఫిబ్రవరి 19 ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ప్రారంభం కానుంది. అయితే బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో పేలవ ప్రదర్శనతో సిరీస్ కోల్పోవడం, డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరే అవకాశాలు గల్లంతవ్వడంతో, ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్ ఇండియా ఎలా ఆడుతందనే ఆసక్తి అందరిలో నెలకొంది. పైగా సీనియర్లైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆటతీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. వారిని పక్కనపెట్టాలన్న డిమాండ్ కూడా వినిపిస్తోంది. అయినా కూడా విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో చివరి అవకాశం కల్పిస్తారని తెలిసింది.



అయితే ఈ ఛాంపియన్స్ ట్రోఫీ కన్నా ముందు టీమ్ ఇండియా, స్వదేశంలో ఇంగ్లాండ్ తో వన్డే, టీ20 సిరీస్‌లు ఆడనుంది. ఈ సిరీస్ కు కూడా ఇంకా జట్టును ప్రకటించలేదు. అయితే ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ ఆడే భారత జట్టే, ఛాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సమాచారం అందింది.

**వారిని పక్కనపెట్టే అవకాశం**

ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో కేఎల్ రాహుల్ , రవీంద్ర జడేజా, మహ్మద్ షమీలకు స్థానం దక్కకపోవచ్చని కొత్త ప్రచారం మొదలైంది. మోకాలిలో వాపు కారణంగా ఆస్ట్రేలియా సిరీస్‌కు దూరంగా ఉన్న సీనియర్ పేసర్ మహ్మద్ షమీ తిరిగి జట్టులోకి రావాలని గట్టిగానే ప్రయత్నిస్తున్నాడు. కానీ అతడికి అవకాశం ఇవ్వరని తెలుస్తోంది. వైట్ బాల్ ఫార్మాట్‌లో రవీంద్ర జడేజా బ్యాటింగ్ గతంలోలా లేదు. అందుకే అతడి స్థానంలో వన్డేలకు అక్షర్ పటేల్ కు ఛాన్స్ దక్కవచ్చని పలువురు అంటున్నారు. ఇంకా ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో వికెట్ కీపర్ స్థానం కోసం కేఎల్ రాహుల్, పంత్‌ల మధ్య తీవ్ర పోటీ ఉంటుందని తెలిసింది. వీరిలో ఒకరికే అవకాశం దక్కుతుంది.

కాగా, జనవరి 12 లోపు ఛాంపియన్స్ ట్రోఫీ కోసం బీసీసీఐ జట్టును ప్రకటించే అవకాశం ఉంది. ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ మొదలు కానుంది. అంతకుముందు ఇంగ్లాండ్ తో టీమ్‌ఇండియా జనవరి 22 నుంచి ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లో తలపడనుంది.



## హ్యాట్రిక్‌తో చరిత్ర సృష్టించిన శ్రీలంక స్పిన్నర్ తీక్షణ!

శ్రీలంక స్పిన్నర్ మహీశ్ తీక్షణ చరిత్ర సృష్టించాడు. వన్డే క్రికెట్‌లో హ్యాట్రిక్ వికెట్ సాధించిన ఏడో శ్రీలంక బౌలర్‌గా రికార్డ్ సాధించాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం హామిల్టన్ వేదికగా జరిగిన రెండో మ్యాచ్‌లో తీక్షణ ఈ ఫీట్ సాధించాడు. వర్షం అంతరాయం కలిగిన ఈ మ్యాచ్‌లో తీక్షణ రెండు ఓవర్ల సాయంతో హ్యాట్రిక్ వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు.

వరుసగా మూడు బంతుల్లో న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ స్టార్క్, నాథన్ స్మిత్, మ్యాట్ హెన్రీలను ఔట్ చేశాడు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 35వ ఓవర్ చివరి రెండు బంతులకు మిచెల్ సాంట్నర్, నాథన్ స్మిత్‌లను ఔట్ చేసిన తీక్షణ.. 37వ ఓవర్ తొలి బంతికి మ్యాట్ హెన్రీని పెవిలియన్ చేర్చి హ్యాట్రిక్ వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు.

తీక్షణ కంటే ముందు శ్రీలంక తరఫున చమింద వాస్(2001, 2003),లసిత్ మలింగా(2007), ఫర్వేజ్ మహరూఫ్(2007), లసిత్ మలింగా(2011), తిసారా పెరెరా(2012), వానిందు హసరంగా(2017), దుష్మంత్ మధుషంక(2018)లు వన్డే క్రికెట్‌లో హ్యాట్రిక్ సాధించారు.

ఈ మ్యాచ్‌లో మొత్తం 8 ఓవర్లు బౌలింగ్ చేసిన తీక్షణ 44 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. తీక్షణ హ్యాట్రిక్ తీసిన ఈ మ్యాచ్‌లో శ్రీలంకకు పరాజయం తప్పలేదు. 113 పరుగుల భారీ తేడాతో విజయం సాధించిన న్యూజిలాండ్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2–0తో సిరీస్ కైవసం చేసుకుంది.

37 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 9 వికెట్లకు 255 పరుగులు చేసింది. రచిన్ రవీంద్ర(63 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 79), మార్క్ ఛాప్‌మన్(52 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 62) హాఫ్ సెంచరీలతో రాణించారు.

అనంతరం శ్రీలంక 30.2 ఓవర్లలో 142 పరుగులకు ఆలౌటైంది. కామిందు మెండిస్(66 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 64) హాఫ్ సెంచరీతో రాణించాడు.

## ఐసీసీ ర్యాంకింగ్స్.. టాప్-10లోకి రిషభ్ పంత్, బోలాండ్



ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్ రిషబ్ పంత్ తిరిగి టాప్–10లోకి వచ్చాడు. ఆస్ట్రేలియాతో సిడ్నీ టెస్టులో రాణించిన అతను మూడు స్థానాలు మెరుగై 739 రేటింగ్ పాయింట్లతో 9వ స్థానంలో నిలిచాడు. సిడ్నీ టెస్టులో పంత్ తొలి ఇన్నింగ్స్ 40. రెండో ఇన్నింగ్స్ 33 బంతుల్లోనే 61 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇక, ఆస్ట్రేలియా పేసర్ స్కాట్ బోలాండ్ ఏకంగా 29 స్థానాలు ఎగబాకి టాప్–10లోకి దూసుకొచ్చాడు. 745 పాయింట్లతో రవీంద్ర జడేజాతో కలిసి బోలాండ్ 9వ స్థానాన్ని పంచుకున్నాడు. భారత్‌తో జరిగిన చివరి టెస్టులో బోలాండ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

మరోవైపు, జస్‌ప్రీత్ బుమ్రా భారత్ తరపున అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన బౌలర్ గా నిలిచాడు. గత వారం 907 పాయింట్లతో ఉన్న బుమ్రా ఈ వారం ఒక పాయింట్ మెరుగుపర్చుకుని టాప్‌లోనే కొనసాగుతున్నాడు. 2016లో అశ్విన్ 904 రేటింగ్ పాయింట్లు సాధించగా.. బుమ్రా దాన్ని గత వారం అధిగమించిన విషయం సంగతి తెలిసిందే. బ్యాటింగ్ విభాగంలో టాప్–5లో ఎలాంటి మార్పులు లేవు. జో రూట్, హ్యారీ బ్రూక్, కేన్ విలియమ్సన్, యశస్వి జైస్వాల్, ట్రావిస్ హెడ్ వరుసగా మొదటి ఐదు స్థానాల్లో ఉన్నారు. దక్షిణాఫ్రికా కెప్టెన్ తెంబా బావుమా మూడు స్థానాలు మెరుగై ఆరో ర్యాంకులో నిలిచాడు. పాక్ బ్యాటర్ బాబర్ అజామ్ ఐదు స్థానాలు ఎగబాకి 12వ ర్యాంకు అందుకున్నాడు. భారత బ్యాటర్లు శుభ్మన్ గిల్ విరాట్ కోహ్లి మూడేసి స్థానాలు డౌన్ అయి వరుసగా 23వ, 27వ ర్యాంకులకు పరిమితమయ్యారు. ఆసీస్‌తో చివరి టెస్టుకు దూరంగా రోహిత్ శర్మ రెండు స్థానాలు దిగజారి 42వ ర్యాంకులో ఉన్నాడు.

బిజిటి సిరీస్.. పిచ్ రేటింగ్స్ వచ్చేశాయ్

ఇటీవల ముగిసిన బోర్డర్–గావస్కర్ ట్రోఫీ సిరీస్ను ఆస్ట్రేలియా 3–1తో కైవసం చేసుకుంది. పెర్త్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసిన భారత్.. తర్వాత తడబడి సిరీస్‌ను చేజార్చుకుంది. ఈ ఐదు టెస్టులకు సంబంధించిన పిచ్ రేటింగ్స్‌ను ఐసీసీ తాజాగా ప్రకటించింది. పెర్త్, అడిలైడ్ ఓవల్, గబ్బా, మెల్‌బోర్న్ పిచ్‌లకు 'వెరీ గుడ్' అని, సిడ్నీ పిచు 'సంతృప్తికరం' అనే రేటింగ్ ఇచ్చింది. ఇంతకుముందు పిచ్ రేటింగ్ విధానం ఆరు కేటగిరీలుగా ఉండేది. 2023 లో దీన్ని నాలుగుకు (వెరీ గుడ్, సంతృప్తికరం, అసంతృప్తికరం, అన్‌ఫిట్) కుదించారు.

## దిగ్గజ ఫుట్ బాలర్ షాకింగ్ డెసిషన్



### 'నా లాస్ట్ షాట్ అదే'

బ్రెజిల్ ఫుట్ బాల్ స్టార్ నేమార్ షాకింగ్ డెసిషన్ తీసుకున్నాడు. తాను రిటైర్మెంట్ తీసుకోబోతున్నట్లు ప్రకటించాడు. ఫిఫా 2026 వరల్డ్ కప్ తాను ఆడబోయే చివరి టోర్నీ అని అన్నాడు. అలానే దిగ్గజ ఫుట్ బాలర్స్ మెస్సీ, సూరెజ్ తో రీయూనియన్ విషయమై హింట్ ఇచ్చాడు.

నేమార్ కు గాయాలు

79 గోల్స్ తో బ్రెజిల్ ఆల్ టైమ్ టాప్ స్కోరర్ గా నిలిచాడు నేమార్. అయితే 32 ఏళ్ల నేమార్ కెరీర్ లో ఎన్ని ఘనతలు సాధించాడో, అలానే గాయాల బారిన కూడా పడ్డాడు. దీంతో ఈ మధ్య కాలంలో చాలా తక్కువ మ్యాచులలోనే బరిలోకి దిగాడు. 2023లో పారిస్ సెయింట్ జెర్మేన్ నుంచి బయటకొచ్చిన కేవలం ఏడు మ్యాచులలోనే ఆడాడు. సౌదీ ప్రో లీగ్ క్లబ్ వారితో అతడి కాంట్రాక్ట్ 2024 జూన్ తో ముగిసిపోయింది. ఈ క్రమంలోనే ఇప్పుడు నేమార్ తన కెరీర్ భవిష్యత్ ప్రణాళిక గురించి హింట్ ఇచ్చాడు. రిటైర్మెంట్ గురించి కూడా వ్యాఖ్యలు చేసాడు. మేజర్ లీగ్ సాసర్ బరిలో దిగడంతో పాటు మాజీ బార్సిలోనా టీమ్ మేట్స్ లియోనెల్ మెస్సీ, లూయిస్ సూపెజ్ తో రీయూనియన్ అయ్యే అవకాశం ఉందని చెప్పుకొచ్చాడు.

"నేను ఆడేందుకు ప్రయత్నిస్తాను. కచ్చితంగా ఆడుతాను. నా నేషనల్ టీమ్ కోసం, జట్టుతో ఉండేందుకు చేయాల్సినవన్నీ చేస్తాను. ఇక ఇదే నా చివరి వరల్డ్ కప్. నా లాస్ట్ షాట్, నా లాస్ట్ ఛాన్స్ ఇదే. కాబట్టి నేను ఈ ప్రపంచ కప్ లో ఆడేందుకు ఏదైనా చేస్తాను." అని పేర్కొన్నాడు.

మేం ఇప్పటికీ మాట్లాడుకుంటున్నాం

నేమార్ , మెస్సీ, లూయిస్.. గతంలో ఈ త్రయం కలిసి అద్భుత రికార్డులను సాధించారు. వీరి మధ్య మంచి స్నేహబంధం కూడా ఉంది. తాజాగా వారితో రీయూనియన్ గురించి నేమార్ మాట్లాడుతూ... "మెస్సీ, లూయిస్ తో కలిసి మళ్లీ ఆడటం అనేది అసాధరణమైన విషయం. వాళ్లు నా స్నేహితులు. మేం ఇప్పటికీ మాట్లాడుకుంటూనే ఉన్నాం. నేను అల్ హిలాల్, సౌదీ అరేబియాతో హ్యాపీగానే ఉన్నాను. ఫుల్ బాల్ అంటేనే ఎన్నో సర్ ప్రైజెస్." అని చెప్పుకొచ్చాడు. కాగా, బ్రెజిల్ జట్టు ప్రస్తుతం సౌత్ అమెరికన్ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ లో ఐదో స్థానంలో ఉంది.

# హనీరోజ్‌కు వేధింపులు..

## పోలీసుల అదుపులో వ్యాపారవేత్త



సోషల్మీడియా వేదికగా తాను వేధింపులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు మలయాళ నటి హనీరోజ్. ఈమేరకు ఆమె పోలీసులను ఆశ్రయించారు. నటి ఫిర్యాదుతో దాదాపు 27మందిపై ఎర్నాకుళం పోలీసులు కేసు నమోదు చేశారు. కేసులో కీలకమైన వ్యక్తిగా భావించిన ప్రముఖ వ్యాపారవేత్త బాబీ చెమ్మనూరును సిట్ అధికారులు తాజాగా అదుపులోకి తీసుకున్నారు. అతడిపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వయనాడ్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. దీనిపై ఆమె స్పందించారు. "ఇప్పుడు నాకెంతో ప్రశాంతంగా ఉంది. ఈ కేసు విషయం గురించి ఇప్పటికే ముఖ్యమంత్రి పినరయి విజయన్ దృష్టికి తీసుకువెళ్లాను. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని నాకు మాటిచ్చారు" అని తెలిపారు.

'వీరసింహారెడ్డి'తో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు నటి హనీ రోజ్. ఇటీవల ఆమె ఒక వ్యాపారవేత్తవల్ల తాను ఇబ్బంది పడుతున్నానంటూ ప్రకటన విడుదల చేశారు. "ఒక వ్యక్తి కావాలని నన్ను అవమానించడానికి ప్రయత్నిస్తున్నాడు. నేను సైలెంట్‌గా ఉంటుంటే 'ఆ వ్యాఖ్యలను నువ్వు స్వాగతిస్తున్నావా? అని చాలామంది అడుగుతున్నారు. ఆ వ్యక్తి గతంలో కొన్ని కార్యక్రమాలకు నన్ను ఆహ్వానించాడు. వేర్వేరు కారణాలవల్ల వెళ్లేందుకు నిరాకరించాను. అందుకు ప్రతీకారంగా నేను హాజరయ్యే ప్రతీ ఈవెంటుకు రావడం.. వీలు కుదిరినప్పుడల్లా కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ప్రారంభించాడు" అని ఆమె తెలిపారు. దీనిపై తాను పోలీసులను ఆశ్రయించినట్లు చెప్పారు. "వివరణాత్మక విమర్శలు, నా లుక్స్‌పై వేసే సరదా జోక్స్, మీమ్సును నేనూ స్వాగతిస్తా. వాటిని పెద్దగా పట్టించుకోను. కానీ, దానికంటూ ఒక హద్దు ఉంటుందని నమ్ముతున్నా. అసభ్యకరంగా చేసే కామెంట్స్ను ఏమాత్రం సహించను" అని కూడా ఆమె అన్నారు.

# 'ప్రియాంకను ఎమర్జెన్సీ చూడమన్నా'



మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితాన్ని ఆధారంగా చేసుకొని తెరకెక్కిన చిత్రం 'ఎమర్జెన్సీ'. బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ స్వీయదర్శకత్వంలో రూపుదిద్దుకుంది. ఎన్నో అడ్డంకులు ఎదుర్కొని త్వరలో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ఇంటర్వ్యూలో పాల్గొన్న కంగన.. సినిమా గురించి విశేషాలు పంచుకున్నారు. దీనిని వీక్షించమని ఇందిరాగాంధీ మనవరాలు, ఎంపీ ప్రియాంక గాంధీని కోరానన్నారు. "పార్లమెంట్లో ప్రియాంకని కలిసినప్పుడు మా ఎమర్జెన్సీ చిత్రాన్ని తప్పకుండా వీక్షించాలని కోరగా, ప్రయత్నిస్తానని ఆమె బదులిచ్చారు. ఈ సినిమా ఆమెకు తప్పకుండా నచ్చుతుందని తెలియజేశా. ఎమర్జెన్సీ అనేది ఎంతో సున్నితమైన అంశం. ఇందిరాగాంధీ పాత్రను ఎంతో మర్యాదపూర్వకంగా చూపించా. రీసెర్చ్ సమయంలో ఎన్నో విషయాలు గ్రహించా. ఇందిరాగాంధీకి తన భర్త, పిల్లలు, స్నేహితులతో ఉన్న అనుబంధం గురించి తెలుసుకున్నా. శత్రువులతో ఎలా వ్యవహరించేవారో అర్థం చేసుకున్నా. ఆ విషయాలను ఎక్కడా టచ్ చేయకుండా ఉండేందుకు కావాల్సిన జాగ్రత్తలు అన్నీ తీసుకున్నా" అని కంగన తెలిపారు.

సెన్సార్ నిర్ణయాన్ని తాను స్వాగతిస్తున్నట్లు కంగన చెప్పారు. "ఎమర్జెన్సీ నాటి పరిస్థితులను ప్రజల కళ్లకు కట్టినట్లు చూపించాలనే ఉద్దేశంతోనే నేను ఈ చిత్రాన్ని రూపొందించాను. సినిమా ఫుల్వెర్షన్ నాకెంతో నచ్చింది. ఫుల్ వెర్షన్‌ను ప్రేక్షకులకు చూపించాలనుకున్నా. కాకపోతే తాజా పరిణామాల వల్ల సెన్సార్ కట్స్ పడ్డాయి. దానివల్ల ఎలాంటి సమస్య లేదు. ఎందుకంటే, మేము ఎవరినో విమర్శించడానికి ఈ సినిమా చేయలేదు. ఇది అలాంటి సినిమా కాదు. చరిత్రకు సంబంధించిన కొన్ని ఎపిసోడ్సును వాళ్లు పూర్తిగా తొలగించేశారు. నిజం చెప్పాలంటే అది నా సినిమాపై ఎలాంటి ప్రభావాన్ని చూపించదు. కథ, ఇందులోని సందేశం ఎక్కడా చెక్కుచెదరలేదు" అని తెలిపారు.

ఇందులో జయప్రకాశ్ నారాయణ్ పాత్రలో నటించారు అనుపమ్ ఖేర్. తన పాత్ర గురించి ఆయన మాట్లాడుతూ.. కంగన ఎంతో రీసెర్చ్ చేసినట్లు చెప్పారు. "నా పాత్ర గురించి నేను పెద్దగా రీసెర్చ్ చేయలేదు. కంగననే అన్ని విషయాల గురించి పూర్తిస్థాయిలో పరిశోధన చేశారు. రాజకీయ అంశంపై తీసిన అత్యుత్తమ చిత్రాలలో ఇది ఒకటని నమ్ముతున్నా. వివాదాలన్నీ పక్కనపెట్టి ప్రేక్షకులు దీనిని వీక్షించాలని కోరుకుంటున్నా" అని అన్నారు.

## డాకు మహారాజ్...

# ప్రీ ఈవెంట్‌కు అతిథిగా లోకేష్



బాలకృష్ణ 'డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంటుకు ముఖ్యఅతిథిగా మంత్రి లోకేశ్ హాజరుకానున్నారు. ఈవిషయాన్ని తెలుపుతూ చిత్ర బృందం ప్రత్యేక పోస్టరును పంచుకుంది. బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో రానున్న చిత్రమే 'డాకు మహారాజ్. సంక్రాంతి కానుకగా జనవరి 12న రిలీజ్ కానుంది. ఈనేపథ్యంలో కొన్ని రోజులుగా దీని ప్రీరిలీజ్ ఈవెంటుకు అతిథిగా ఎవరు హాజరవుతారనే దానిపై ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ ఈవెంటుకు గెస్ట్ ఏపీ మంత్రి, బాలకృష్ణ అల్లుడు నారా లోకేశ్ వస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. జనవరి 9న ఏపీలోని అనంతపురం వేదికగా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరపనున్నట్లు టీమ్ అధికారికంగా వెల్లడించింది. దీంతో బాలయ్య అభిమానులు సంబరపడుతున్నారు.

మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా 'డాకు మహారాజ్' సిద్ధమైంది. సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. బాలకృష్ణ సరసన శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్, ఊర్వశి రౌటేలా నటించారు. బాబీ దేవోల్, చాందిని చౌదరి ముఖ్య పాత్రలు పోషించారు. ఇప్పటివరకూ చేయని సరికొత్త పాత్రలో బాలకృష్ణను ప్రేక్షకులకు పరిచయం చేయడానికి చిత్రబృందం సిద్ధమైనట్లు ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.

ఈ చిత్రంలో తమన్ మ్యూజిక్ మరో స్థాయిలో ఉంటుందని బాలకృష్ణ తాజాగా మరోసారి వెల్లడించారు. 'ఆదిత్య 369' లోని ఓ పాత్ర ఆధారంగా ఈ కథను రాసినట్లు వెల్లడించారు. ఇది సందేశాత్మక చిత్రమని రానున్న రోజుల్లో పలు సినిమాలకి 'డాకు మహారాజ్ ఓ స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. ఇందులో ఒక్క సన్నివేశంలో కూడా డూపును వాడలేదని బాబీ చెప్పారు.

# అవకాశాలు సృష్టించుకోల్సింది మనమే..

చిత్రపరిశ్రమలో మనకు తెలిసిన వ్యక్తులు చాలా మంది ఉన్నప్పటికీ.. అవకాశాలు వెతుక్కుంటూ రావు. మనమే వాటిని సృష్టించుకోవాలని అంటోంది బాలీవుడ్ అందాల తార కియారా అద్వానీ. ఈనెల 10న 'గేమ్‌ఛేంజర్'తో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించడానికి సన్నద్ధమవు తోందీ భామ. తక్కువ సమయంలోనే అగ్రతారల సరసన నటించే అవకాశాన్ని దక్కించుకున్న ఈమె కెరీర్‌లో కూడా ఎన్నో విమర్శలు, తిరస్కరణలు ఉన్నాయని అంటోంది. ఇటీవల ఓ సందర్భంలో తన కెరీర్ తొలి రోజుల్ని గుర్తు చేసుకుంది కియారా. "చిత్ర పరిశ్రమలో స్థిరపడడం అంత సులభమైన విషయం కాదు. పరిశ్రమలో మనకు తెలిసిన వ్యక్తులు ఎంతోమంది ఉండొచ్చు. కానీ ఆ సంబంధాలు వేరే వాళ్ల గురించితెలుసుకోవడానికి మాత్రమే ఉపయోగపడతాయి. పరిశ్రమలోని ప్రతిభావంతుల్ని కలిసే అవకాశాలను సులభతరం చేస్తాయి. అంతేకానీ అవి మన విజయా నికి మార్గం కాదు. సినిమా ఆఫర్‌లు కూడా రావు. అప్పుడు అవకాశాల్ని మనమే సృష్టించుకోవాలి. ఎక్కువ మంది దర్శకులు నటీనటుల మునుపటి చిత్రాల ఫలితాల్ని దృష్టిలో ఉంచుకొనే సినిమాల్లో నటించే అవకాశం ఇస్తుంటారు. మరికొంత మంది.. అగ్రతారలుగా కొనసాగుతున్న నటులకు బదులుగా కొత్త ముఖాలను తెరపై చూపించడానికి ఆసక్తి చూపిస్తుంటారని చెప్పుకొచ్చింది. 2014లో 'ఫగ్లీ'తో సినీరంగంలోకి అడుగు పెట్టిన కియారా కెరీర్‌ను 'ఎమ్ఎస్ ధోని:ది అన్ టోల్డ్ స్టోరీ' సినిమా మలుపు తిప్పింది.



# విశాల్ బాగానే ఉన్నాడు

## - ఖుష్బూ

ఇటీవల విశాల్‌కు సంబంధించిన వీడియో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. 'మదగజరాజ' ఈవెంట్‌లో ఆయన వణుకుతూ కనిపించారు. దీంతో ఆయనకు ఏమైందోనని అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆయన జ్వరంతో బాధపడుతున్నట్లు టీమ్ చెప్పినప్పటికీ కొందరు ఆయన ఆరోగ్యంపై వాకబు చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే తాజాగా నటి ఖుష్బూ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ విశాల్ ఆరోగ్యంపై స్పష్టతనిచ్చారు.

"విశాల్ ఢిల్లీలో ఉన్నప్పుడే జ్వరం వచ్చింది. ఆ విషయం ఎవరికీ తెలియదు. కానీ, 'మదగజరాజ' సినిమా 11ఏళ్ల తర్వాత రిలీజ్ అవుతుందని అనారోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా ఈవెంటుకు వచ్చారు. ఆ రోజు విశాల్ డెంగీ ఫీవర్తో బాధపడుతున్నారు. జ్వరంతో ఎందుకు వచ్చారని అడిగాను. 11 ఏళ్ల తర్వాత ఇది ప్రేక్షకుల ముందుకువస్తోంది. దీనికి కచ్చితంగా రావాలనుకున్నాను' అని చెప్పారు. 103 డిగ్రీల జ్వరం కారణంగా వణికిపోయారు. ఆ ఈవెంట్ పూర్తికాగానే మేం విశాల్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లాం. ఇప్పుడు కోలుకుంటున్నారు. ఎవరూ కంగారుపడాల్సిన అవసరం లేదు" అని నటి చెప్పారు. కొంతమంది యూట్యూబర్స్ వ్యూస్ కోసం విశాల్ ఆరోగ్యంపై తప్పుడు వార్తలు రాస్తున్నారని ఆమె అసహనం వ్యక్తం చేశారు. సెలబ్రిటీల విషయంలో నిజానిజాలు తెలుసుకోకుండా తేలికగా వదంతులు రాసేస్తారన్నారు. 'మదగజరాజ' కోసం విశాల్ ఎంతో కష్టపడ్డారని ఆమె వ్యాఖ్యానించారు.



